

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 119

గురువారం 20-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బ్రిటన్‌లో టాటా గిగాఫ్యాక్టరీ!

ఈవీ బ్యాటరీల తయారీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.42,500 కోట్లు వెచ్చించనుంది. - 13లో



భారత్‌కు ఎదురుందా?

నేటి నుంచి వెస్టిండీస్‌తో రెండో టెస్టు. రెండు జట్ల మధ్య ఇది 100వ టెస్టు. - 12లో



నటేశ్వరశర్మకు దాశరథి పురస్కారం

దాశరథి కృష్ణమాచార్య స్మారక పురస్కారానికి ప్రముఖ రచయిత, సంస్కృతాంధ్ర కవి అయాచితం నటేశ్వరశర్మ ఎంపికయ్యారు.

- వివరాలు 5లో



ట్రాన్స్‌ఫార్మర్ పేలి 15 మంది మృతి

ఉత్తరాఖండ్‌లోని అలకనంద నదీ తీరంలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కర్మాగారంలో విద్యుదాఘాతంతో 15 మంది చనిపోయారు.


- వివరాలు 6లో



సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్!

ప్రపంచంలో శక్తిమంతమైన పాస్‌పోర్టు కలిగిన దేశంగా సింగపూర్ తొలి స్థానంలో నిలిచింది. భారత్‌కు 80వ ర్యాంక్ దక్కింది.

- వివరాలు 6లో



ఇది 'వజ్రాల వ్యాపార గని'

గుజరాత్‌లోని సూరత్‌లో ఒకేసారి 65 వేలమందికిపైగా పనిచేసుకునేందుకు వీలుగా అధునాతన భవంతి అందుబాటులోకొచ్చింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

జీతేగా భారత్...



26 ప్రతిపక్షాలతో కూడిన 'ఇండియా' కూటమి.. 'జీతేగా భారత్' (భారతదేశం జయిస్తుంది)ను తమ ట్యాగ్‌లైన్‌గా ఖరారు చేసుకుంది. దీన్ని 'ఇండియా' కూటమిలోని పార్టీలు ఆమోదించినట్లు సమాచారం.

- వివరాలు 6లో

ప్రముఖ రచయిత శ్రీరమణ కన్నుమూత



ప్రముఖ కథకుడు, వ్యంగ్య వ్యాసరచయిత, సీనియర్ జర్నలిస్టు శ్రీరమణ (71) బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు గురువారం జరగనున్నాయి.

- వివరాలు 10లో

బీసీ దారిలో బీఆర్‌ఎస్

కాంగ్రెస్ బీసీ సభలు, డిక్లరేషన్‌కు ప్రతిగా కార్యాచరణ

- బీసీలను కూడగట్టడం.. కాంగ్రెస్‌ను ఎండగట్టడమే లక్ష్యం
- మంత్రి తలసాని కార్యాలయంలో పార్టీ బీసీ మంత్రులు, ప్రజాప్రతినిధుల భేటీ
- హైదరాబాద్‌తోపాటు పలుచోట్ల 'బీసీ గర్జన' సభల నిర్వహణ
- బీఆర్‌ఎస్ బీసీ పథకాలు, విధానాలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం
- త్వరలో బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పరేడ్‌కు యోచన
- 25న మరోమారు భేటీ... 93 బీసీ కుల సంఘాల నేతలను పిలవాలని నిర్ణయం

బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కాంగ్రెస్ భూస్థాపితమే..

మంత్రులు తలసాని, శ్రీనివాస్‌గౌడ్, గంగుల హెచ్చరిక



మంత్రి తలసాని నివాసంలో భేటీ అయిన లింగయ్య యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల, మధుసూదనాచారి, బండా ప్రకాశ్, ఎల్.రమణ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఉచిత విద్యుత్ అంశంలో కాంగ్రెస్‌పై మూకుమ్మడిగా విమర్శల దాడికి దిగిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) మరో అస్త్రాన్ని సంధించేందుకు సిద్ధమైంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్‌లోని బీసీ మంత్రులు, నేతలు లక్ష్యంగా చేసిన విమర్శలు.. బీసీల్లో పట్టు కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రయత్నాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిదాడికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో మిగతా 2వ పేజీలో ▶

బస్సు రూట్‌లో కాంగ్రెస్

రాష్ట్రంలోని ముఖ్యనేతలంతా కలసి యాత్ర చేపట్టాలని నిర్ణయం

- తెలంగాణ కాంగ్రెస్ ఐక్యంగా ఉందని ప్రజలకు సంకేతాలు పంపే యోచన
- ఎంపీ కోమటిరెడ్డి నివాసంలో సమావేశమైన ఠాక్రే, రేవంత్, భట్టి, ఉత్తమ్, జానా, కోదండరెడ్డి తదితరులు
- రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై చర్చ
- బస్సుయాత్రపై 22, 23 తేదీల్లో పీఏసీలో చర్చించి షెడ్యూల్ ఖరారు
- పార్టీలు, అభ్యర్థుల బలాబలాలు, సామాజిక వర్గాల ప్రభావంపై సర్వే
- బీఆర్‌ఎస్ వైఫల్యాలు, కాంగ్రెస్ హామీల్లోని ప్రధాన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం

బీఆర్‌ఎస్ నుంచి బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తారా: కోమటిరెడ్డి సవాల్



ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో సమావేశమైన కాంగ్రెస్ నేతలు రేవంత్‌రెడ్డి, భట్టి, జానారెడ్డి, షబ్బీర్‌అలీ, మాణిక్‌రావ్ ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ నేతలంతా కలసికట్టుగా ముందుకెళ్లాలని, అంతా ఐక్యంగా ఉన్నామని ప్రజలకు తెలియజెప్పేందుకు రాష్ట్రవ్యాప్త బస్సు యాత్ర చేపట్టాలని టీపీసీసీ కీలక నేతలు నిర్ణయించారు. ఎన్నికలను ఎదుర్కొనే విషయంలో అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో చర్చించాకే నిర్ణయాలు తీసుకోవాలని తీర్మానించారు. బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర కాంగ్రెస్ కీలక నేతలు ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసంలో మిగతా 2వ పేజీలో ▶

వాన లోటు తీరినట్టే!

- రాష్ట్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న వర్షాలు
- 3 జిల్లాల్లో అధికం.. 7 జిల్లాల్లో ఇంకా కొంత లోటు వర్షపాతమే..
- ఎగువన వానలతో పరవళ్లు తొక్కుతున్న గోదావరి, ఉప నదులు
- మరో రెండ్రోజులు వర్షాలు.. పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ 3లో

57.24 లక్షల ఎకరాల్లో పంటల సాగు - 3లో



తెలంగాణ సీజేగా జస్టిస్ అలోక్

- రాష్ట్రపతి ఆమోదముద్ర
- ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జడ్జి జస్టిస్ పి.సామ్ కోషి తెలంగాణ హైకోర్టుకు బదిలీ

6లో



జస్టిస్ కోషి

నేటి నుంచే సభా సమరం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు అధికార, విపక్షాలు సన్నద్ధం

- అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడమే లక్ష్యంగా విపక్షాల వ్యూహాలు
- మణిపూర్ హింస, యూసీసీ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఢిల్లీ ఆర్డినెన్స్‌పై ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయం
- యూసీసీ, ఢిల్లీ ఆర్డినెన్స్ సహా 21 బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు

6లో

క్లుప్తంగా...

పార్టీ పటిష్టానికి అధికార ప్రతినిధులే కీలకం

రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఠాక్రే



సాక్షి, హైదరాబాద్: పార్టీని పటిష్టపరచడంలో అధికార ప్రతినిధుల పాత్ర కీలకమని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే స్పష్టం చేశారు. ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసి ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని ఆయన సూచించారు. బుధవారం సాయంత్రం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డిలతో కలిసి ఆయన గాంధీభవన్‌లో పీసీసీ అధికార ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఠాక్రే మాట్లాడుతూ పార్టీ నియమ నిబంధనలు తెలుసుకుని సిద్ధాంతాలకు అనుగుణంగా అధికార ప్రతినిధులు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాల వారీగా ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా మాట్లాడాలని సూచించారు. ఎక్కడికక్కడ స్థానిక సమస్యలను గుర్తించి వెంటనే స్పందించాలని కోరారు. ప్రజా సమస్యలపై మాట్లాడినప్పుడే వారు మన పక్షాన నిలబడతారన్న విషయాన్ని గుర్తెరగాలని అధికార ప్రతినిధులకు ఠాక్రే దిశానిర్దేశం చేశారు.

నేడు కాంగ్రెస్‌లో గద్వాల జడ్పీ చైర్మన్ చేరిక


సాక్షి, హైదరాబాద్: గద్వాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య యాదవ్ దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఏఐసీసీ కార్యాలయంలో గురువారం అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షంలో వీరు కాంగ్రెస్‌లో చేరుతారు. వీరితో పాటు ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ కీలక నేత, మహబూబ్‌నగర్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే సహా ఐదారుగురు నేతలు కూడా పార్టీలో చేరుతారని గాంధీభవన్ వర్గాల సమాచారం. కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు.. ఢిల్లీ పెద్దలతో తెలంగాణలో చేపట్టాల్సిన పార్టీ కార్యక్రమాలపై చర్చించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క గురువారం ఢిల్లీ వెళ్లనున్నారు. కాగా, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి బుధవారం రాత్రి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు.

'వంద మంది ఒవైసీలు వచ్చినా.. యూసీసీని ఆపలేరు'

సాక్షి, హైదరాబాద్: ఒకే దేశం-ఒకే చట్టం ఉండాలన్న రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆలోచనలను అమలు చేయాల్సిందేనని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ స్పష్టం చేశారు. వర్షాకాల పార్లమెంటు సమావేశాలలోనే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. యూసీసీ అమలు చేయాలని కోరుతూ బుధవారం శివసేన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకొని బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ, ఎన్ని అరెస్టులు చేసినా ఉమ్మడి పౌర స్మృతి బిల్లు అమలు పొందేవరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేసారు. అసదుద్దీన్ ఒవైసీకి భయపడే కేసీఆర్ యూసీసీ బిల్లును వ్యతిరేకి స్తున్నారని విమర్శించారు.

'ఎమ్మెల్యేగా పోటీ చేయను'

జనగామ: 'రాజకీయాలంటే ఇష్టం లేదు.. ఎమ్మెల్యేగా పోటీ చేసే ఆలోచన లేదు.. అందుకే నాన్న పంచాయితీ విషయంలో సీఎం కేసీఆర్‌ను కలవలేదు' అని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కూతురు తుల్జా భవానీరెడ్డి అన్నారు. తన అధికారిక కార్యక్రమాలను కూతురు, అల్లుడు రాహుల్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి ఇటీవల హైకోర్టును ఆశ్రయించగా పోలీసులు వారిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయమై విచారణ నిమిత్తం తుల్జాభవానీరెడ్డి బంధువు రామకృష్ణను పోలీసులు బుధవారం పిలిపించగా, అల్లుడు, కూతురు సైతం జనగామ పీఎస్‌కు వచ్చారు. ఎమ్మెల్యే అధికారిక పర్యటనను అడ్డుకున్నారనే ఆరోపణలతో పాటు ఇతర విషయాలను పోలీసులు అడిగినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి రామకృష్ణ నుంచి వివరాలు సేకరించిన పోలీసులు.. తుల్జాభవానీరెడ్డి, రాహుల్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. కాగా, ముత్తిరెడ్డి అధికారిక కార్యక్రమాన్ని తాను ఎప్పుడూ అడ్డుకోలేదని తుల్జాభవానీరెడ్డి అన్నారు.



... అర్జంటుగా పార్టీ పునరుద్ధరణ కమిటీ వేయాలి సార్!

బస్సు రూట్‌లో కాంగ్రెస్

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశమయ్యారు. కోమటిరెడ్డి ఆహ్వానం మేరకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య నేతలు ఎం.కోదండరెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, జానారెడ్డి, షబ్బీర్‌అలీ, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, బి.మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు ఈ లంచ్ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, రాష్ట్ర పార్టీలోని అంతర్గత పరిణామాలపై చర్చించారు.



కోమటిరెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, జూపల్లి, సంపత్‌కుమార్, పొన్నాల, కోదండరెడ్డి, ఉత్తమ్, భట్టి విక్రమార్క, జానారెడ్డి, షబ్బీర్ అలీ తదితరులు

దూకుడుగా వెళ్లాల్సిందే..

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్, బీజేపీలపై రాజకీయ దాడులు చేయడంలో రాష్ట్ర కాంగ్రెస్ పక్షాన సఫలీకృతం అవుతున్నామని.. ఇక మీద ఈ దూకుడు మరింత పెంచాలని భేటీలో నేతలు నిర్ణయానికి వచ్చారు. ముఖ్యంగా నేతలంతా కలసి పనిచేస్తున్నారన్న భావన కలిగించాలని, ఇందుకోసం ఐక్యంగా బస్సు యాత్ర చేపట్టాలని నిర్ణయించారు. యాత్రలో ఎవరెవరు పాల్గొనాలి? ఎప్పట్నుంచి ఎప్పటి వరకు, ఏ రూట్లో యాత్ర నిర్వహించాలన్న దానిపై ఈనెల 22న లేదా 23న పీఏసీ సమావేశం నిర్వహించి ఖరారు చేయాలని అభిప్రాయానికి వచ్చారు.

అన్ని నియోజకవర్గాల్లో సర్వే..

ఎన్నికల కోసం అభ్యర్థుల ఖరారు అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని, ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సర్వే చేయించాలని నేతలు నిర్ణయించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీలు, అభ్యర్థుల బలాబలాలతోపాటు ఏ నియోజకవర్గంలో ఏ సామాజికవర్గం ఎంత మేర ప్రభావం చూపుతుందన్న అంశాలపై పక్కా అవగాహనకు వచ్చేలా సర్వే ఉండాలని.. త్వరగా దానిని ప్రారంభించాలని తీర్మానించారు. ఇదే సమయంలో బీఆర్‌ఎస్ వైఫల్యాలు, కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో విస్తృత చర్చ జరిగేలా ప్రచారం చేయాలని.. ప్రధానమైన అంశాలను ఎంచుకుని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అభిప్రాయానికి వచ్చారు. ఇక కొత్తగా పార్టీ చేరే వారిలో ఎక్కువ మంది ఎమ్మెల్యే టికెట్లపై ఆశలు పెట్టుకుని వస్తున్నారని.. బేషరతుగా పార్టీలో చేరాలనుకున్న వారికే అవకాశం ఇవ్వాలని, ఎన్నికల సమయంలో సమర్థులకే టికెట్లు ఇవ్వాలని నిర్ణయించారు. మరోవైపు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర నేతలు కాంగ్రెస్‌లో చేరే సందర్భంగా చేపట్టే బహిరంగసభ కోసం ఈనెల 30వ తేదీలోపు తేదీని ఖరారు చేసేలా ఢిల్లీ పెద్దలతో మాట్లాడాలని, ప్రియాంకా గాంధీ సమయం తీసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. దీనికి సంబంధించి ఠాక్రే, రేవంత్ గురువారం ఢిల్లీ వెళ్లనున్నారు.

బీఆర్‌ఎస్ నుంచి బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటిస్తారా?

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్
- బీసీలకు న్యాయం చేసింది కాంగ్రెస్ మాత్రమేనని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీనేనని, బీసీల గురించి తమకు బీఆర్‌ఎస్ పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీని పీసీసీ చీఫ్ చేసిందని, బీఆర్‌ఎస్‌కు దమ్ముంటే బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని సవాల్ చేశారు. బుధవారం తన నివాసంలో కీలక నేతలతో భేటీ అనంతరం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. మంత్రి తలసాని విమర్శలకు రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారే తప్ప బీసీలను కించపర్చేలా మాట్లాడలేదని పేర్కొన్నారు. అన్ని కులాలు, మతాలను గౌరవించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని చెప్పారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులంతా ఐక్యంగా ఉన్నారని చాటేందుకే ఈ భేటీ నిర్వహించామని చెప్పారు. మీటింగ్‌లో చర్చించిన అంశాలన్నీ బయటికి వెల్లడిస్తే నాలుగు నెలల తర్వాత ఖాళీ కావాల్సిన ప్రగతిభవన్ ఇప్పుడే ఖాళీ అవుతుందని వ్యాఖ్యానించారు.



ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులతో ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

భయాందోళన వద్దు..

ఉమ్మడి పౌరస్మృతిపై ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలకు ఏపీ సీఎం జగన్ భరోసా

సాక్షి, అమరావతి: ఈ ప్రభుత్వం మీ ప్రభుత్వమని.. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీల ప్రభుత్వం అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం ప్రజా ప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులకు స్పష్టం చేశారు. ఉమ్మడి పౌరస్మృతికి సంబంధించి ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ ప్రభుత్వం మీ మనసు నొప్పించేలా ఎప్పుడూ వ్యవహరించదని చెప్పారు. ఉమ్మడి పౌరస్మృతి అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి డ్రాఫ్ట్ రాలేదని, అందులో ఏ అంశాలు ఉన్నాయో కూడా ఎవరికీ తెలియదన్నారు. అయితే మీడియాలో, పలుచోట్ల విపరీతంగా చర్చనడుస్తోందని, అది చూసి ముస్లింలు పెద్ద స్థాయిలో తమ మనోభావాలను వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. బుధవారం ఆయన ముస్లిం ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, ఆ వర్గాలకు చెందిన ప్రతినిధులతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక రాష్ట్రానికి పాలకుడిగా, ముఖ్యమంత్రి స్థాయిలో తాను ఉన్నానని, ఇలాంటి పరిస్థితుల్లో మీరే ఉంటే ఏం చేసేవారో ఆలోచించి సలహాలు ఇవ్వాలని కోరారు. ముస్లిం ఆడబిడ్డల హక్కుల పరిరక్షణ విషయంలో ముస్లింలే వ్యతిరేకంగా ఉన్నారంటూ ప్రచారం నడుస్తోందని, ఇలాంటి దాన్ని మత పెద్దలుగా మీరు తిప్పికొట్టాలని సూచించారు. ఒకే కడుపున పుట్టిన బిడ్డల విషయంలో ఏతండ్రి, తల్లి అయినా ఎందుకు భేద భావాలు చూపుతారని, మహిళలకు సమాన హక్కుల విషయంలో ఏ మాత్రం రాజీ లేదనే విషయాన్ని మనందరం స్పష్టం చేద్దామని పిలుపునిచ్చారు.

బెంగళూరుకు వెళ్లలేదంటే బీజేపీతో ఉన్నట్టు కాదు

అఖిలపక్ష సమావేశం అనంతరం బీఆర్‌ఎస్ ఎంపీ కె. కేశవరావు



సాక్షి, న్యూఢిల్లీ: బెంగళూరులో ఇటీవల జరిగిన విపక్ష పార్టీల సమావేశానికి బీఆర్‌ఎస్ హాజరుకాలేదంటే తాము బీజేపీతో ఉన్నట్టు కాదని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే.కేశవరావు స్పష్టం చేశారు. 26 పార్టీలు ఒకవైపు, 38 పార్టీలు ఒకవైపు అన్న లెక్కలు రాజకీయాల్లో పనికిరావని, సిద్ధాంతపరంగా ఎవరు ఎటు ఉన్నారు అన్నది చూడాలన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్‌ఎస్ తరపున ఎంపీలు కే.కేశవరావు, నామా నాగేశ్వరరావులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ కేకే మీడియాతో మాట్లాడుతూ రాజకీయాల్లో అర్థ గణాంకాలు పనిచేయవని, రెండు రెండు నీటి బిందువులు కలిస్తే నాలుగు బిందువులు కావని కేవలం ఒక నీటి బిందువే అవుతుందన్నారు. కూటములు విఫల ప్రయోగాలు అని ఇప్పటికే రుజువైందని వ్యాఖ్యానించారు. ఇండియా కూటమిలో ఉంటే బీజేపీకి వ్యతిరేకం అని, లేకపోతే బీజేపీకి మిత్రులని అనుకోవద్దన్నారు. ఐదుగురు జడ్జీల విషయంలో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కాదంటూ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ ఆర్డినెన్స్ తేవడం అహంకారపూరితమని కేకే మండిపడ్డారు. న్యాయమూర్తుల కంటే తమకే ఎక్కువ తెలుసు అన్న ధోరణిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

విభజన చట్టంలోని అంశాలపై చర్చ జరగాలి: నామా

విభజన చట్టంలోని హామీలు, పెండింగ్‌లో ఉన్న అంశాలపై పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చర్చ జరగాలని అఖిలపక్ష సమావేశంలో కోరామని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాలు, పెండింగ్ నిధుల అంశంపై చర్చ జరగాలని ప్రతీ పార్లమెంట్ సమావేశ సమయంలో పట్టుబడుతున్నా, కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ సమావేశాల్లో గవర్నర్ వ్యవస్థపై కూడా చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని నామా డిమాండ్ చేశారు.

కల్లు చెట్లకు నంబరింగ్..

ఎక్సైజ్ సమీక్షలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కల్లుగీసే చెట్లన్నింటికీ నంబర్లు వేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఆగస్టు 31లోగా రాష్ట్ర వ్యాప్తంగా తాటి, ఈత, ఖర్జూర, గిరుక తాటి చెట్లకు నెంబరింగ్ పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఎక్సైజ్ శాఖ కార్యకలాపాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ మహ్మద్ ముషరాఫ్ ఫారూఖీ, బ్రేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్‌తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కల్లు చెట్ల నరికివేతలను నియంత్రించాలని, ఈ నరికివేతలకు పాల్పడే వారికి కనీసం మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీ దారిలో బీఆర్‌ఎస్

▶ మొదటి పేజీ తరువాయి

బుధవారం బీఆర్‌ఎస్ బీసీ నేతల కీలక భేటీ జరిగింది. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సంస్థల చైర్మన్లు ఇందులో పాల్గొన్నారు. భేటీపై కొన్ని గంటల ముందు మాత్రమే సమాచారం అందడంతో పరిమిత సంఖ్యలోనే బీసీ నేతలు హాజరయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 25న విస్తృతస్థాయిలో బీసీ నేతల భేటీ నిర్వహించాలని నిర్ణయించారు.

కాంగ్రెస్‌ను ప్రజాక్షేత్రంలో ఎండగడదాం

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇటీవల బీసీ మంత్రులు, ఇతర నేతల పట్ల చేసిన వ్యాఖ్యలు, బీసీ నేత దాసోజు శ్రవణ్‌కు వచ్చిన బెదిరింపులు తదితర అంశాలు తలసాని ఆధ్వర్యంలోని భేటీలో ప్రస్తావనకు వచ్చాయి. బీసీ సభల పేరిట ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ చేస్తున్న హడావుడి, సూర్యాపేటలో సభ నిర్వహించి బీసీ డిక్లరేషన్ ప్రకటించేందుకు చేస్తున్న సన్నాహాలపైనా నేతలు చర్చించారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ ప్రభుత్వం బీసీల కోసం అమలు చేసిన పథకాలు, చేకూరిన లబ్ధి తదితరాలను విశ్లేషించారు. ఆత్మ గౌరవ భవనాలు మొదలుకుని అన్ని బీసీ కులాల కోసం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్‌ను ఎండగట్టాలని.. లేకుంటే కాంగ్రెస్ బీసీలను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని భేటీలో పాల్గొన్న నేతలు అభిప్రాయపడ్డారు.



మాట్లాడుతున్న తలసాని. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, గంగుల

కార్యాచరణపై ఈ నెల 25న విస్తృత భేటీ

బీసీల ఆత్మగౌరవాన్ని చాటడంతోపాటు బీసీల కోసం బీఆర్‌ఎస్ అనుసరిస్తున్న విధానాలు, పథకాలను వివరించేందుకు 'బీసీ గర్జన' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించాలని బీఆర్‌ఎస్ బీసీ నేతలు నిర్ణయించారు. హైదరాబాద్‌తోపాటు ఇతర జిల్లా కేంద్రాల్లోనూ బీసీ ఆత్మగౌరవ సభలు నిర్వహించాలనే ఆలోచనకు వచ్చారు. రాష్ట్ర మంత్రివర్గం మొదలుకుని పార్లమెంట్, అసెంబ్లీ, ప్రభుత్వ కార్పొరేషన్లు, స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలతో పరేడ్ నిర్వహించాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. ఈ కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఈ నెల 25న హైదరాబాద్‌లో మరోమారు విస్తృత స్థాయి భేటీ నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, 93బీసీ కుల సంఘాల నేతలను ఆహ్వానించనున్నారు.

బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కాంగ్రెస్ భూస్థాపితమే..

తలసాని, శ్రీనివాస్‌గౌడ్, గంగుల హెచ్చరిక

బీసీ ప్రజాప్రతినిధులపై వ్యక్తిగతంగా కించపర్చే ఆరోపణలు చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీరు సరికాదని మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ మండిపడ్డారు. బీసీల జోలికొస్తే బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. తలసాని కార్యాలయంలో బీసీ నేతల భేటీ అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. బీసీలలో ఎదుగుతున్న నాయకత్వాన్ని చులకన చేస్తూ కొందరు కాంగ్రెస్ నేతలు అహంకారంతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. పెయిడ్ ఆర్టిస్టులతో బీసీల్లో కొట్లాట పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జనాభాలో 56శాతంగా ఉన్న బీసీలు ఆత్మగౌరవాన్ని వదులుకోబోర న్నారు. 130 ఏళ్ల చరిత్ర ఉందంటున్న కాంగ్రెస్ ఎంత మంది బీసీలకు ఎమ్మెల్యేలుగా టికెట్లు ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలను కదిలించేందుకు అవసరమైన కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

చంద్రబాబు వారసుడు రేవంత్

ఉచిత విద్యుత్‌పై సోయి లేకుండా మాట్లాడుతున్నారు.. కాంగ్రెస్ నేతలపై మంత్రి హరీశ్‌రావు ధ్వజం

సాక్షి, సిద్దిపేట: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు నిజమైన వారసుడు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు అన్నారు. ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ పార్టీ నేతల వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం సిద్దిపేటలోని రాఘవపూర్ రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో పేలిపోయే ట్రాన్స్‌ఫార్మర్లు, కాలిపోయే మోటార్లు ఉండేవని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు వ్యవసాయం దండగ అన్నారని, కరెంట్ చార్జీలు తగ్గించమని పోరాడిన రైతులను కాల్చి చంపాడని మండిపడ్డారు. శిష్యుడు రేవంత్‌రెడ్డి కూడా చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తున్నాడని విమర్శించారు. 'ఓ కాంగ్రెస్ నాయకుడు ఉచిత కరెంట్ వద్దంటాడు, ఒకరు మూడు గంటలు చాలు, మరొకరు ఎనిమిది గంటలు చాలంటాడు. వారంతా సోయి లేకుండా మాట్లాడుతున్నారు' అని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి నాయకులు మనకు అవసరమా అని ప్రశ్నించారు. మూడు గంటల కరెంట్ అందించే పార్టీ కావాలా.. మూడు పంటలకు 24 గంటల ఉచిత కరెంట్ అందించే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనసాగాలో రైతులు ఆలోచించాలని మంత్రి కోరారు.



సిద్దిపేట జిల్లా రాఘవపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సమ్మె వీడి.. విధుల్లో చేరండి..

గ్రామ పంచాయతీ కార్మికులు వెంటనే సమ్మె వీడి విధుల్లో చేరాలని హరీశ్‌రావు కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అడగకుండానే రూ.వెయ్యి వేతనాన్ని పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికీ సీఎం కేసీఆర్ పరిశీలనలో పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లు ఉన్నాయని, సమయానుకూలంగా నిర్ణయం తీసుకుంటారని భరోసా ఇచ్చారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్మికులతో చర్చలు జరిపి వీలైనంత త్వరగా సాయం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు.

కేసీఆర్‌ను ఎవ్వరూ నమ్మరు..

- దబ్బులు సమకూరుస్తానని చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు
- జాతీయ రాజకీయాల్లో రెంటికీ చెడ్డ రేవడిలా ఆయన పరిస్థితి
- బీజేపీ నేత ఈటల ధ్వజం



అబిడ్స్: జాతీయ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైందని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. తాను అనుసరిస్తున్న అవకాశ రాజకీయ విధానాలతో అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ నమ్మే పరిస్థితి లేదన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. చివరికి తెలంగాణ ప్రజలు కూడా కేసీఆర్‌ను నమ్మడం లేదన్నారు. 'విమానాలు వేసుకొని అన్ని పార్టీల దగ్గరికి వెళ్లి.. నన్ను నాయకున్ని చేయండి దేశమంతా ఎన్నికలకు ఫండింగ్ చేస్తా' అని చెప్పి వచ్చారు. అయినా ఆయన్ను ఎవరూ నమ్మడం లేదు' అని ఈటల విమర్శించారు.

ఊదితే కొట్టుకు పోయే పార్టీ బీఆర్‌ఎస్...

'అక్రమ కేసులు పెట్టి బీజేపీ నాయకులను, కార్యకర్తలను వేధిస్తున్నారు. మీ పాలనకు పోయేకాలం వచ్చింది. కేసీఆర్ మీ పార్టీ ఊదితే కొట్టుకుపోయే పార్టీ. మాతో గొక్కోవద్దు, ఖబడ్దార్' అని ఈటల హెచ్చరించారు. గోషామ హల్‌లో, గజ్వేల్‌లో, హుజూరాబాద్ తదితర చోట్ల బీఆర్‌ఎస్ నేతలు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ అసహనంతో బీజేపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గమనిస్తోందన్నారు. గోషామహల్‌లో బీఆర్‌ఎస్ నేతలు దౌర్జన్యం చేస్తుంటే బీజేపీ కార్పొరేటర్ శశికళ సముదాయించే ప్రయత్నం చేయగా.. చివరికి ఆమెపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌తో ఈటల భేటీ

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌తో ఈటల సమావేశమయ్యారు. ధూల్‌పేటలోని రాజాసింగ్ నివాసానికి విచ్చేసి పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే ఈటల మీడియాతో మాట్లాడుతూ, రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత జాతీయ నాయకత్వ పరిధిలో ఉందన్నారు. దీనిపై త్వరలోనే నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్, మజ్లిస్ పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా తిరిగి బీజేపీదే విజయమన్నారు. కార్యకర్తలకు, నాయకులకు తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు.

బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయండి

- విందులు, ప్రభుత్వ కార్యక్రమాల కోసమే రైతు వేదికలు
- కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్ రెడ్డి




యాత్రను ప్రారంభిస్తున్న సాజిద్‌ఖాన్

కైలాస్‌నగర్(ఆదిలాబాద్):రుణమాఫీ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దీనిపై బీఆర్‌ఎస్ నాయకులను రైతులు నిలదీయాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకెట అన్వేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. రైతులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఎండగడుతూ కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త రైతు భరోసా యాత్ర బుధవారం ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రారంభమైంది. శాంతినగర్ నుంచి మొదలైన ఈ బస్సుయాత్రను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి ప్రధాన వీధుల గుండా కలెక్టరేట్ వరకు సాగింది. కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి రైతు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ...ప్రతీ బడ్జెట్‌లో రుణమాఫీ కోసమంటూ రూ.25వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వం, రూ.1,200 కోట్లను మాత్రమే మాఫీ చేసిందన్నారు. మిగతా నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులకు తొమ్మిదేళ్లలో ప్రభుత్వం పైసా నష్టపరిహారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వేదికలు విందులు, అధికార పార్టీ కార్యక్రమాల కోసం ఉపయోగపడుతున్నాయే తప్ప రైతులకు వాటితో ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. ధరణి బాధితులు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

'ఇండియా'లో బీఆర్‌ఎస్ లేకున్నా పొత్తు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని స్పష్టీకరణ
- ఇలాంటి పరిస్థితి కేరళ, బెంగాల్‌లోనూ ఉంది
- బలమైన స్థానాల్లో సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేస్తాయని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: 'ఇండియా' కూటమిలో బీఆర్‌ఎస్ లేకపోయినా ఆ పార్టీతో పొత్తుకు సంబంధించి సీపీఐ, సీపీఎంకు ఎలాంటి సమస్య లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఆ కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు రాష్ట్రంలో కలిసి పోటీ చేసే అంశం తలెత్తదన్నారు. 'ఇండియా' కూటమికి, రాష్ట్రంలో ఉన్న పరిస్థితులకు సంబంధం లేదన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేరళ ఎన్నికల్లో వామపక్షాలు, కాంగ్రెస్ కూటములే ప్రధాన ప్రత్యర్థులని, అలాగే పశ్చిమ బెంగాల్‌లో సైతం తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు ప్రత్యర్థు లని, కానీ జాతీయ స్థాయిలో దేశం కోసం 'ఇండియా' కూటమిలో భాగస్వాములుగా లేరా? అని కూనంనేని ప్రశ్నించారు. రాష్ట్రాల్లో ఆయా పార్టీల మధ్య పోరాటం ఉన్నప్పటికీ దేశ ప్రజల ప్రయోజనాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీజేపీని ఓడించేందుకు జాతీయ స్థాయిలో ఒకటిగా ఉన్నామని వివరించారు.

ప్రీ పోల్, పోస్ట్ పోల్ పొత్తులు

కొన్ని ఎన్నికల ముందు (ప్రీ పోల్), కొన్ని ఎన్నికల అనంతర (పోస్ట్ పోల్) పొత్తులు ఉంటాయని కూనంనేని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకున్నా మని, ఆ పొత్తు కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీపీఐ, సీపీఎం బలంగా ఉన్న నియోజకవర్గాలను గుర్తించామని, ఈ స్థానాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పోటీ చేస్తామని చెప్పారు.

26 నుంచి 'సేవ్ ఆర్టీసీ' పేరిట నిరసన

ప్రమాదంలో పడిన ఆర్టీసీని రక్షించుకునేందుకు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు 'సేవ్ ఆర్టీసీ' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద నిరసన కార్యక్రమాలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తామని కూనంనేని తెలిపారు. ఆగస్టు 7న ఇళ్లు, గుడిసెలకు పట్టాలివ్వాలనే డిమాండ్‌తో పాటు ఇతరత్రా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్‌లు ముట్టడిస్తామన్నారు.

బీఎస్పీది ఒంటరి పోరే: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



సుల్తానాబాద్ (పెద్దపల్లి జిల్లా) : వచ్చే ఎన్నికల్లో లోక్ సభ, అసెంబ్లీ స్థానాలకు బీఎస్పీ ఒంటరి గానే పోటీ చేస్తుందని అందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. బహుజన రాజ్యాధికార యాత్ర బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానా బాద్‌కు చేరింది. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ... ఇప్పటివరకు 1,800 గ్రామాల్లో యాత్ర పూర్తి చేశామన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఎన్డీఏ, యూపీఏకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని తెలిపారు. మానేరు నది నుంచి ఇసుక లారీల ద్వారా అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడమేమిటని ప్రశ్నించారు. ఇందులో సీఎం, మంత్రి, ఎమ్మెల్యేల వరకు 30% నుంచి 40% కమీషన్ వెళ్తోందని, ఆ డబ్బులతోనే బీఆర్‌ఎస్ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



సోయగాల సబ్బితం జలపాతం

వర్షాలకు సబ్బితం వద్ద గల గౌరిగుండాల జలపాతం కనువిందు చేస్తోంది. పచ్చని కొండల మధ్య నుంచి ఎగిసిపడుతూ.. ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఈ జలపాతాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున వస్తుంటారు. కానీ రహదారి సరిగ్గా లేకపోవడంతో కుటుంబసమేతంగా వెళ్లాలంటే కష్టమేనని ప్రకృతి ప్రేమికులు చెబుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఆలయ అష్టభుజి ప్రాకార మండపంలో కారుతున్న వర్షపు నీరు

యాదాద్రిలో మళ్లీ లీకేజీలు

వర్షానికి కారుతున్న ప్రధానాలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపాల్లో మళ్లీ లీకేజీలు ఏర్పడ్డాయి. ముసురు వర్షంతో ఆలయ అష్టభుజి ప్రాకార మండపం గోడలు, స్లాబ్‌పై నుంచి వర్షం నీళ్లు కారుతున్నాయి. ప్రధానాలయం ప్రారంభమై ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ ఇంకా లీకేజీలను అరికట్టకపోవడంతో భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు వర్షం వల్ల ఏర్పడిన లీకులకు మరమ్మతులు చేపట్టినా.. అవి పునరావృతం అవుతున్నాయి.



ఉధృతంగా బొగత జలపాతం

- వర్షాలతో ప్రమాదకరస్థాయిలో ప్రవాహం
- సందర్శకులకు అనుమతి నిరాకరణ

వాజేడు: వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తోంది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం నుంచి బొగత జలపాతానికి పర్యాటకులను నిలిపివేస్తున్నట్లు రేంజర్ చంద్రమౌళి తెలిపారు. పర్యాటకులు నిలబడే చోటు పైనుంచి బొగత జలపాతం ప్రవహిస్తున్నందున ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో రావద్దని ఆయన కోరారు. బొగత జలపాతం సందర్శన నిలిపివేసినట్టు తెలియని పర్యాటకులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.



వర్షపు నీటితో నిండిపోయిన కొత్తగూడెంలోని జీకే ఓపెన్‌కాస్ట్ గని

బొగ్గు ఉత్పత్తికి బ్రేకులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వర్షాల నేపథ్యంలో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోంది. లక్ష్యానికి మించి ఉత్పత్తిని అందించే ఓపెన్ కాస్ట్ గనుల నుంచి బొగ్గు పెల్ల కూడా బయటకు రాని పరిస్థితి నెలకొంది. సంస్థ పరిధిలో ఉన్న 24 భూగర్భ గనుల ద్వారా రోజుకు 27 వేల టన్నుల బొగ్గు వెలికితీయాల్సి ఉండగా, ప్రస్తుతం అది 15 వేల టన్నులకే పరిమితమైంది. ఇక ఓపెన్‌కాస్ట్‌ల్లో రోజుకు 1.68 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండగా 1.14 లక్షల టన్నులే వస్తోంది. దీంతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యంలో 34 శాతం మేరకు కోత పడుతోంది.



భద్రాచలం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి



భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెం-కట్టుగూడెం రహదారిపై వరద



గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని బొల్లెపల్లి వాగు దాటుతున్న అధికారులు


వాన లోటు తీరినట్టే!

రాష్ట్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న వర్షాలు

- చాలా జిల్లాల్లో గణనీయంగా వర్షపాతం.. 3 జిల్లాల్లో అధికం
- ఏడు జిల్లాల్లో ఇంకా కొంత లోటు..
- మరో రెండ్రోజులు వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ
- పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో గోదావరి, ఉప నదుల పరవళ్లు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: : రాష్ట్రమంతటా మూడు రోజులుగా వాన ముసురుకుంది. మరో రెండు రోజులూ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించి నెలరోజులైనా వానలుపడక నెలకొన్న లోటు అంతా తీరిపోతోంది. నాలుగైదు రోజుల కిందటి వరకు ఏకంగా 20 శాతం వరకు లోటు వర్షపాతం ఉండగా.. బుధవారానికి ఇది ఐదు శాతానికి తగ్గింది. నైరుతి సీజన్‌లో ఏటా ఈ సమయం వరకు 25.7 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఈసారి 24.48 సెంటీమీటర్లకు చేరింది. మరో రెండ్రోజులు వానలు కొనసాగే అవకాశం ఉండటంతో లోటు పూర్తిగా భర్తీ అవుతుందని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. జిల్లాల వారీగా చూస్తే.. 3 జిల్లాల్లో అధికంగా, 23 జిల్లాల్లో సాధారణ, 7 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది.

- **అధిక వర్షపాతం నమోదైన జిల్లాలు:** సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్
- **సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలు:** ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, జనగామ, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, ములుగు, నారాయణపేట, జయశంకర్ భూపాలపల్లి
- **లోటు వర్షపాతం ఉన్న జిల్లాలు:** మహబూబాబాద్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం




8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసరాలు, ఉత్తర ఏపీ తీరం, దక్షిణ ఒడిశా తీరంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దాని వల్ల వచ్చే 24 గంటల్లో వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా మరో రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉండటంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల మేర తక్కువగా నమోదవుతాయని తెలిపింది.

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణలోని పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో.. గోదావరి, దాని ఉప నదులు ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, తాలిపేరు పరవళ్లు తొక్కుతున్నాయి.

గోదావరిలో పెరిగిన వరద

బుధవారం సాయంత్రం 6 గంటలకు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీలోకి ప్రాణహిత నుంచి 5,41,430 క్యూసెక్కుల వరద వస్తుండగా.. గేట్లు ఎత్తి 5,25,250 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. దీనికి ఇంద్రావతి వరద తోడై సమ్మక్క (తుపాకులగూడెం) బ్యారేజీలోకి 6,53,170 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతుండగా.. అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. ఆ తర్వాత శబరి, ఇతర వాగుల ప్రవాహాలు కలిసి గోదావరి వరద పోలవరం వైపు పరుగుపెడుతోంది. భద్రాచలం వద్ద బుధవారం రాత్రి 11 గంటలకు గోదావరి వరద 35.07 అడుగులకు చేరింది. వానలు కొనసాగుతుండటంతో ప్రవాహం భారీగా పెరిగే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు ఎగువ గోదావరిలోనూ శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 33,760 క్యూసెక్కుల వరద వస్తోంది. నీటి నిల్వ 33.34 టీఎంసీలకు చేరింది.



కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తిన దృశ్యం

గోదావరి ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ఇన్‌ఫ్లో ఇలా..

ప్రాజెక్టు	గరిష్ట నీటి నిల్వ	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
జైక్వాడ్	102.73	47.16	319	319
శ్రీరాంసాగర్	90.31	33.34	33,760	1,029
ఎల్లంపల్లి	20.18	15.05	3,369	12,721
మేడిగడ్డ బ్యారేజీ	16.17	9.24	5,41,430	5,25,250
సమ్మక్క బ్యారేజీ	6.94	4.18	6,53,170	6,53,170
ధవళేశ్వరం	2.97	2.90	2,03,867	1,91,267

(బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి.. నిల్వ టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో/ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో..)

వానతో ఏజెన్సీ ప్రజల తిప్పలు

ఎడతెరిపి లేని ముసురు, వానలతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. వాగులు ఉప్పొంగి ప్రవహించి, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో.. ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు నెలలు నిండిన గర్భిణులను సమీపంలోని సామాజిక ఆస్పత్రుల్లో చేర్చుతున్నారు. వాజేడు, ఏటూరునాగారం మండలాల్లో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. మంగపేట మండలంలో మూడు ఇళ్లు కూలిపోయాయి. వెంకటాపురం(కె) మండలంలో నిర్మించిన పాలెం ప్రాజెక్టు ప్రధానకాల్వకు ఒంటిమామిడి గ్రామ సమీపంలో గండి పడింది.

గ్రావిటీ కాల్వకు మరమ్మతులేవి!

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో నిర్మించిన గ్రావిటీ కాల్వ వర్షాలతో కోతకు గురై కూలుతున్నా.. మరమ్మతులకు నోచుకోవడం లేదు. గత ఏడాది జూలై 14న భారీవర్షాలతో కాల్వ పొడవునా అక్కడక్కడా సిమెంట్ లైనింగ్ కోతకు గురైంది. ప్రస్తుతం రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఎగువ నుంచి వరదనీరు వచ్చి మరింత మట్టి కొట్టుకువస్తోంది. కొట్టుకు వచ్చిన మట్టితో పాటు వరద నీరు మొత్తం గ్రావిటీ కాల్వలోకి చేరుతోంది. ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు చేయకపోవడంతో కాల్వ పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది.



కాళేశ్వరం సమీపంలో కోతకు గురై కూలిన గ్రావిటీ కాల్వ

57.24 లక్షల ఎకరాల్లో పంటల సాగు

- అందులో పత్తి 37.98 లక్షల ఎకరాలు
- 7.94 లక్షల ఎకరాల్లో వరి నాట్లు
- వర్షాలతో ఊపందుకున్న వ్యవసాయం



నల్గొండ జిల్లా దుగ్గేపల్లిలో వరినాట్లు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానాకాలం సీజన్‌లో ఇప్పటివరకు 57.24 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, 46.06 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. వాస్తవంగా గతేడాది వానాకాలం సీజన్లో ఇదే సమయానికి 53.66 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంతకంటే ఇప్పుడు ఎక్కువ సాగు కావడం విశేషం. ఇటీవల వర్షాలు పుంజుకోవడంతో వ్యవసాయ పంటల సాగు ఊపు మీద ఉంది. కాగా, పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 37.98 లక్షల ఎకరాల్లో (75.07%) సాగైంది. ఇక వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 7.94 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.04 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.05 లక్షల ఎకరాల్లో (98.21%) సాగైంది. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 3 లక్షల ఎకరాల్లో సాగైంది.

ఆదిలాబాద్ జిల్లాల్లో 103 శాతం...

రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లాల్లో సాధారణం కంటే అధికంగా పంటలు సాగయ్యాయి. ఆ జిల్లాలో ఏకంగా 103.81 శాతం విస్తీర్ణంలో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ నివేదిక వెల్లడించింది. ఆ తర్వాత కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 91.55 శాతం, వికారాబాద్ జిల్లాలో 74.30 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. అత్యంత తక్కువగా వనపర్తి జిల్లాలో కేవలం 3.93 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. కాగా, రాష్ట్రంలో సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్, మహబూబాబాద్, ఖమ్మం, నాగర్‌కర్నూలు, వనపర్తి, సూర్యాపేట, జోగుళాంబ జిల్లాల్లో వర్షపాతం తక్కువ నమోదైంది. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందని వ్యవసాయశాఖ వెల్లడించింది. జూన్‌లో 44 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, జూలైలో ఇప్పటివరకు 34.32శాతం అధిక వర్షపాతం నమోదైందని వెల్లడించింది.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు: నిరంజన్ రెడ్డి

ఆలస్యమైనా వర్షాలు సాగుకు సహకరిస్తున్నాయని, ఆశాజనకంగా వ్యవసాయం సాగవుతోందని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.. సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ప్రత్యేక కమిషనర్ హన్మంతు కొండిబ పాల్గొన్నారు. మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కొత్తగా వచ్చిన ఐదు జిల్లాలతో కలిపి 2.30 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు.

నెలాఖరు నుంచి పీజీఈసెట్ కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్:ఇంజనీరింగ్ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులైన ఎంఈ, ఎంటెక్, ఎంఆర్క్, ఎం ఫార్మసీలో ప్రవేశానికి ఈ నెలాఖరు నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడుతున్నట్టు ఉన్నత విద్యామండలి తెలిపింది. మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి నేతృత్వంలో బుధవారం పీజీఈసెట్ కౌన్సెలింగ్‌పై చర్చించిన అనంతరం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 18 వరకు అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆగస్టు 7 నుంచి 9 వరకు ప్రత్యేక కేటగిరీలకు ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. ఆగస్టు 21 నుంచి 23 వరకు ఆప్షన్లు ఇచ్చే అవకాశం కల్పించారు. 26వ తేదీన సీట్లు కేటాయిస్తారు. ఆగస్టు 30లోగా సీటు వచ్చిన అభ్యర్థులు కళాశాలల్లో రిపోర్టు చేయాలి. రెండోదశ కౌన్సెలింగ్‌ను సెప్టెంబర్ 4 నుంచి చేపడతారు. సెప్టెంబర్ 19 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఉన్నత విద్యామండలి తెలిపింది.

పొనుగోడు బడికి ఐదుగురు టీచర్ల కేటాయింపు

గూడూరు(మహబూబాబాద్‌జిల్లా):మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు జెడ్పీహెచ్‌ఎస్‌కు మండల విద్యాధికారి శ్రీదేవి ఐదుగురు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపించినట్లు ప్రధానోపాధ్యాయుడు పూల్‌సింగ్ తెలిపారు. పొనుగోడు పాఠశాల విద్యాకమిటీ (ఎస్‌ఎంసీ) చైర్మన్ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్న హెచ్‌ఎం పూల్‌సింగ్‌ను బదిలీ చేయాలనుకుంటున్నట్లు తెలుసుకున్న విద్యార్థులు మంగళవారం పాఠశాల ఎదుట 'హెచ్‌ఎం బదిలీ ఆపాలి 'అంటూ ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి పొనుగోడు పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయులను కేటాయించారని తెలిపారు. కాగా, పాఠశాలను దత్తత తీసుకున్న వ్యక్తి నియమించిన 11 మంది ప్రైవేటు టీచర్లు విద్యార్థుల ఆందోళన అనంతరం విధులకు హాజరుకాలేదని హెచ్‌ఎం తెలిపారు.

99 లక్షల మంది పిల్లలకు డీవార్మింగ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 99 లక్షల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలోని 1–19 ఏళ్ల మధ్య వయసున్న వారికి ట్యాబ్లెట్ల పంపిణీని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హైదరాబాద్ నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల వేదికగా ప్రారంభించనున్నారు. గురువారం ట్యాబ్లెట్లు తీసుకోలేని విద్యార్థుల కోసం ఈ నెల 27న మరోసారి డీవార్మింగ్ కార్యక్రమం నిర్వహిస్తారు. గతేడాది 96.47 లక్షల మందికి ట్యాబ్లెట్లు పంపిణీ చేయగా... ఈసారి సుమారు 2.5 లక్షల మంది పెరిగారు.

అమ్ముకున్న సీట్లకు అధికారిక ముద్ర!

బీటెక్ 'బీ' కేటగిరీ సీట్లకు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్

- నేటి నుంచి కాలేజీల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు
- ప్రైవేటు కాలేజీల్లో ఇప్పటికే అమ్ముడుపోయిన సీట్లు
- జేఈఈ, ఎంసెట్ ర్యాంకు, ఇంటర్ మార్కుల చూడకుండానే సీట్లిచ్చేసిన కాలేజీలు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా భర్తీకి ఉన్నత విద్యామండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిబంధనల ప్రకారం సీట్లను భర్తీ చేసుకోవచ్చంటూ బుధవారం మార్గదర్శకాలు విడుదల చేసింది. కన్వీనర్ కోటా సీట్ల తొలివిడత కేటాయింపు ఇటీవలే పూర్తవగా మరో రెండు దశల్లో ఎంసెట్ సీట్ల కేటాయింపు ఉండే వీలుంది. ఈలోగా యాజమాన్య కోటా సీట్ల భర్తీ చేపట్టేందుకు మండలి అవకాశం కల్పించడం గమనార్హం. అలాగే బీఫార్మసీ, ఫార్మా–డీ విభాగాల్లోనూ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి వెసులుబాటు కల్పించింది. అయితే ఈ విభాగాల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ ఇప్పటివరకు చేపట్టలేదు. రాష్ట్రవ్యాప్తంగా 1.05 లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. అందులో 30 శాతం సీట్లు యాజమాన్య కోటాగా ఉంటాయి. అంటే దాదాపు 30 వేల వరకు సీట్లు ఉంటాయి.

ఇలా భర్తీ చేయాలి...

అన్ని కాలేజీలూ గురువారం తమ పరిధిలో ఏయే బ్రాంచీల్లో ఎన్ని సీట్లున్నాయనే వివరాలతో పత్రికా ప్రకటన ఇవ్వాలి. ఆ వివరాలను ఈ నెల 31లోగా కాలేజీల వెబ్‌సైట్‌లలో పొందుపరచాలి. వచ్చే నెల 31న కాలేజీలలో జరిగే అడ్మిషన్ల వివరాలు వెల్లడించాలి. సెప్టెంబర్ 15 వరకూ విద్యార్థుల నుంచి యాజమాన్య కోటా కింద దరఖాస్తులు తీసుకోవాలి. మొత్తం యాజమాన్య సీట్లలో 15 శాతం ప్రవాస భారతీయుల పిల్లలు, వారు సిఫార్సు చేసే వారికి ఇవ్వాలి. మరో 15 శాతం సీట్లను ర్యాంకులవారీగా యాజమాన్యం భర్తీ చేయాలి. ఈ విభాగంలో ప్రవేశం పొందే విద్యార్థుల నుంచి రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ (టీఎస్ఎఫ్ఆర్‌సీ) నిర్ణయించిన ఫీజులను తీసుకోవాలి. ఎలాంటి ఫీజు రీఇంబర్స్‌మెంట్ ఈ విభాగానికి వర్తించదు. ఎన్ఆర్ఐ కోటా కింద తీసుకొనే సీట్లకు నిర్ణీత ఫీజు కాలేజీనిబట్టి డాలర్లలో ఉంటుంది. 'బీ' కేటగిరీ సీట్లను ముందుగా జేఈఈ ర్యాంకు ఆధారంగా భర్తీ చేయాలి. ఆ తర్వాత ఎంసెట్ ర్యాంకును, తర్వాత ఇంటర్ మార్కులను పరిగణనలోకి తీసుకోవాలని ఉన్నత విద్యామండలి మార్గదర్శకాల్లో పేర్కొంది.

ముందుగానే బేరాలు...

నిజానికి ఎంసెట్ ఫలితాలు రాగానే యాజమాన్య కోటా సీట్ల భర్తీ ప్రక్రియ మొదలైపోతోందనేది ఏటా వస్తున్న ఆరోపణే. కన్వీనర్ కోటాలో మంచి కాలేజీ, బ్రాంచి రాదని భావించే వారు యాజమాన్య కోటా కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కాలేజీల యాజమాన్యాలు సీట్లను భారీ మొత్తానికి బేరం పెడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కాలంలో కంప్యూటర్ సైన్స్, ఇతర కంప్యూటర్ కోర్సులకు భారీ డిమాండ్ ఉండటంతో ముందే బేరం కుదుర్చుకుంటున్న కాలేజీలు... నోటిఫికేషన్ జారీ ప్రక్రియను సాధారణ విషయంగానే భావిస్తున్నాయి. ఈ సమయంలో ఎవరు దరఖాస్తు చేశారు? ర్యాంకులు ఏమిటి? అనే వివరాలపై అధికారులు ఆరా తీయడం సాధ్యం కావడం లేదు. ఆన్‌లైన్‌లో యాజమాన్య కోటా సీట్లను భర్తీ చేస్తే తప్ప దీన్ని నియంత్రించడం సాధ్యం కాదని అన్ని వర్గాలూ చెబుతున్నాయి. కానీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయట్లేదు. దీంతో 'బీ' కేటగిరీ సీట్ల భర్తీ నోటిఫికేషన్ కేవలం అప్పటికే అమ్ముకున్న సీట్లకు అధికారిక ముద్ర వేసే ప్రక్రియగానే మిగిలిపోతోంది.

ర్యాంకుల ప్రకారమే సీట్లు ఇవ్వాలి



యాజమాన్య కోటా సీట్ల భర్తీలోనూ కాలేజీలు నిబంధనలు పాటించాలి. ర్యాంకుల ప్రకారమే సీట్లు ఇవ్వాలి. ముందే అమ్ముకున్నారనే ఆరోపణలపై ఆధారాలుంటే ఎవరైనా మాకు ఫిర్యాదు చేయవచ్చు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. యాజమాన్య కోటాలో అర్హత ఉండి కూడా సీటు రాని వారు సైతం ఆ విషయాన్ని మా దృష్టికి తేవాలి. – ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, ఉన్నత విద్యామండలి చైర్మన్



మన అత్యంత దౌర్భాగ్యాలు ఎప్పుడూ సంభవించవు.
అత్యధిక దురవస్థలు నిరీక్షణలోనే ఉంటాయి.
– హొనొరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 20 జూలై 2023

జవాబివ్వాల్సిన చిరుత ప్రశ్నలు!

దాదాపు ఏడు దశాబ్దాల క్రితం దేశంలో అంతరించిపోయిన వన్యప్రాణుల్ని మళ్ళీ పెంచిపోషించే ప్రయత్నం. పదినెలల క్రితం ఆర్భాటంగా మొదలైన ప్రాజెక్ట్. నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి 20 చీతాలను తీసుకువచ్చారు. గత సెప్టెంబర్ నుంచి 'ప్రాజెక్ట్ చీతా'కు జరిగినంత హంగామా అంతా ఇంతా కాదు. కానీ, మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయోద్యానంలో విడిచి పెట్టాక 4 నెలల్లో 8 చీతాలు మరణించడం ఈ యత్నంలోని లోపాలను ఎత్తిచూపుతోంది. ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్న 'జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ' మాత్రం ప్రకృతి సహజ కారణాలతోనే ఈ చీతాలన్నీ చనిపోయాయంటోంది. ఆ మాట శాస్త్రీయంగా లేదు. నిపుణులు లేవనెత్తిన ప్రశ్నలే అందుకు సాక్ష్యం. చీతాల కదలికలు తెలుసుకొనేందుకు మెడకు బిగించిన రేడియో ఫ్రీక్వెన్సీ కాలర్ల వల్ల వాటికి గాయమై, అక్కడ క్రిములు చేరాయనీ, అదే తాజా మరణానికి దారి తీసిందన్న మాటలు ఆందోళన రేపుతున్నాయి. ప్రాజెక్ట్ చీతా భవితవ్యం, శాస్త్రీయత సందేహాస్పదమవుతున్నాయి.

నిజానికి 2009లో జైరామ్ రమేశ్ పర్యావరణ మంత్రిగా ఉన్నప్పుడే ఈ చీతాల పునరావాస ఆలోచన జరిగింది. గత ఏడాది అది ఆచరణలోకి వచ్చింది. ఈ సెప్టెంబర్‌తో ప్రాజెక్ట్ చీతాకు ఏడాది పూర్తి కానుంది. నిరుడు సరిగ్గా ఆ సమయంలోనే నమీబియా నుంచి 8 చీతాలు భారత్‌కు చేరాయి. ఆ పైన ఈ ఫిబ్రవరిలో మరో 12 చీతాలను దక్షిణాఫ్రికా నుంచి ప్రభుత్వం రప్పించింది. దాదాపు 35 చీతాలతో అవి స్వయం సమృద్ధమయ్యే దాకా రానున్న దశాబ్దకాలంలో ఏటా 5 నుంచి 10 చీతాల్ని తేవాలన్నది యోచన. తొలి ఏళ్ళలో ఈ ప్రయోగం పెద్ద విజయం సాధించకపోవచ్చని ఆది నుంచీ అనుకుంటున్నదే. అది కాక అసలీ ప్రాజెక్ట్ ఏర్పాటులోనే ప్రాథమిక లోపాలున్నాయని విమర్శకుల వాదన. వేగంగా పరుగులు తీసే చీతాలకు కూనో ప్రాంతం సరిపోదన్నది ఒకటైతే, వాటిని దీర్ఘకాలం క్వారంటైన్‌లో ఉంచడం వల్ల ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా సిద్ధపడే సామర్థ్యం దెబ్బతింది. మానసికంగా సర్దుకుపోవడమూ సమస్య అయింది. అలా అవి సులభంగా బలి అవుతున్నాయి. తెచ్చిన చీతాలకు తోడు కొత్తగా ఇక్కడ పుట్టిన నాలుగింటిలో 3 కూనలు చనిపోయాయి.

గాయం కథలో శాస్త్రీయత లేదని ప్రభుత్వం అంటున్నా, ఈ అంశాలపై విచారించి, మిగిలిన చీతాలన్నిటికీ పూర్తిస్థాయి శారీరక పరీక్షలు చేయాలని నిపుణుల సంఘం సిఫార్సు చేయడం గమనార్హం. స్వేచ్ఛగా తిరిగేవాటిని పట్టి, కాలర్లు తీసేసి, ఈ పరీక్షలు చేయడం శ్రమతో కూడిన పని. సమయమూ చాలానే పడుతుంది. అప్పుడు కానీ, ప్రాజెక్ట్ చీతా భవితవ్యం తేలదు. చీతాల కోసం అసలు మనం ఎంచుకున్న కూనో ఉద్యానమే చిన్నదని నమీబియా నిపుణులు కుండబద్దలు కొట్టారు. ఆఫ్రికా లాంటి దేశాల్లో ఒక్కొక్క చీతా వేటాడి తినడానికీ, తిరగడానికీ సగటున 100 చదరపు కి.మీ.ల విశాల ప్రాంతం ఉంటుంది. కానీ, మన 'కూనో జాతీయోద్యానం'లో సగటున మూడు చీతాలకు కలిపి 100 చదరపు కి.మీ.ల జాగాయే ఉంది. అలాగే, చీతా స్వేచ్ఛగా సంచరించడానికీ, ఆహార సేకరణ, పునరుత్పత్తికీ నిర్నిరోధమైన 1600 చదరపు కి.మీ.ల పైగా విస్తీర్ణం కావాలి. కూనో జాతీయోద్యానం మొత్తం వైశాల్యం చూసినా 750 చదరపు కి.మీ.లే! ఎలా చూసినా దేశంలో చీతాల పునఃప్రవేశానికి విస్తీర్ణం సరిపోని ఈ ఉద్యానాన్ని ఎందుకు ఎంచుకున్నారనేది బేతాళ ప్రశ్న.

నమీబియా, దక్షిణాఫ్రికాల్లో చీతాలు చుట్టూ కంచె ఉన్న రిజర్వుల్లో ఉంటే, మన దగ్గర వాటిని కంచెలేని సహజమైన, అరణ్య వాతావరణంలో పెరగనివ్వాలని యోచన. కూనో జాతీయోద్యానంలోకి వదిలిన చిరుతలు కొన్ని ఆ పరిధిని దాటి, జనావాసాల్లోకి జొరబడిన వార్తలొచ్చాయి. ఇది పోనుపోనూ మనిషికీ, వన్యప్రాణులకూ మధ్య ఘర్షణకు దారి తీయవచ్చు. ప్రాజెక్ట్ చీతాకు రూపకల్పన చేస్తున్నప్పుడు ఈ సంగతులేవీ లెక్కలోకి తీసుకోకపోవడం ఆశ్చర్యకరమే! అధికారులు మాత్రం కూనో రిజర్వ్‌లో కావాల్సినంత స్థలం, చీతాలకు తగినంత ఆహారం ఉన్నాయంటున్నారు. మధ్యప్రదేశ్‌లోనే గాంధీసాగర్‌లో రెండో రిజర్వ్‌ను అభివృద్ధి చేసి, చీతా పునరావాస కేంద్రం స్థాపిస్తామని చెబుతున్నారు. అవన్నీ నిజమైతే మంచిదే. కానీ, పెద్ద పులులు, చిరుతలతో పోలిస్తే చీతాలు మహా సున్నితం. అడవిలో అవి తీవ్రంగా గాయపడే ప్రమాదం ఎక్కువ. ప్రస్తుతానికి మన దగ్గర వీటికి సింహాలు, చిరుత పులుల నుంచి పోటీ లేదు గనక కొంత నయం. కాలగతిలో ఇవి మన పరిస్థితులకు అలవాటు పడి భారత్‌ను తమ కొత్త ఆవాసంగా మారుస్తాయేమో చూడాలి.

అరణ్యాల్లో చీతా కూనలు బతికేరేటు 10 శాతమేనట! అంతే శాతం పెరిగిపెద్దవుతాయి. కాబట్టి మరణాలు సహజమేనని ప్రభుత్వ వాదన. కానీ ఇప్పటిదాకా కూనోలో చనిపోయిన చీతాల్లో ఒక్కటి మినహా అన్నీ పూర్తి అరణ్యంలో కాక ఒక చ.కి.మీ. విస్తీర్ణంలో పెట్టిన 'బోమస్' అనే ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉన్నవే. కాబట్టి, లోతుగా పరిశీలన చేయాలి. తక్షణమే ప్రాజెక్ట్ చీతా నుంచి పాఠాలు నేర్చుకోవాలి. జరిగిన పొరపాట్లను గుర్తించి, వాస్తవాలను ప్రజాక్షేత్రంలో పంచుకోవడం మరీ అవసరం. తద్వారా సంబంధిత నిపుణులతో పరిష్కారాలు కనుగొనవచ్చు. చీతాల నిర్వహణలో స్థానిక నైపుణ్యం లేదు గనక నిర్ణీత నిపుణుల అనుభవాన్ని ఆసరా చేసుకోవాలి. అలా కాక రోగాన్ని దాచిపెట్టి, వైద్యం చేస్తే ఫలితం లేకపోగా, వికటించే ప్రమాదం ఉంది. చీతాల పునరావాసం, పునరుత్పత్తి సవ్యంగా సాగాలంటే అధికారులు భేషజాలు వదలాలి. లేదంటే, మొదటికే మోసం వస్తుంది. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిన తొలి ఖండాంతర చీతా పునరావాస ప్రాజెక్ట్ అర్ధంతరంగా అంతిమ అధ్యాయానికి చేరుకుంటుంది. అలా జరగరాదంటే చిరుత ప్రశ్నలకు శాస్త్రీయమైన జవాబు కావాలి!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.తదియ రా.3.12 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** ఆశ్లేష ఉ.9.41 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.10.59 నుండి 12.43 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.54 నుండి 9.36 వరకు.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ. 6.00 నుండి 7.30 వరకు

బైడెనామిక్స్ ఒక భ్రాంతేనా?

విశ్లేషణ



డి. పాపారావు

అమెరికా మలిదఫా ఆర్థిక సంక్షోభంలోకి వేగంగా జారిపోతోంది. ఒక పక్క ద్రవ్యోల్బణం, మరో పక్క వృద్ధిరేటును కాపాడుకునేందుకు ఉద్దీపనల అవసరం అడకత్తెరలో పోకచెక్క పరిస్థితికి దిగజార్చాయి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టే పేరిట పెంచుతూ పోయిన బ్యాంకు వడ్డీ రేట్లు, ఆర్థిక మందగమనం దిశగా నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో జో బైడెన్ ప్రతిపాదిస్తోన్న 'బైడెనామిక్స్' నయా ఉదారవాద విధానాలకు ముగింపు కానున్నాయా? 1930లలో శారీరక శ్రమ ఆధారిత కాలంలో ఆనాటి అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ 'ప్రజాహిత కార్యక్రమాలు' పట్టాలు తప్పిన పెట్టుబడిదారీ వ్యవస్థలో తిరిగి ప్రజలకు ఉపాధిని కల్పించగలిగాయి. కానీ నేటి కృత్రిమ మేధ యుగంలో బైడెనామిక్స్ అటువంటి సానుకూల ఫలితాలను తిరిగి ఆవిష్కరించలేదు.

అమెరికాలో 1980ల వరకూ ఉన్న సంక్షేమ రాజ్య స్థానంలో మొదలైన ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు తెచ్చిపెట్టిన మోచేతినీళ్ల (ట్రికిల్ డౌన్) ఆర్థిక శాస్త్రం దారుణంగా విఫలమైందనేది స్పష్టం. దీనినే, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా అంగీకరిస్తున్నారు. ఆయన 'సరికొత్త'గా బైడెనామిక్స్ పేరిట ప్రతిపాదిస్తోన్న ఆర్థిక విధానాలు పాత రోత ట్రికిల్ డౌన్‌కూ, అది ప్రతిపాదించే కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలకూ ముగింపు కానున్నాయనేది అంచనా. అంటే 1930ల ఆర్థిక పెనుమాంద్య కాలంలో, నాటి అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డిలానో రూజ్‌వెల్ట్ నేతృత్వంలో ఆవిష్కరించిన సంక్షేమ రాజ్యం దిశగా తిరిగి అమెరికా ప్రయాణం కడుతోందని అనిపించక మానదు. బైడెన్ 2024లో మరోసారి అమెరికా అధ్యక్ష పీఠం ఎక్కి, కార్మిక, ఉద్యోగ, సామాన్య జనాల అనుకూల ఆర్థిక విధానాలను విజయవంతంగా 'కొనసాగించ'గలరా? ఒకవేళ బైడెన్ 2024లో మళ్లీ గెలవడం తథ్యం అనుకుంటే, ఆయన సరికొత్త కల అయిన పాత సంక్షేమ రాజ్యాన్ని తిరిగి పునరుద్ధరించగలరా?

దీనికి జవాబు సులువు. 1930లలో రూజ్‌వెల్ట్ అమలు జరిపిన 'ప్రజాహిత కార్యక్రమాలు' లేదా పబ్లిక్ వర్క్స్ నాడు పట్టాలు తప్పిన పెట్టుబడిదారీ వ్యవస్థలో, మరలా తిరిగి ప్రజలకు ఉపాధిని కల్పించగలిగాయి. నాటి మాంద్యంలో, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిన దశలో – ప్రైవేట్ పెట్టుబడిదారులు, ఇక ఎంతమాత్రమూ కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు లేదా మూతబడిన తమ పరిశ్రమలను తిరిగి తెరిచేందుకు సిద్ధంకాని స్థితిలో, నాటి అమెరికా ప్రభుత్వమే స్వయంగా పూనుకుని తన పెట్టుబడుల ద్వారా ప్రజలకు తిరిగి ఉపాధి కల్పించింది. ఈ విధంగా ప్రభుత్వం కల్పించిన ఉపాధి ద్వారా కాస్తంత పుంజుకున్న ప్రజల కొనుగోలు శక్తి – మార్కెట్లో ప్రైవేట్ ఉత్పత్తిదారులకు తిరిగి తమ సరుకును అమ్ముకునే అవకాశాన్ని కల్పించింది. తద్వారా వారు, తిరిగి తమ పరిశ్రమలను తెరవగలిగారు. ఫలితంగా, మాంద్యంతో పట్టాలు తప్పిన ప్రైవేటు కార్పొరేట్ వ్యవస్థ తిరిగి కోలుకోగలిగింది. ఈ క్రమంలోనే ప్రజలకు మరలా ఉద్యోగ అవకాశాలు తిరిగి వచ్చాయి.

నేటి బైడెనామిక్స్ కూడా దరిదాపుగా ఇదే ఆర్థిక సూత్రీకరణ ప్రాతిపదికన అమెరికాలో మాంద్యం స్థితిని అధిగమించే ప్రయత్నం చేయజూస్తోంది. గతంలోని సంక్షేమరాజ్యాన్ని కూలదోసి 1980లలో వచ్చిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలకు చరమగీతం పాడటం, దాని స్థానంలో సరికొత్త రూపంలో మరలా తిరిగి సంక్షేమ రాజ్యాన్ని ఆవిష్కరించడం ప్రస్తుతం బైడెన్ యత్నంగా ఉంది. 1930లు, 2023లలో ఒకే తరహా విధానాల అమలు సాధ్యమేనా?

1930లలోని సాంకేతిక పరిజ్ఞాన స్థాయి రూజ్‌వెల్ట్ అమలు జరిపిన పబ్లిక్ వర్క్స్ కార్యక్రమాలకు అనుకూలంగా ఉంది. ప్రభుత్వం పూనుకుని పెట్టుబడులు పెడితే, తద్వారా పెరిగిన ప్రజల కొనుగోలు శక్తి వల్ల... ప్రైవేటు రంగం కోలుకునేందుకు, ఉపాధి కల్పనకు నాడు అవకాశాలున్నాయి. ఎందుచేతనంటే, నాటి సాంకేతిక పరిజ్ఞానం యావత్తూ కేవలం శారీరక శ్రమను అనుకరించేది లేదా దానికి ప్రత్యామ్నాయంగా ఉండేది మాత్రమే. నేటికిలా మేధోశ్రమను అనుకరించే లేదా దానికి ప్రత్యామ్నాయం కాగల సాఫ్ట్‌వేర్ రంగం, ఇంటర్నెట్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు లేవు. కాబట్టే నాడు మానవ మేధస్సుకు, దాని నుంచి ఉద్భవించే నిపుణతలకు ప్రత్యామ్నాయం లేదు. కేవలం, మానవుడి శారీరక శ్రమను తగ్గించగల... ఉత్పత్తిని మరిన్ని రెట్లు పెంచ గల తరహా సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే నాడు అందుబాటులో ఉంది. కాబట్టి, నాడు ఇంకా మనిషికి వ్యవస్థలో పని కల్పించే అవకాశం ఉంది. ఫలితంగానే, నాడు ప్రభుత్వ పెట్టుబడులు ప్రైవేటు రంగం కోలుకుని అది తిరిగి ఉపాధి కల్పనను చేయగలిగేటందుకు పనికొచ్చాయి. కానీ, నేడు ప్రభుత్వ 'పెట్టుబడులు' ఉపాధి కల్పించేవిగా కాక, కేవలం ఆర్థిక వ్యవస్థకు ఉత్ప్రేరకాలుగా లేదా ఉద్దీపనలుగా మాత్రమే ఉంటున్నాయి. ఈ కారణం చేతనే, భారతదేశంలో కూడా గ్రామీణ పేద ప్రజానీకానికి ఉపాధి కల్పించే – జాతీయ ఉపాధి హామీ పథకంలో, యంత్రాల వినియోగంపై పరిమితులు పెడుతూ 2005–06 కాలంలోనే నిబంధనలు ఏర్పరచవలసి వచ్చింది.



కాబట్టి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోలు, ఆటోమేషన్ల యుగంలో బైడెనామిక్స్... నాటి రూజ్వెల్ట్ విధానాల వంటి సానుకూల ఫలితాలను తిరిగి ఆవిష్కరించలేదు. అలా జరగాలంటే ప్రస్తుతం మేధో శ్రమకు కూడా ప్రత్యామ్నాయంగా వచ్చిన అధునాతన సాంకేతికతలు అన్నింటినీ స్వచ్ఛందంగా పరిత్యజించుకోగలగాలి. ఒక రకంగా పాత పలుగు, పార దశకో లేకుంటే మర యంత్రాల దిశకో తిరిగి మళ్లగలగాలి. ఇది సాధ్యమా? అసాధ్యమనేదే ఇంగితం మనకు ఇచ్చే జవాబు. కాబట్టి, నేటి బైడెనామిక్స్ ఆచరణలో కేవలం ఆదర్శ వాదంగానే మిగిలిపోగలదు.

మరి ఏది దారి? మానవ జాతికి భవిష్యత్తు ఎలా? కోటానుకోట్ల మందికి ఉపాధి కల్పన నేటి సాంకేతికతల కాలంలో సాధ్యం కానట్టేనా? దీనికి జవాబు – సాధ్యమే! కానీ ఎలా? సాధారణంగా, విధానాల రూపకల్పన, మేనేజ్మెంట్ రంగాలలోని వారు వాడే పద జాలంలో 'అవుట్ ఆఫ్ ద బాక్స్ థింకింగ్' అనే మాట ఉంది. మామూలు రోజువారీ అలవాటుపడి పోయిన మూసపోత ఆలోచనా విధానాన్ని దాటుకుని ఆలోచించగలగడం. ఇక్కడ ఈ వ్యవస్థలో రోజువారీ మనం అలవాటుపడిపోయిన ఆలోచనా విధానం – పెట్టుబడిదారులు ఉండడం, వారు సరుకు ఉత్పత్తి రంగంలోనో లేదా సేవా రంగంలోనో పరిశ్రమలు పెట్టడం, తద్వారా మెజారిటీ ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించడం... అనేది. కానీ, నేడిది వర్కవుట్ కాని ఆలోచనా విధానం. ఎందుకంటే, ఏ పెట్టుబడిదారుడైనా, పెట్టుబడులు పెట్టేది లాభాల కోసమే. దాని ఫలితంగా అంటే, మరో రకంగా చెప్పాలంటే, ఈ క్రమంలో ఉపాధి కల్పన అనేది ద్వితీయ ప్రాధాన్యతా అంశం. మరి ఈ లాభాలను పెట్టుబడిదారుడు – మనుషుల స్థానంలో యంత్రాలను వినియోగించడం ద్వారా పొందగలిగితేనో? నేడు జరుగుతోంది అదే. నిజానికి, సాంకేతిక పురోగమన క్రమంలో జరుగుతూ వచ్చిందంతా అదే. కానీ, నేడు ఈ సాంకేతిక పరిజ్ఞాన ఎదుగుదల – ఉత్పత్తిలో మనిషికి ఏ ప్రాధాన్యతా లేదా అవసరం లేని స్థితికి చేరుకుంటోంది. అదీ విషయం!

ఈ క్రమంలో... వ్యవస్థాగత పరిమితులలో, బైడెన్ ముందుకు తెస్తోన్న బైడెనామిక్స్ ఆశిస్తోన్న సానుకూల ఫలితాలను తెచ్చిపెట్టలేదు. కాబట్టి నేడు ప్రపంచవ్యాప్తంగా మానవ కల్యాణం కోసం, ప్రజలందరి బాగుకోసం కావాల్సింది – మరో సరికొత్త వ్యవస్థాగత నిర్మాణం. ఎక్కడైతే కేవలం లాభాలే పరమావధి కావో... పెట్టుబడి అంతిమ లక్ష్యం ఆ లాభాల పెరుగుదల మాత్రమే కాదో అటువంటి సరికొత్త సామాజిక, ఆర్థిక నిర్మాణం మాత్రమే ప్రస్తుత నిరుద్యోగం, మాంద్యాలకు పరిష్కారం చూపగలదు. కాబట్టి, నేటి బైడెన్ యత్నం... కేవలం వ్యవస్థను కాపాడుకునే చిట్టచివరి దింపుడు కళ్లం ఆశగా మాత్రమే మిగిలిపోగలదు. కానీ అంతిమంగా అటు అమెరికా ప్రజానీకం, ఇటు మొత్తంగా ప్రపంచ ప్రజానీకం కూడా ఈ పరిష్కారం దిశగా కదిలి తీరుతారు. వారలా కదిలే దిశగా కాలం, పరిస్థితులే వారిని ప్రేరేపిస్తాయి. మానవ జాతి ఇప్పటివరకూ తన పరిణామ క్రమంలో అధిగమించలేక పోయిన చిక్కుముడి అంటూ ఏదీ లేదు. నేడు కూడా అంతే. మనిషి జయించి తీరుతాడు. దారి ముందుకే, విజయానికే.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు | 98661 79615

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ముఖ్య కారణం



ఇస్లాంకు సంబంధించిన రాజకీయ వ్యాఖ్యానం కొద్దిమంది ముస్లింలను దేశం కంటే మతమే ఎక్కువ అనేలా విజయవంతంగా ప్రభావితం చేయగలిగింది. ఎక్కువమంది ఉమ్మడి పౌర స్మృతిని ఆమోదించక పోవడానికి ఈ విశ్వాసమే ముఖ్య కారణం.
– తాహిర్ అన్వర్, హేతువాద ముస్లిం

గొప్పే!



గొప్పలు చెప్పుకోవడం కోసం కాదుగానీ, ఇవ్వాళ నేను టమోటా సూప్ తాగాను.
– సునీల్ గ్రోవర్, కమెడియన్

నిరాడంబర ముఖ్యమంత్రి



కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ (జూలై 18న మరణించారు) పుత్తుపల్లిలోని సెయింట్ జార్జ్ ఆర్థొడాక్స్ చర్చ్‌కు వచ్చేవారు. మెట్ల దగ్గర మామూలు మనిషిలా కూర్చునేవారు. దగ్గరలోనే ఆయనకు ఒక సాధారణ ఇల్లుంది. ఉదయం ప్రార్థన కాగానే చాలామంది నడుచుకుంటూ ఆయన ఇంటికి వెళ్లేవారు. అధికారంలో ఉన్నా, లేకున్నా వాళ్ల సమస్యలు విని పరిష్కారాలు వెతికేవారు. ఆయన నిరాడంబరత, నిజాయతీ మలయాళీ సమాజం మీద చెరిగిపోని ముద్ర వేశాయి.
– పాల్ కోశీ, బ్లాగర్

చిన్నవి బతకొద్దా?



పెద్ద బాలీవుడ్ సినిమాలు ఒకే రోజు విడుదలైనప్పుడు వాళ్లు చాలా నిరాశ చెందుతారు; పరిశ్రమలో ఒకరినొకరం పట్టించుకోవాలని మాట్లాడుతారు. కానీ కొన్ని షోలు నడిస్తే కూడా బతికే చిన్న బడ్జెట్ ఇండీ సినిమాల గురించి ఒక్క క్షణం ఆలోచించరు.
– ఓనీర్, దర్శకుడు

కొత్త పాఠం



ఇజ్రాయిల్ వ్యతిరేక, యూదు వ్యతిరేక విషయాలను తమ పాఠ్యపుస్తకాల్లోంచి తొలగించింది సౌదీ అరేబియా. బదులుగా హెజ్బొల్లా లాంటి తీవ్రవాద గ్రూపుల విషయాలతో పాటు, సహనం, శాంతిని పెంచే అంశాలను చేర్చింది. ఇది ఇరు దేశాలను కొత్త మధ్యప్రాచ్యానికి చేరువ చేస్తుంది.
– ఇన్బార్ కోహెన్, ఇజ్రాయిల్ వ్యాఖ్యాత

ఇలా రాయొచ్చా?



పొడి దగ్గు కోసం మా అమ్మ ఒక 'బీఏఎంఎస్' డాక్టర్ దగ్గరికి వెళ్లింది. ఆయన రెండు యాంటీ బయాటిక్స్ రాశాడు – అమోక్సిక్లావ్, సిప్రో. ఒక ఆయుర్వేద వైద్యుడు ఒక్క ఆయుర్వేద ఔషధం కూడా ఇవ్వకుండా అల్లోపతి మందులను రాయడం అనేది చర్చించాల్సిన రెండో విషయం. మొదటిది – ఒక పొడి దగ్గుకు రెండు యాంటీబయాటిక్సా అన్నది!
– వరద్ పాటిల్, ఎంబీబీఎస్ విద్యార్థి

విలాస జీవితం



వయసు పెరుగుతున్నకొద్దీ నాకు అర్థమవుతున్నది ఏమంటే, నడుచుకుంటూ పోగలిగే నగరంలో జీవించగలగడం ఒక విలాసం. ప్రకృతికి చేరువగా ఉంటూ, సౌకర్యంగా ఉండే దుస్తులు ధరిస్తూ, మంచి వాతావరణంలో కావాల్సిన సరుకులు కొనుక్కుంటూ, తాజా భోజనం చేస్తూ, పడుకునేముందు కాసేపు నక్షత్రాలు చూడటం కంటే మించినవి ఏమిటి!
– అనుశ్రీ, సైకాలజిస్ట్

అంతరిస్తున్న ఆదివాసీ భాషలు

ప్రపంచీకరణ, సరళీకరణ, సామ్రాజ్యవాద ధోరణులు పెరుగుతున్న నేపథ్యంలో అనేక ఆదివాసీ తెగలు అంతరిస్తున్నాయి. మిగిలిన తెగల వారి భాషా సంస్కృతులూ గిరిజనేతరులతో ఏర్పడిన సంబంధాల కారణంగా సంకరణం చెంది కనుమరుగవుతున్నాయి. ముఖ్యంగా గిరిజనేతరుల వలసలు ఏజెన్సీ ప్రాంతాలలో పెరగడం ఇందుకు ఒక కారణం. తెలుగు రాష్ట్రాలలోనూ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్‌లలో అధికంగా ఉన్న కోయత్తోర్ ప్రజలు ఎక్కువగా కోయ భాష మాట్లాడుతున్నారు.



ఎప్పుడైతే ఆదివాసీయేతర రాజులు గోండ్వానా లాంటి గిరిజన రాజ్యాలపై దండెత్తి వశం చేసుకున్నారో ఆదివాసీల భాషా సంస్కృతులూ అప్పటినుంచే ప్రమాదంలో పడ్డాయి. ఆధునిక కాలంలో రాజ్యాలు లేకపోయినా ప్రజా ప్రభుత్వాలు స్థానిక భాషలను పట్టించుకోకుండా అధికులు మాట్లాడే భాషలను అధికార భాషలుగా చేశాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇప్పుడు తెలంగాణలోనూ తెలుగు ప్రధాన అధికార భాష అయ్యింది. మహారాష్ట్రలో మరాఠీ భాష అక్కడ స్థానిక ఆదివాసీల 'గోండీ' భాషపై పైచేయి సాధించి అధికార భాషగా చలామణీలో ఉంది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, జార్ఖండ్, నాగాలాండ్, అసోమ్ తదితర రాష్ట్రాల్లో ఆదివాసీ భాషలపై ఇండో ఆర్యన్ భాషల ఆధిపత్యం మూలంగా చాలా ఆదివాసీల భాషలు తమ ఉనికిని కోల్పోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 30 ఆదివాసీ తెగలు ఉంటే వాటిలో 8 తెగలకు ప్రత్యేకమైన భాష ఉంది. వాటిలో కోయ భాష మాట్లాడేవారు అధికంగా ఉన్నారు. ఈ భాషకు లిపి లేదు. ఇప్పుడు కొంతమంది ఆదివాసీ మేధావుల కృషి ఫలితంగా లిపి, నిఘంటువులు తయారవుతున్నాయి.

నిజాం రాజులలో చివరి రాజైన ఉస్మాన్ అలీఖాన్ ఆదివాసీ భాషల ప్రత్యేకతను గుర్తించి గోండు, కోయ భాషలలోనే రాయించిన చరిత్ర మన కళ్ళ ముందు ఉన్నది. ఆదివాసీ టీచర్లనే నియమించి వారికి ప్రత్యేక శిక్షణ కోసం ట్రైనింగ్ సెంటర్ నెలకొల్పారు. ఈ విధానం హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రరాష్ట్రంలో విలీనం అయ్యే వరకు కొనసాగింది. ఏపీ ఏర్పడిన తర్వాత కోయ భాషపై తగిన శ్రద్ధ పెట్టక పోవడం వల్ల కోయభాష వాడుక క్రమంగా తగ్గిపోతున్నది. ఈ తరుణంలో ప్రభుత్వం ఆది వాసీ భాషలను రక్షించకపోతే ఆదిమ సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతాయి. ఆది వాసీ సంస్కృతిలో అద్భుతమైన చారిత్రక గీతాలు, ఇతర సాహిత్యం, మానవజాతి పరిణామ క్రమం ఇమిడి ఉన్నాయి. కాబట్టి ఈ భాషలు అంతరిస్తే విశ్వజ్ఞాన మూలాలను కోల్పోతాం. అందుకే ఐక్యరాజ్యసమితి సంస్థ యునెస్కో 2019 నుండి జూలై 21వ తేదీని 'ప్రపంచ ఆదివాసీ భాషా దినోత్సవం'గా జరపాలని పిలుపునిచ్చింది.

– గుమ్మడి లక్ష్మీ నారాయణ, ఆదివాసీ రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి
(రేపు ప్రపంచ ఆదివాసీ భాషా దినోత్సవం)

హాస్యం... సెంటిమెంట్ కలిస్తే... అది శ్రీరమణ!

నివాళి



కె.ఐ. వరప్రసాద్ రెడ్డి

శ్రీరమణ పేరు చెప్పగానే చాలాకాలం పాటు ఆయన హాస్యం, వ్యంగ్యం గుర్తుకు వచ్చేవి. హాస్యానికీ, వ్యంగ్యానికీ చిరునామాగా ఆయన పేరే వినబడేదంటే అతిశయోక్తి కాదు. తర్వాత సినీ రచయితగా, బాపు–రమణల అంతే వాసిగా ప్రసిద్ధులయ్యారు. 'బంగారు మురుగు' కథ తర్వాత నుంచి ఆయనకు గొప్ప కథకుడిగా పేరు వచ్చింది. హాస్యమూ, వ్యంగ్యమూ మాత్రమే కాదు, సెంటిమెంటు కూడా అంతే గొప్పగా పండించ గలడన్న సంగతి పాఠక లోకానికి విదితమైంది. ఇక 'మిథునం'తో ఆయన ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయారు. ఏ వృద్ధ దంపతులను చూసినా 'మిథునం' గుర్తుకు వచ్చేటంతగా ఆయన పాఠకుల హృదయాలపై ముద్ర వేసేశారు. ముసిముసి నవ్వులు పూయించే వికటకవే కాదు, గుండెను తట్టి మనసు పొరల్లో తడి స్రవింపచేసే కవీ తనలో ఉన్నాడని నిరూపించుకున్నారు.

హాస్య ప్రక్రియల్లో అన్నిటికన్న క్లిష్టమైనది ప్యారడీ రచన. దానికి ఎంతో అధ్యయనం, పరిశీలన కావాలి. రచయిత రచనాశైలిలో ఉన్న ప్రత్యేకత ఏమిటో పట్టుకోగలగాలి. దాన్ని తరచుగా వాడడాన్ని గమనించి, దాన్ని ఎత్తి చూపితే నవ్వు పుట్టించే అవకాశం ఉందని గ్రహించాలి. దాన్ని ఉత్ప్రేక్షించి, ఆ అవకరాన్ని సామాన్య పాఠకుడి దృష్టికి తీసుకుని రాగల రచనాకౌశలం ఉండాలి. శ్రీరమణ ఆధునిక వచన రచయితలలో ప్రముఖులందరినీ ప్యారడీ చేశారు. వచనాన్ని ప్యారడీ చేయటం అంత సులభం కాదు. వారి మూలరచనలు చదివినవారికే ఆ ప్యారడీలలో స్వారస్యం బోధపడుతుంది. శ్రీరమణ ఆ సాహిత్యాలన్నీ చదివి ఒంటపట్టించుకున్న పండితుడు, నిశిత పరిశీలన గల విమర్శకుడు, దానిలో వక్రతను పసిగట్ట గలిగిన రసజ్ఞుడు. వారిలో యింకో విశేష మేమిటంటే, ఈయన చేత చురకలు వేయించుకున్న వారు కూడా పగలబడి నవ్వేటంత సంస్కార యుతంగా రాయగలగడం!

పాత్రికేయ ఉద్యోగానికే పరిమితమైతే ఆయన ఒక పరిధిని దాటలేక పోయే వారేమో! కానీ ఆయన మద్రాసు వెళ్లారు. బాపు – రమణలతో చేరారు. వారి సమస్త వ్యవహారాలూ ఈయన చూసే వారు. వారు సొంతానికై తీసిన సినిమాలలో, ఇతరులకు తీసిపెట్టిన సినిమాలలో ఈయన అనేక బాధ్యతలు నిర్వర్తించేవారు. వాళ్లు వెళ్లిన చోటకల్లా వెళుతూ వారిలో ఒకడిగా ఉన్నారు. దీని కారణంగా ఆయనకు ఎంతో విస్తృత ప్రపంచం దర్శనమైంది.

'బంగారు మురుగు' ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురించ బడినప్పుడు సంచలనాన్ని సృష్టించింది. దాదాపు 800 ఉత్తరాలు వచ్చాయట. ఇది మా బామ్మ కథే అని ఒకరు, కాదు కాదు... మా అమ్మమ్మ కథ అని మరొకరు... ఇలా అందరూ తమని తాము ఐడెంటిఫై చేసేసుకున్నారు. 'మిథునం' వెలువడే టప్పటికి అందరూ వారిలో తమ తలిదండ్రులను ఐడెంటిఫై చేసుకున్నారు. శ్రీరమణ పాత్రలు మన నిత్యజీవితంలో చూసేవే. షోడా నాయుడు, ధనలక్ష్మి... వీళ్లందరూ మన చుట్టూ ఉన్నవాళ్లే!

'ధనలక్ష్మి' కథలో ఆయన వ్రాసిన మాండలిక పదాలు, తెలుగు పలుకుబడులు, తెలుగువారికి దొరికే అరుదైన మృష్టాన్న భోజనం. కొన్ని వర్ణనలు క్రొంగొత్తగా అనిపించి అలరిస్తాయి.



శ్రీరమణ

ఉదాహరణకు: ''రోషం కమ్మేసిన అతని మొకం తుమ్మల్లో పొద్దుగూకి నట్లుంది.''

''...చీమలకు చక్కెర దొర గ్గాలేంది, మనుషులం మనకు నాలుగు మెతుకులు దొరకవా...''

''...పిండిమర మెతుకువలన్నీ ఇప్పుడు ధనమ్మకు కొట్టినపిండి...''

ఇలాంటి చమక్కులెన్నో వారి రచనల్లో కనిపిస్తాయి.

శ్రీరమణకు మొహమాటాలు తక్కువ, తెగువ ఎక్కువ. మతం పేరుతో చేసే అట్టహాసాలను వెక్కిరించడంలో దిట్ట. ఆచార వ్యవహారాల కంటె మానవత్వానికే పెద్దపీట వేసే 'బంగారు మురుగు'లో బామ్మ స్వాములారిని కడిగి పారేస్తూంటే మనకు లోపల్నుంచి సంతోషం తన్నుకు వస్తుంది. అలాగే 'అరటిపువ్వు స్వాములా'రి పాత్ర ద్వారా కుహనా ప్రవచనకారులకు చాకిరేవు పెట్టేశారు.

వారపత్రికా సంపాదకుడిగా ఆయన రాజకీయ నాయకుల గురించి కూడా నిర్భయంగా తూర్పారబట్టారు. నిజజీవితంలో కూడా ఆయన వ్యాఖ్యల్లో వెక్కిరింత, మాటల్లో వగరు మనల్ని తాకుతూనే ఉంటాయి. కానీ ఆయన విమర్శలో ఉన్న వాస్తవం మనల్ని ఆకట్టుకుంటుంది.

నాకు బాపు–రమణలు అత్యంత ఆప్తులు. వారికి నేను వీరాభిమానిని. శ్రీరమణతో నాకు ఉన్నది పరిమిత పరిచయమే. కానీ వారి రచనలు చాలా ఇష్టంగా చదువుతాను. వారి రచనల ద్వారా, వారిలో ఉన్న హాస్యాన్ని పండించే శైలి ద్వారా సెంటిమెంట్ వ్రాయడంలో వారికున్న ప్రతిభ ద్వారా నాకు బాగా నచ్చిన, బాగా ఇష్టపడిన రచయితగా నా మనఃపథంలో శాశ్వతంగా ఉండిపోతారు. అంతేకాకుండా నా ఆప్తమిత్రులు బాపు–రమణలకు అంతేవాసిగా కూడా నేను వారిని బాగా ఇష్టపడతాను.

వ్యాసకర్త వ్యవస్థాపక ఛైర్మన్, శాంతా బయోటెక్నిక్స్
(నిన్న శ్రీరమణ తుదిశ్వాస విడిచారు)

క్లుప్తంగా...

గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రజనీ సాయిచంద్

నేడు బాధ్యతల స్వీకారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నూతన చైర్మన్‌గా రజనీ సాయిచంద్ గురువారం ఉదయం 10 గంటలకు నాంపల్లిలోని సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. సంస్థ చైర్మన్ వి.సాయిచంద్ ఇటీవల గుండెపోటుతో మరణించడం తెలిసిందే. సాయిచంద్ స్థానంలో ఆయన సతీమణి రజనిని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా నియమిస్తూ సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం జరగనున్న రజని పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావుతో పాటు మంత్రులు హరీశ్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ హాజరవుతారు.

‘ఫ్యాక్ట్ చెక్’తో వాస్తవాలు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి వెల్లడి
- జర్నలిస్ట్ సుధాకర్‌రెడ్డి రాసిన పుస్తక ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి. చిత్రంలో సుధాకర్‌రెడ్డి, సత్యప్రియ

సాక్షి, హైదరాబాద్: సామాజిక మాధ్యమాలు విస్తరిస్తోన్నందున ఎప్పటికప్పుడు వాస్తవాలను తనిఖీ చేసే ఒక వ్యవస్థ ఏర్పాటు ప్రజలకు ఎంతో అవసరమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన అంశాల్లో వాస్తవాలను తెలుసుకునేలా సీనియర్ జర్నలిస్ట్ ఉడుముల సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్ట్ చెకర్ సత్యప్రియ కలసి తెలుగులో రాసిన ‘ఫ్యాక్ట్ చెక్’పుస్తకాన్ని జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం హైకోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మాట్లాడుతూ...సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, ఇతరులను తప్పుదారి పట్టించడం సరికాదని, ప్రతి ఒక్కరికీ సమాజంపై బాధ్యత ఉండాలని హితవు పలికారు. ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి, సామాజిక శాస్త్రాల డీన్ ప్రొఫెసర్ కె.స్టీవెన్‌సన్ మాట్లాడుతూ..ఈ పుస్తకం న్యాయ నిపుణులు, ప్రజా సంబంధాల అధికారులు, ఆరోగ్య నిపుణులు, జర్నలిస్టులు, జర్నలిజం విద్యార్థులు, ఫ్యాక్ట్ చెకర్స్, మీడియా అధ్యాపకులు, రాజకీయ నిపుణులు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు.

‘టీఎస్‌పీఎస్సీ’ కేసు పర్యవేక్షిస్తున్న ఏఆర్ శ్రీనివాస్ బదిలీ...

ఐదుగురు ఐపీఎస్‌ల బదిలీ..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఐదుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసును పర్యవేక్షిస్తున్న నగర క్రైమ్ అడిషనల్ పోలీస్ కమిషనర్ ఏఆర్ శ్రీనివాస్ కూడా ఉన్నారు. పేపర్ లీకేజీని ముందుగా పోలీసులే గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, అనంతరం దర్యాప్తునకు ఆదేశించడం తెలిసిందే. ఈ కేసుల్లో ఇప్పటివరకు దాదాపు 80 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసును పర్యవేక్షిస్తున్న ఏఆర్ శ్రీనివాస్‌ను ఆకస్మాత్తుగా బదిలీ చేయడం గమనార్హం. అడిషనల్ డీజీ(పర్సనల్)గా విధులు నిర్వర్తిస్తున్న వీబీ కమలహాసన్ రెడ్డిని డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా నియమించారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సౌమ్యా మిశ్రాను అడిషనల్ డీజీ (పర్సనల్)గా నియమించారు. ఇప్పటివరకు అదనపు కమిషనర్ (క్రైం, సిట్)గా ఉన్న ఏఆర్ శ్రీనివాస్‌ను ఏసీబీ డైరెక్టర్‌గా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న అంబర్‌కిశోర్ ఝాను హోంగార్డ్స్, టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా, హైదరాబాద్ సిటీ డీసీపీ (క్రైమ్స్) పి.శబరీష్‌ను మేడ్చల్ డీసీపీగా నియమించారు.

ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో నారాయణ విద్యార్థి మెహుల్‌కు స్వర్ణ పతకం



హైదరాబాద్: జపాన్ రాజధాని టోక్యోలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిజిక్స్ ఒలింపియాడ్ -2023లో నారాయణ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థి మెహుల్ బొరాడ్ బంగారు పతకం సాధించాడు. ఒలింపియాడ్‌లో పతకం సాధించిన మెహుల్‌ను నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ సింధూర, పి.శరణి అభినందించారు.

24న పాలమూరుపై నిపుణుల కమిటీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులు జారీచేసే అంశంపై కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని నిపుణుల మదింపు కమిటీ ఈ నెల 24న మరోసారి సమావేశం కానుంది. ఈ సమావేశంలోనైనా ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వస్తాయని రాష్ట్ర నీటిపారుదల శాఖ భావిస్తోంది.

బర్త్‌డే.. 400 కిలోల టమాటాల పంపిణీ



టమాటాలు పంపిణీ చేస్తున్న నల్ల శివ

పొద్దున్నే ప్రతాప్‌నగర్‌లో జనాలు బారులు తీరారు. అది రేషన్ దుకాణమేమో అనుకున్నారు అందరూ.. కానీ అక్కడ ఓ వ్యక్తి తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా టమాటాలు పంచుతున్నాడని తెలియడంతో బస్తీ మొత్తం తరలి వచ్చింది. పంజగుట్ట ప్రతాప్‌నగర్ బస్తీకి చెందిన సంఘ సేవకుడు నల్ల శివ కూతురు చైతన్య బుధవారం పుట్టిన రోజు జరుపుకొంది. ఆయన ఏటా తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా ఏదో ఒక సామాజిక కార్యక్రమం చేస్తుంటారు. ఈసారి పేదలు, మధ్య తరగతి వారికి అందని ద్రాక్షలా మిగిలిన టమాటాలను పంచాలని నిర్ణయించుకున్నారు. మార్కెట్‌కు వెళ్లి 400 కిలోల టమాటాలను కొనుగోలు చేసి తీసుకొచ్చి బస్తీవాసులందరికీ పంచేశారు.

- వెంకటేశ్వరకాలనీ (హైదరాబాద్)

యాదాద్రి జిల్లాలో మరో మెట్లబావి



మెట్లబావిలో ప్రత్యేకంగా నిర్మించిన అరలు (గదులు)

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో మరో మెట్ల బావి వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి వెంట తూప్రాన్‌పేట గ్రామ శివారులో ఉన్న 200 ఏళ్ల కిందటి పురాతన దిగుడుబావి (మెట్లబావి)ని అసఫ్‌జాహి కాలానికి చెందినదిగా భావిస్తున్నారు. 60 అడుగుల లోతున్న ఈ బావిలో మూడు అంతస్తుల్లో 12 అరలున్నాయి. చౌటుప్పల్ మండల పరిధిలోని లింగోజి గూడెంలో ఇప్పటికే గుర్తించిన ఓ మెట్ల బావిని హెచ్‌ఎండీఏ సుందరీకరించింది. తూప్రాన్‌పేట మెట్లబావిని సైతం ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ గుర్తించి, సుందరీకరించాలని పలువురు కోరుతున్నారు. - చౌటుప్పల్

జీవో ఆర్టీ ప్రామాణికమా లేక మెమోనా?

- జేపీఎస్‌ల సర్వీసు క్రమబద్ధీకరణపై తొలగని సందిగ్ధత
- మదింపు ప్రక్రియలో సంబంధంలేని అధికారులేంటని అభ్యంతరాలు



జేపీఎస్‌ల ఆందోళన (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: సర్వీసుల రెగ్యులరైజేషన్ ప్రక్రియపై జూనియర్ పంచాయతీ కార్యదర్శుల్లో (జేపీఎస్) ఆందోళన వ్యక్తమౌతోంది. ఉద్యోగాలు క్రమబద్ధీకరించేందుకు ఐదేళ్ల కిందట అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ ఇచ్చిన జీవో ఆర్టీ ప్రామాణికమా? లేక తాజాగా పీఆర్ ముఖ్యకార్యదర్శి ఇచ్చిన మెమో ప్రామాణికమా? అన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జేపీఎస్‌ల పనితీరును మదింపు చేసి మూల్యాంకనం చేసేందుకు పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా తాజాగా జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), జిల్లా ఎస్పీ, జిల్లా అటవీ అధికారులతో ఒక కమిటీని నియమిస్తూ మెమోను జారీచేశారు. వివిధ అంశాల ప్రాతిపదికన... ఆయా విధుల నిర్వహణకు అనుగుణంగా వందమార్కులు కేటాయించి, నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న జేపీఎస్‌ల పనితీరు మదింపు ఆధారంగా రెగ్యులరైజేషన్ ప్రక్రియ ఉంటుందని స్పష్టంచేశారు.

జీవో ఆర్టీలో ఏముంది?

జిల్లా ఎంపిక కమిటీల ద్వారా జేపీఎస్‌ల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి 2018 ఆగస్టు 30న అప్పటి పీఆర్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్ జీవో ఆర్టీ నెంబర్ 617ను జారీచేశారు. ప్రభుత్వం జేపీఎస్‌ల పోస్టులను మంజూరు చేసినందున, మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నాక సంతృప్తికరమైన పనితీరు కనబరిచిన జేపీఎస్‌లను గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీలుగా రెగ్యులరైజ్ చేయాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే వీరి క్రమబద్ధీకరణను పరిగణనలోకి తీసుకునేందుకు జేపీఎస్‌ల మూడేళ్ల సర్వీసు కాలాన్ని నాలుగేళ్లకు పెంచుతూ గతేడాది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత మార్చినెలతో వారి నాలుగేళ్ల సర్వీసు కూడా పూర్తయ్యింది. క్రమబద్ధీకరణ ప్రక్రియ మాత్రం మొదలుకాలేదు. దీంతో జేపీఎస్‌లు నిరవధిక సమ్మెకు దిగి 16 రోజుల తర్వాత విరమించుకున్నారు. జేపీఎస్‌లు విధుల్లో చేరేందుకు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నపుడే అందరినీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పలేదని, మెరుగైన పనితీరు ఆధారంగా నిపుణుల కమిటీ నివేదిక మేరకు జరుగుతుందని పంచాయతీరాజ్ శాఖ స్పష్టంచేసింది. కొన్నిరోజుల తరువాత జేపీఎస్‌ల సర్వీసులను క్రమబద్ధీకరించే చర్యలు చేపడతామని అధికారులు ప్రకటించారు.

సీఎస్ దృష్టికి...

ఈ నేపథ్యంలో తాజాగా పీఆర్ ముఖ్యకార్యదర్శి జారీచేసిన మెమో నేపథ్యంలో జేపీఎస్‌ల విధులు, బాధ్యతల పట్ల ఏమాత్రం సంబంధం లేని జిల్లా ఎస్పీలు, జిల్లా అటవీ అధికారులతో మూల్యాంకనం చేయించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. వివిధ విభాగాల పీఆర్ ఉద్యోగులు, సంఘాలు సైతం ఈ పరిణామంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ పరిస్థితుల గురించి త్వరలోనే సీఎస్ దృష్టికి తీసుకెళ్లాలనే ఆలోచనతో ఉద్యోగ సంఘాలున్నాయి.

అయాచితం నటేశ్వరశర్మకు దాశరథి పురస్కారం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందించే దాశరథి కృష్ణమాచార్య స్మారక పురస్కారానికి ప్రముఖ రచయిత, సంస్కృతాంధ్ర కవి, శతావధాని, కామారెడ్డి జిల్లాకు చెందిన అయాచితం నటేశ్వర శర్మ ఎంపికయ్యారు. 2023 సంవత్సరానికిగాను ఆయన పేరును ఎంపిక కమిటీ సిఫారసు చేయగా ప్రభుత్వం ఆమోదిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాశరథి కృష్ణమాచార్య జయంతి రోజైన ఈ నెల 22న రవీంద్ర భారతిలో జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారంతోపాటు రూ. 1,01,116 నగదును, శాలువా, జ్ఞాపికతో సత్కరించనుంది. ఈ నేపథ్యంలో అయాచితం నటేశ్వరశర్మకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. నటేశ్వరశర్మ సంస్కృతంలో, తెలుగులో అష్టావధానాలు, శతావధానాలు చేపట్టారు. వసంత కుమారి, శ్రీ గజానన స్తోత్రమ్, శ్రీ షోడశీ, భారతీప్రశస్తి, ఆముక్తమాల్యద పరిశీలనం, ఋతుగీత తోపాటు సుమారు 50 వరకు రచనలు చేశారు. నటేశ్వరశర్మ కవిరత్న, అవధాని శిరోమణి, మహోపాధ్యాయ అనే బిరుదులు పొందారు.

అంతర్జాతీయ బౌద్ధ సంస్థలను ఆకట్టుకున్న ‘బుద్ధవనం’



జ్ఞాపిక అందుకుంటున్న గెల్లు శ్రీనివాస్, మల్లేపల్లి లక్ష్మయ్య

నాగార్జునసాగర్: తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో నిర్మించిన ప్రపంచస్థాయి బౌద్ధవారసత్వ థీమ్ పార్క్ ‘బుద్ధవనం’పై ప్రదర్శించిన డాక్యుమెంటరీ ప్రపంచ బౌద్ధ సంస్థలు, గురువులు, ప్రముఖులను ఆకట్టుకుందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. లే-లడక్‌లోని మహాబోధి ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్ ఆహ్వానం మేరకు అక్కడ నిర్వహించిన అంతర్జాతీయ బౌద్ధ సదస్సులో ఇరువురూ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణలో బౌద్ధ పర్యాటక వనరులు, బుద్ధవనం ప్రత్యేకతలపై వారు మాట్లాడారు. కార్యక్రమంలో మహాబోధి సొసైటీ చైర్మన్ కస్సపభంతే, ఇండియన్ యూనివర్సిటీస్ అధ్యక్షుడు ప్రియరంజన్ త్రివేది తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్ రంగానికి ప్రభుత్వ ప్రాధాన్యం

- ఆ రంగంలో అవకాశాలను యువత అందుకోవాలి
- ‘ఫౌండర్స్ ల్యాబ్’ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్



ఫౌండర్స్ ల్యాబ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్, సంస్థ సీఈఓ శకుంతల

సాక్షి, హైదరాబాద్: స్టార్టప్ రంగంలోని అవకాశాలను యువత అందుకునే దిశగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే టీ హబ్, టీ వర్క్స్, వీ హబ్, అగ్రి హబ్ వంటి అనేక వేదికలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటైన ‘ఫౌండర్స్ ల్యాబ్’ను కేటీఆర్ బుధవారం హైదరాబాద్ గ్రోత్ కారిడార్ కార్యాలయంలో ప్రారంభించారు. ఫౌండర్స్ ల్యాబ్ సంస్థ కాలేజీ స్థాయి నుంచే విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా శిక్షణ అందించడం మంచి పరిణామంగా ఆయన పేర్కొన్నారు. ఫౌండర్స్ ల్యాబ్ సీఈఓ శకుంతల కాసరగడ్డ మాట్లాడుతూ..వివిధ విద్యాసంస్థలు, వర్సిటీలు, ఇంజనీరింగ్ కాలేజీలలో తమ సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తోందని వెల్లడించారు. ఫార్మా, అగ్రికల్చర్, మేనేజ్‌మెంట్ రంగాలను ఇంజనీరింగ్ రంగాలతో అనుసంధానం చేస్తూ ఆవిష్కరణలను విద్యార్థుల ద్వారా వెలికితీసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, పైలట్ రోహిత్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఫౌండర్ ల్యాబ్ డైరెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

తెయూలో మరోసారి ఏసీబీ విచారణ

తెయూ (డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలోఏసీబీ అధికారులు మరోసారి విచారణ చేపట్టారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు ముందుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిశారు. అనంతరం కంట్రోలర్ అరుణతోపాటు ఒక జూనియర్ అసిస్టెంట్‌ను ఎగ్జిక్యూటివ్ హాల్‌లో విచారించారు. వారు చెప్పిన సమాధానాలను రికార్డు చేసుకున్న అధికారులు మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి వెళ్లిపోయారు. జిల్లాలోని భీంగల్‌లో ఉన్న ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు పరీక్ష కేంద్రం కేటాయింపు కోసం రూ.50 వేలు లంచం తీసుకుంటూ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ గత నెల 17న హైదరాబాద్ తార్నాక లోని తన నివాసంలో ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే.

టీ వర్క్స్‌లో ‘స్టార్టప్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’

టీ వర్క్స్ తో డసాల్ట్ సిస్టమ్స్ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతిపెద్దదైన ప్రోటోటైపింగ్ సెంటర్ టీ వర్క్స్.. పారిస్‌కు చెందిన డసాల్ట్ సిస్టమ్స్‌తో బుధవారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా టీ వర్క్స్‌లో ఏర్పాటయ్యే ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ ప్రాథమిక దశలో ఉండే హార్డ్ వేర్ స్టార్టప్‌లకు అవసరమైన డిజైన్, సిమ్యులేషన్ పరికరాలను అందుబాటులోకి తెస్తుంది. ప్రత్యేకించి 3డి ఎక్స్‌పీరియెన్స్ వంటి ఆధునిక హార్డ్ వేర్ టూల్స్ ఏరోస్పేస్, రక్షణ, ఆటోమోటివ్ వంటి రంగాల్లో పనిచేసే స్టార్టప్‌లు వినియోగించుకునే వెసులుబాటు లభిస్తుంది. ఈ ఒప్పందం ద్వారా రూ.10 కోట్లు విలువ చేసే హార్డ్ వేర్ టూల్స్ అందుబాటులోకి వస్తాయి. ఒప్పందంపై టీ వర్క్స్ సీఈఓ సుజయ్ కారంపూరి, డసాల్ట్ సిస్టమ్స్ వైస్ ప్రెసిడెంట్ సుచిత్ జైన్ సంతకాలు చేశారు.

ఎఫ్‌సీఐ ఇలా చేస్తే కష్టం

- మంత్రి గంగులకు రైస్ మిల్లర్ల స్పష్టీకరణ
- ఫోర్టిఫైడ్ రైస్ నిరాకరించడంపై ఫిర్యాదు
- కేంద్ర ఏజెన్సీ పంపిన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌నే బియ్యంలో కలుపుతున్నాం
- వాటిలో నాణ్యత లేకపోతే మేమేం చేస్తాం..
- ఇప్పటికే మిల్లులు పుల్లుగా నిండిపోయి ఇబ్బందులు పడుతున్నాం
- ఎఫ్‌సీఐ ఇలాగే వ్యవహరిస్తే సీఎంఆర్ చేయలేం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు పంపిణీ చేసే ఫోర్టిఫైడ్ రైస్ (బలవర్ధక బియ్యం) విషయంలో ఎఫ్‌సీఐ వ్యవహరిస్తున్న తీరుపై రాష్ట్రంలోని మిల్లర్లు మండిపడుతున్నారు. ఇటీవల 290 మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి పంపిన సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని (సీఎంఆర్) నాణ్యత సరిగా లేదంటూ ఎఫ్‌సీఐ తిరస్కరించడంతో పాటు మిల్లుల నుంచి 2022-23కు సంబంధించిన సీఎంఆర్‌ను తీసుకునేందుకు కూడా నిరాకరించింది. దీంతో మిల్లింగ్ అయిన బియ్యం మిల్లుల్లోనే ఉండిపోతోంది. గత సంవత్సరం వానకాలం, యాసంగి ధాన్యం ఇప్పటికే కోటి టన్నులకు పైగా మిల్లుల్లో నిల్వ ఉండగా, మర పట్టించిన మేరకు బియ్యాన్ని కూడా ఎఫ్‌సీఐ తీసుకోవడం లేదని మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మిల్లర్ల సంఘం నాయకులు సచివాలయంలో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌తో భేటీ అయ్యారు.

ఎఫ్‌సీఐ ఘర్షణాత్మక వైఖరి: రాష్ట్రంలోని సుమారు 3 వేల మిల్లులు ధాన్యం, బియ్యంతో నిండిపోయి ఉన్నాయని, ధాన్యం నిల్వకు గోదాములు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రికి మిల్లర్లు తెలిపారు. ఈ పరిస్థితుల్లో మిల్లర్లు పంపించిన బియ్యాన్ని నిరాకరిస్తూ, దాదాపు 290 మిల్లుల్ని బ్లాక్ లిస్టులో పెట్టి ఎఫ్‌సీఐ ఘర్షణాత్మక వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ నాఫెడ్ సరఫరా చేసిన ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ (ఎఫ్‌ఆర్‌కే) నాణ్యత సరిగా లేదంటూ ఎఫ్‌సీఐ బియ్యాన్ని తీసుకోవడానికి నిరాకరించడంతో రైస్ మిల్లింగ్ పరిశ్రమ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని చెప్పారు. ఎఫ్‌సీఐ ఇలాగే వ్యవహరిస్తే సీఎంఆర్ నుంచి పూర్తిగా తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఎఫ్‌సీఐ గోదాములు సమకూర్చకపోవడం వల్ల సకాలంలో సీఎంఆర్ చేయలేకపోతున్నట్లు తెలిపారు.

కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల్లో..

గత వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన కోటి మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు రైస్ మిల్లుల వద్ద పేరుకుపోయాయని మిల్లర్లు మంత్రి దృష్టికి తెచ్చారు. కోటీ పదమూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్ చేయాల్సి ఉండగా, అందులో గత వానాకాలంలో తడిసిన ధాన్యం కూడా ఉందని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ధాన్యం పాడయ్యే ప్రమాదం ఉందని, అప్పుడు సీఎంఆర్ విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. వానాకాలం ధాన్యం తడిసిపోయిన నేపథ్యంలో ఈ సీజన్‌కు సంబంధించిన 15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ చేసేందుకు ఆదేశాలివ్వాలని కోరారు. లేని పక్షంలో తమ దగ్గర ఉన్న ధాన్యాన్ని వెనక్కితీసుకోవాలని అన్నారు. ఎఫ్‌సీఐ కఠిన వైఖరి నేపథ్యంలో డిఫాల్ట్ పెట్టబోమని హామీ ఇస్తే ప్రభుత్వ ధాన్యానికి కస్టోడియన్‌గా ఉంటామని స్పష్టం చేశారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా: మంత్రి గంగుల

మిల్లర్ల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని మంత్రి గంగుల హామీ ఇచ్చారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో మద్దతు ధరతో ధాన్యం కొనుగోలుకు సీఎం ఆదేశాలిచ్చారని, కేంద్రం కూడా దేశంలో రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాల్సిన బాధ్యత నుంచి తప్పుకోకూడదని సూచించారు. తక్షణమే ఎఫ్‌సీఐ స్టోరేజీ సౌకర్యం కల్పిస్తే నెలకు పదిలక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాగా అప్పటికప్పుడు ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి.. వీలైనంత త్వరగా స్టోరేజీని పెంచి బియ్యం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులతో పాటు మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంపా నాగేందర్, జనరల్ సెక్రటరీలు వి.మోహన్ రెడ్డి, ఎ.సుధాకర్ రావ్, ట్రెజరర్ చంద్రపాల్, 33 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, మిల్లర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సుప్రీంకోర్టులో సెతల్వాద్‌కు ఊరట

గోధ్రా అల్లర్లలో సాక్ష్యాల తారుమారు కేసులో సాధారణ బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ: గుజరాత్‌లో 2002 గోధ్రా ఘర్షణల తర్వాత సాక్ష్యాలను తారుమారు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసులో సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్‌కు ఊరట లభించింది. సుప్రీంకోర్టు బుధవారం సెతల్వాద్‌కు సాధారణ బెయిల్ మంజూరు చేసింది. తీస్తా సెతల్వాద్‌కు బెయిల్ మంజూరు చేయడానికి నిరాకరిస్తూ గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను త్రిసభ్య బెంచ్ తోసిపుచ్చింది. గోధ్రా హింసాకాండ కేసుల్లో అమాయకుల్ని ఇరికించడానికి సాక్ష్యాలను తారుమారు చేశారని తీస్తా సెతల్వాద్ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో సెతల్వాద్‌పై చార్జిషీటు నమోదు కావడంతో ఆమెను మళ్లీ కస్టడీలోకి తీసుకొని విచారించాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ''తీస్తా సెతల్వాద్ ఇప్పటికే తన పాస్‌పోర్టును సెషన్స్ కోర్టుకు సమర్పించారు. ఆమె సాక్షులను ఎవరినీ ప్రభావితం చేయడానికి వీల్లేదు. వారికి దూరంగా ఉండాలి'' అని సుప్రీం బెంచ్ ఆదేశించింది. ఈ కేసులో తీస్తా సాక్షుల్ని ప్రభావితం చేస్తున్నారని పోలీసులు భావిస్తే నేరుగా సుప్రీంను ఆశ్రయించవచ్చునని తెలిపింది.

ఐదుగురు అనుమానిత ఉగ్రవాదుల అరెస్టు



సాక్షి, బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో ఐదుగురు అనుమానిత ఉగ్రవాదులను నగర సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో బాంబు పేలుళ్ల ద్వారా విధ్వంసానికి పాల్పడేందుకు ఈ ఐదుగురు ముష్కరులు సుహైల్, ఉమర్, తర్బేజ్, ముదాసీర్, ఫైజల్ కుట్ర పన్నినట్లు పోలీసులు చెప్పారు. వారిని ఎన్ఐఏ కోర్టులో హాజరుపర్చగా, ఐదు రోజుల పాటు సీసీబీ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. దేశద్రోహ కార్యకలాపాలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న సీసీబీ పోలీసులు హెబ్బాళ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై హెబ్బాళ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుల వద్ద నుంచి ఏడు దేశవాళీ పిస్తోళ్లు, 45 బుల్లెట్లు, వాకీటాకీ సెట్స్, 12 మొబైల్ ఫోన్లు, రెండు శాటిలైట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరులో రద్దీ ప్రాంతాల్లో పేలుళ్లకు ప్రణాళికలు రూపొందించినట్లు విచారణలో నిందితులు అంగీకరించాని పోలీసులు వెల్లడించారు.



బెల్జియంలోని యాంట్‌వెర్ప్ పేరు చెబితే అందరికీ గుర్తొచ్చేది ఒక్కటే. ప్రపంచంలోనే వజ్రాల వ్యాపారానికి చిరునామాగా చలామణి అవుతున్న నగరమది. ఇప్పుడు ఆ పేరుకు చెల్లుచీటి రాసేస్తూ గుజరాత్‌లోని సూరత్ పట్టణం కొత్త అధ్యయనం లిఖించింది. ఒకేసారి 65,000 మందికిపైగా వ్యాపారులు, పనివాళ్లు, పరిశ్రమ నిపుణులు వచ్చి పనిచేసుకునేందుకు వీలుగా సువిశాల అధునాతన భవంతి అందుబాటులోకి వచ్చింది. 71 లక్షల చదరపు అడుగులకుపైగా ఆఫీస్ స్పేస్‌తో నూతన ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. అమెరికా రక్షణ శాఖ ప్రధానకార్యాలయం (పెంటగాన్) పేరిట ఉన్న ఈ రికార్డును చెరిపేసిన అద్భుత భవంతి విశేషాలు ఇవీ..

ఇది 'వజ్రాల వ్యాపార గని'

సూరత్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయం ఆవిష్కారం

35 ఎకరాల సువిశాల ప్రాంగణంలో నిర్మాణం

త్వరలో ప్రధాని మోదీ చేతుల మీదుగా కార్యకలాపాలు షురూ



విశ్వవ్యాప్తంగా వెలికితీసిన వజ్రాల్లో దాదాపు 90 శాతం వజ్రాలను సానబట్టేది సూరత్‌లోనే. దాంతో భారత్‌లో జెమ్ క్యాపిటల్‌గా సూరత్ కీర్తిగడించింది. అందుకే సూరత్‌లో వజ్రాల వ్యాపార అవసరాలు తీర్చేందుకు అనువుగా ఈ భవనాన్ని నిర్మించారు. దీనికి 'సూరత్ డైమండ్ బోర్స్' అని నామకరణం చేశారు. బోర్స్ పేరుతో గతంలో

రూ. 3,200 కోట్ల వ్యయంతో..

ఫ్రాన్స్‌లో పారిస్ స్టాక్‌ఎక్స్ఛేంజ్ ఉండేది. అంటే వజ్రాల వ్యాపారానికి సిసలైన చిరునామా ఇదే అనేట్లు దీనికి ఆ పేరు పెట్టారు. వజ్రాలను సానబట్టే వారు, వ్యాపారులు, కట్టర్స్ ఇలా వజ్రాల విపణిలో కీలకమైన వ్యక్తులందరూ తమ పని మొత్తం ఇక్కడే పూర్తిచేసుకోవచ్చు. తొమ్మిది దీర్ఘచతురస్రాకార భవంతులను విడివిడిగా నిర్మించి అంతర్గతంగా వీటిని కలుపుతూ డిజైన్‌చేశారు.

మొత్తంగా 35 ఎకరాల్లో ఈ కట్టడం రూపుదాల్చింది. అంటే 71 లక్షల చదరపు అడుగుల ఆఫీస్‌స్పేస్ అందుబాటులోకి వచ్చింది. కోవిడ్ సమయంలో తప్పితే నాలుగేళ్లుగా విరామమెరుగక కొనసాగిన దీని నిర్మాణం ఇటీవలే పూర్తయింది. నవంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ చేతులమీదుగా ప్రారంభోత్సవం జరిగే అవకాశం ఉంది. దాదాపు రూ.3,200 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. మొత్తంగా 4,700 భారీ దుకాణాలు ఇందులో ఉన్నాయి. అన్నివైపులా ఎక్కడికక్కడ అనువుగా 131 ఎలివేటర్లను ఏర్పాటుచేశారు. అందరికీ భోజన సదుపాయం, రిటైల్ వర్తకులకు ప్రత్యేక సౌకర్యాలు, వెల్‌నెస్, కార్మికుల కోసం సమావేశ మందిరాలను కొలువుతీర్చారు. '150 మైళ్ల దూరంలోని ముంబై నుంచి వేలాది మంది వ్యాపారాలు రోజూ సూరత్‌కు వచ్చిపోతుంటారు. ఇలా ఇబ్బందిపడకుండా వారికి సకల సౌకర్యాలు కల్పించాం' అని ప్రాజెక్టు సీఈవో మహేశ్ గఢావీ చెప్పారు.

ప్రజాస్వామ్య డిజైన్!

ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు డిజైన్ చేయాల్సిందిగా అంతర్జాతీయంగా బిడ్డింగ్‌కు ఆహ్వానించగా భారత్‌కే చెందిన మోర్ఫోజెనిసిస్ ఆర్కిటెక్చర్ సంస్థ దీనిని కైవసం చేసుకుంది. డైమండ్‌లకు ఉన్న డిమాండ్ ఈ ప్రాజెక్టు పరిమాణాన్ని అమాంతం పెంచేసింది. ఇప్పటికే అన్ని దుకాణాలను డైమండ్ కంపెనీలు నిర్మాణానికి ముందే కొనుగోలుచేయడం విశేషం. ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ తరహాలో అన్ని బిల్డింగ్‌లను కలుపుతూ ఒక్కటే భారీ సెంట్రల్ కారిడార్‌ను నిర్మించారు. ''అందరికీ సమానంగా అన్ని సౌకర్యాలు అనే విధానంలో 'ప్రజాస్వామ్య' డిజైన్‌ను రూపొందించాం. సెంట్రల్ కారిడార్ ద్వారా అందరికీ అన్ని సౌకర్యాలు సమదూరంలో ఉంటాయి'' అని మోర్ఫోజెనిసిస్ సహ వ్యవస్థాపకురాలు సోనాలీ రస్తోగీ చెప్పారు. అంటే ప్రధాన ద్వారాల్లో ఎటువైపు నుంచి లోపలికి వచ్చినా చివరి దుకాణానికి ఏడు నిమిషాల్లోపు చేరుకోవచ్చు. కాంక్రీట్ వనంగా కనిపించకుండా ఉండేందుకు 1.5 ఎకరాల విస్తీర్ణంలో పచ్చికబయళ్లను సిద్ధంచేశారు. ఇలాంటివి లోపల తొమ్మిది ఉన్నాయి.

ప్లాటినమ్ రేటింగ్

సూరత్‌కు దక్షిణంగా 1,730 ఎకరాల్లో స్మార్ట్ సిటీని ఒకదానిని నిర్మిస్తే బాగుంటుందని ప్రధాని మోదీ గతంలో అభిలషించారు. ఆయన సంకల్పానికి బాటలు వేస్తూ ఇప్పుడు ఈ భవంతి నిర్మాణం పూర్తయ్యాక చుట్టూతా నూతన జనావాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పడతాయని భావిస్తున్నారు. ఎండాకాలంలో ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రత 110 డిగ్రీస్ ఫారన్‌హీట్‌ను దాటుతుంది. అయినాసరే భవంతిలో ఎక్కువ ఇంధనం వాడకుండా పర్యావరణహితంగా డిజైన్‌చేశారు. సాధారణ భవనాలతో పోలిస్తే ఈ భవంతి 50 శాతం తక్కువ ఇంధనాన్ని వినియోగించుకుంటుంది. అందుకే దీనికి ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ 'ప్లాటినమ్' రేటింగ్‌ను కట్టబెట్టింది. మధ్యమధ్యలో వృత్తాకారంగా వదిలేసిన శ్లాబ్స్ కారణంగా గాలి ధారాళంగా దూసుకొచ్చి బిల్డింగ్ లోపలి భాగాలను చల్లబరుస్తుంది. దాదాపు సగం భవంతి సాధారణ వెంటిలేషన్ ద్వారానే చల్లగా ఉంటుంది. ఇక మిగతా కామన్ ఏరియాస్‌లో సౌర ఇంధనాన్ని వినియోగించనున్నారు. ఆకృతిపరంగానేకాదు పర్యావరణహిత, సుస్థిర డిజైన్‌గా ఈ భవంతి భాసిల్లనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్



కట్టడం కథ లెక్కల్లో..

మొత్తం కట్టింది	35 ఎకరాల్లో
భారీ దుకాణాలు	4,700
అందుబాటులోకొచ్చే ఆఫీస్ స్పేస్	71 లక్షల చదరపు అడుగులు
ఎలివేటర్లు	131
మొత్తం వ్యయం	రూ.3,200 కోట్లు
బిల్డింగ్ రేటింగ్	ప్లాటినమ్

టమాటా లీలలు... అన్ని ఇన్ని కావయా...

మహారాష్ట్ర రైతుకు నెలలో రూ. 3 కోట్లు కురిపించిన టమాటా



పుణే: విపరీతంగా పెరిగిపోయిన టమాటా ధరలతో సామాన్య వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోంది. మహారాష్ట్రలో పుణే జిల్లాకు చెందిన ఓ రైతు మాత్రం టమాటాలతో కేవలం ఒక నెల వ్యవధిలో ఏకంగా రూ.3 కోట్లు ఆర్జించాడు. ఒక్కసారిగా ధనవంతుడైపోయాడు. పుణే జిల్లాలో జున్నార్ తహసీల్ పరిధిలోని పాచ్‌గఢ్ గ్రామంలో రైతు ఈశ్వర్ గాయ్‌కర్(36) చాలా ఏళ్లుగా టమాటా పంట సాగు చేస్తున్నాడు. ఇన్నాళ్లు నష్టాలే చవిచూశాడు. ఈ ఏడాది మే నెలలో సరైన ధర లేక టమాటాలను వృథాగా పారబోశాడు. ఇప్పుడు ధరలు పెరగడంతో ఈశ్వర్ పంట పండింది. అతడి శ్రమ ఫలించింది. జూన్ 11 నుంచి జూలై 18 మధ్య 3,60,000 కిలోల టమాటాలను సమీపంలోని నారాయణగావ్ మార్కెట్‌లో విక్రయించాడు. రూ.3 కోట్ల ఆదాయం కళ్లజూశాడు. తన పొలంలో మరో 80,000 కిలోల పంట ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని, మరో రూ.50 లక్షల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఈశ్వర్ చెప్పాడు. టమాటా పంట సాగు, రవాణాకు రూ.40 లక్షలు ఖర్చయినట్లు తెలిపాడు. తనకు 18 ఎకరాల భూమి ఉందని, అందులో 12 ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నానని వెల్లడించాడు. జూన్ 11న కిలోకు రూ.38 చొప్పున, జూలై 18న కిలోకు రూ.110 చొప్పున ధర పలికిందని ఆనందం వ్యక్తం చేశాడు. టమాటా సాగుదారులకు ఇది మంచి కాలమని, కానీ, ఒక రైతుగా ఎన్నో గడ్డు రోజులు కూడా చూశానని అన్నాడు. టమాటాలకు కిలోకు రూ.రెండున్నర సైతం రాని రోజులు ఉన్నాయని వివరించారు. టమాటాల సాగు వల్ల 2021లో తనకు దాదాపు రూ.16 లక్షల నష్టం వచ్చిందని, 2022లో మాత్రం స్వల్పంగా లాభపడ్డానని చెప్పాడు. ఇదిలా ఉండగా, మహారాష్ట్రకు చెందిన మరో రైతు రాజు మహాలే టమాటాల సాగుతో ఈ సీజన్‌లో రూ.20 లక్షలు సంపాదించాడు.

అలా అయితే కిలో టమాటాలు ఫ్రీ

ఛండీగఢ్ ఆటోవాలా వినూత్న ఆఫర్

తన ఆటో ఎక్కితే కిలో టమాటాలు ఫ్రీగా ఇస్తానంటూ చండీగఢ్‌లో అరుణ్ అనే ఓ ఆటో డ్రైవర్ ఆఫర్ ప్రకటించాడు. అయితే కనీసం ఐదుసార్లు తన ఆటో ఎక్కిన వారికే ఆఫర్ వర్తిస్తుందంటూ తిరకాసు పెట్టాడు! మనవాడిది ముందునుంచీ సేవాగుణమే. 12 ఏళ్లుగా సైనికులను ఫ్రీగా ఆటో ఎక్కించుకుంటున్నాడు. అంతేకాదు, గర్భిణులను ఉచితంగా ఆస్పత్రికి కూడా చేరేస్తుంటాడు. ''ఆటోయే నా జీవనాధారం. కాబట్టి టమాటాల హవాను ఇలా అదనపు ఆదాయ మార్గంగా మార్చుకోవాలని వినూత్న ఆలోచన చేశానంతే. అయితే మన సైనిక వీరులకు, కాబోయే తల్లులకు చేసే సేవలోనే నాకు అమితమైన తృప్తి దొరుకుతుంది'' అని చెబుతాడు అరుణ్. అక్టోబర్లో పాకిస్తాన్‌తో చండీగఢ్‌లో జరగబోయే క్రికెట్ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే వరుసగా ఐదు రోజుల పాటు అందరికీ తన ఆటోలో ఉచిత ప్రయాణమేనని ప్రకటించేశాడు అరుణ్!

కిలో.70కే సబ్సిడీ టమాటా: కేంద్రం

టమాటాలను ఇప్పటికే కిలో కేవలం రూ.80కి విక్రయిస్తున్న కేంద్రం, తాజాగా సబ్సిడీని మరో 10 రూపాయలు తగ్గించింది. గురువారం నుంచి రూ.70కే కిలో టమాటాలు అందుబాటులోకి వస్తాయని ప్రకటించింది. టమాటాల రేటు కొంతకాలంగా చుక్కలనంటుతున్న నేపథ్యంలో ఢిల్లీలోనూ, దేశవ్యాప్తంగా పలు ఇతర కీలక నగరాల్లోనూ వాటిని సబ్సిడీపై కేంద్రం అందుబాటులోకి తేవడం తెలిసిందే.

నేటి నుంచే సభా సమరం

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు అధికార, విపక్షాలు సన్నద్ధం

- అధికార పక్షాన్ని ఇరుకున పెట్టడమే లక్ష్యంగా విపక్షాల వ్యూహాలు
- యూసీసీ, ఢిల్లీ ఆర్డినెన్స్ సహా 21 బిల్లులు ప్రవేశపెట్టేందుకు కేంద్రం కసరత్తు



అఖిలపక్ష భేటీలో పాల్గొన్న మంత్రులు రాజ్‌నాథ్, మేఘ్వాల్, పలు పార్టీల నేతలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ సాక్షిగా అధికార, విపక్షాల మధ్య వాడీవేడి చర్చలు, సంవాదాలకు రంగం సిద్ధమయ్యింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం ఆరంభం కానున్నాయి. ఇరుపక్షాలు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు అధికార, ప్రతిపక్ష నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. మణిపూర్‌లో జాతుల మధ్య రగులుతున్న హింస, ఉమ్మడి పౌరస్మృతి బిల్లు, పెరిగిపోతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి అంశాలపై సభలో గట్టిగా నిలదీసి, కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్ష కూటమి సిద్ధమవుతోంది. తిప్పికొట్టేందుకు అధికార పక్షం ప్రతివ్యూహాలు పన్నుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 23 రోజుల పాటు జరిగే ఈ సెషన్‌లో మొత్తం 17 రోజుల పాటు పార్లమెంట్ భేటీ కానుంది. పార్లమెంటరీ వర్గాల సమాచారం ప్రకారం.. వర్షాకాల సమావేశాలు పాత పార్లమెంట్ భవనంలో ప్రారంభమై, సమావేశాల మధ్యలో నూతన భవనానికి మారుతాయి. ఈసారి మొత్తం 21 బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇందులో ప్రధానమైంది ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లు.

యూసీసీ, ఢిల్లీ ఆర్డినెన్స్‌పై రగడ తప్పదా?

మణిపూర్‌లో హింసాకాండపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సహా ఇతర ప్రతిపక్షాలు గట్టి పట్టుదలతో ఉన్నాయి. యూసీసీ బిల్లుపై కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఎంసీ సహా ఇతర విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే అన్ని స్థాయిల్లో అడ్డుకునేందుకు వ్యూహాన్ని సిద్ధం చేసుకున్నాయి. ఢిల్లీ విషయంలో కేంద్ర ఆర్డినెన్స్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీన్ని అడ్డుకోవడమే లక్ష్యంగా ఆయన బీఆర్ఎస్, టీఎంసీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీల మద్దతు కూడగట్టారు.

జోషి ఆధ్వర్యంలో అఖిలపక్షం భేటీ

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు ప్రస్తావించే అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు. జోషి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో కీలకపార్టీల నేతలు పాల్గొన్నారు. 32 అంశాలు పార్లమెంట్‌లో ప్రస్తావనకు రానున్నట్లు జోషి చెప్పారు. కాగా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సజావుగా సాగాలని కేంద్ర ప్రభుత్వం నిజంగా కోరుకుంటే, సభలో ప్రతిపక్షాలు లేవనెత్తే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ అధిర రంజన్ చౌదరి అన్నారు. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అని వ్యాఖ్యానించారు.

మా డిమాండ్‌కు వైఎస్సార్‌సీపీ, బీఆర్ఎస్ మద్దతు: బీజేడీ

వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని బిజూ జనతాదళ్(బీజేడీ) ఎంపీ శశ్మిత్ పాత్రా కోరారు. అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై తమ డిమాండ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, వామపక్షాలు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు.

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే నియామకానికి రాష్ట్రపతి ముర్ము ఆమోదముద్ర వేశారు. ఒరిస్సా, గుజరాత్, కేరళ హైకోర్టులకూ నూతన సీజేలను నియమించారు. ఈ వివరాలను న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ బుధవారం ట్వీట్‌చేశారు. కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ అలోక్ అరాధేను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా , ఒరిస్సా హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుభాషిశ్ తాళపత్రను అదే హైకోర్టుకు సీజేగా ఖరారు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఒరిస్సా హైకోర్టులో ప్రస్తుత సీజే ఆగస్టు ఏడున రిటైర్ అయ్యాక జస్టిస్ సుభాషిశ్ సీజేగా బాధ్యతలు స్వీకరిస్తారు. అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తి జస్టిస్ సునీతా అగర్వాల్‌ను గుజరాత్ హైకోర్టు సీజేగా నియమించారు. గుజరాత్ హైకోర్టులో జడ్జి అయిన జస్టిస్ ఆశిశ్ జె.దేశాయ్‌ను కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. ఈ నెల మొదట్లో ఈ హైకోర్టులతోపాటు ఆంధ్రప్రదేశ్, మణిపూర్ హైకోర్టులకూ సీజేలుగా జడ్జీల పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫార్సు చేయగా ఏపీ, మణిపూర్ హైకోర్టుల్లో నియామకాలపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జడ్జి అయిన జస్టిస్ పి.సామ్ కోశీని తెలంగాణ హైకోర్టుకు బదిలీచేశారు.

సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్ ..!

లండన్: ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్టు కలిగిన దేశంగా సింగపూర్ నంబర్‌వన్ స్థానంలో నిలిచింది. ఈ దేశం పాస్‌పోర్టు ఉంటే ఎలాంటి వీసా లేకుండా 192 దేశాలకు ప్రయాణించవచ్చు. ఇన్నాళ్లు నెంబర్ వన్ స్థానంలో ఉంటూ వచ్చిన జపాన్‌ను తోసిరాజని సింగపూర్ మొదటి ర్యాంక్ దక్కించుకుంది. హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ 2023 సంవత్సరానికి విడుదల చేసిన జాబితాలో సింగపూర్ తొలిస్థానంలో నిలిస్తే భారత్ 80వ ర్యాంక్ దక్కించుకుంది. భారత్ వీసా ఉంటే ఇండోనేసియా, రువాండా, జమైకా, శ్రీలంక వంటి దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. కానీ ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా 177 దేశాలకు భారతీయులు వెళ్లాలంటే వీసా తీసుకొని తీరాలి. అమెరికా, చైనా, రష్యా, జపాన్ సహా పలు యూరోపియన్ యూనియన్ దేశాలకు వీసా తప్పకుండా తీసుకోవాలి. వీసా లేకుండా పాస్‌పోర్టు సాయంతో ఎన్ని దేశాలకు వెళ్లగలరు అనే అంశం ఆధారంగా ఈ జాబితాను రూపొందించారు. లండన్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ (ఐఏటీఏ) ఇచ్చే డేటా ఆధారంగా తొలిసారిగా ఈ జాబితా రూపొందించింది. జాబితాలో అమెరికాకు ఎనిమిదో స్థానం, యూకే నాలుగో ర్యాంకులో ఉంటే అట్టడుగు స్థానంలో అఫ్గానిస్తాన్ నిలిచింది.

34 మంది మృతి

అల్జీర్స్: దక్షిణ అల్జీరియాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. జాతీయ రహదారిపై బస్సు, వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో 34 మంది మరణించారు. మరో 12 మంది గాయాలపాలయ్యారు. పరస్పరం ఢీకొన్న వెంటనే రెండు వాహనాల్లోనూ మంటలు చెలరేగాయని, అందుకే భారీగా ప్రాణనష్టం జరిగిందని అధికారులు చెప్పారు. సహారా ఎడారి సమీపంలో తామన్‌రసెట్ ప్రావిన్స్‌లో తెల్లవారుజామున 4 గంటలకు ఈ దుర్ఘటన జరిగింది.

కర్ణాటకలో 10 మంది బీజేపీ ఎమ్మెల్యేల సస్పెన్షన్

సాక్షి బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌పై అనుచితంగా ప్రవర్తించిన పది మంది బీజేపీ ఎమ్మెల్యేలను స్పీకర్ యూటీ ఖాదర్ బుధవారం సభ నుంచి సస్పెండ్ చేశారు. అసెంబ్లీలో స్పీకర్ పోడియాన్ని ముట్టడించి బిల్లుల ప్రతులను చింపి డిప్యూటీ స్పీకర్ ముఖంపై విసిరేసి అగౌరవంగా ప్రవర్తించారనే కారణంగా వారిని సస్పెండ్ చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాలు ముగిసే వరకు, అంటే ఈ నెల 21 వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని స్పీకర్ యూటీ ఖాదర్ ప్రకటించారు. బెంగళూరులో జరిగిన ప్రతిపక్షాల మహాఘట బంధన్ సభలో పాల్గొనేందుకు వచ్చిన నేతలకు స్వాగతం పలికేందుకు ఐఏఎస్ అధికారులను పంపడంపై బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తీవ్రనిరసన తెలపడంతో స్పీకర్ పైవిధంగా స్పందించారు. బీజేపీ, జేడీ(ఎస్) ఎమ్మెల్యేలు స్పీకర్ ఖాదర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం నోటీసును అసెంబ్లీ సెక్రెటరీకి అందజేశారు. మాజీ సీఎంలు బొమ్మై, కుమారస్వామి తదితరులు దీనిపై సంతకాలు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ పేలి 15 మంది దుర్మరణం

చమోలీ: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చమోలీ జిల్లాలో అలకనంద నదీ తీర ప్రాంతంలో నమామి గంగే ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న మురికినీటి శుద్ధి కర్మాగారంలో మంగళవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ పేలడం వల్ల విద్యుదాఘాతంతో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. జిల్లా ఎస్పీ ప్రమేంద్ర డోభాల్ అందించిన వివరాల ప్రకారం.. మురుగుశుద్ధి నీటి ప్లాంట్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ప్లాంట్ ప్రాంగణంలోని మెటల్ రైలింగ్‌లోకి విద్యుత్ ప్రసరించింది. అదే సమయంలో అక్కడున్న పలువురు కరెంట్‌షాక్‌కు గురయ్యారు. మరణించిన 15 మందిలో ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు హోంగార్డులు ఉన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, క్షతగాత్రుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ ధామీ ప్రకటించారు. క్షతగాత్రులను హెలికాప్టర్‌లో రిషికేష్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

గుజరాత్‌ను ముంచెత్తిన వరద



సౌరాష్ట్ర ప్రాంతంలో వర్షపునీటిలో తేలుతున్న వాహనాలు

అహ్మదాబాద్: గుజరాత్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. ప్రధానంగా సౌరాష్ట్ర ప్రాంతంలో పరిస్థితి భీతావహంగా మారింది. రోడ్లు జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. పొలాల్లో పంటలు నీట మునిగాయి. కొన్ని గ్రామాలకు బాహ్య ప్రపంచంతో అనుసంధానం తెగిపోయింది. జునాగఢ్ జిల్లాలోని మంగ్రోల్ తాలూకాలో ఇళ్లలోకి నీరు చేరింది. జన జీవనం స్తంభించింది. ఇక్కడ గత 8 గంటల్లో 290 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. డ్యామ్‌లు నిండిపోవడంతో నీటిని కిందికి వదిలారు. నదులు పొంగిపొర్లుతున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.



ఒత్తిడిలోనూ సడలని ధైర్యం

కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ బెంగళూరులో మంగళవారం జరిగిన విపక్షాల సమావేశంలో పాల్గొని విమానంలో ఢిల్లీకి తిరిగి వస్తుండగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వచ్చింది. విమానంలో సోనియా ఆక్సిజన్ మాస్క్ ధరించారు. ఈ చిత్రాన్ని రాహుల్ గాంధీ బుధవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. ఒత్తిడిలోనూ సడలని ధైర్యం అంటూ తన తల్లికి కితాబిచ్చారు.

జీతేగా భారత్

విపక్ష కూటమి 'ఇండియా' ట్యాగ్‌లైన్

న్యూఢిల్లీ: 26 ప్రతిపక్షాలలో కూడిన 'ఇండియా' కూటమి జీతేగా భారత్(భారతదేశం జయిస్తుంది)ను తమ ట్యాగ్‌లైన్‌గా ఖరారు చేసుకుంది. వచ్చే ఏడాది జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా ఈ నినాదాన్ని ఎంచుకుంది. హిందీలో ఉన్న ఈ నినాదం ఇతర ప్రాంతీయ భాషలు మాట్లాడే వారికి సులభంగా అర్థమవుతుందని, వారు దాన్ని సొంతం చేసుకుంటారని భావిస్తున్నట్లు విపక్ష నేత ఒకరు అభిప్రాయపడ్డారు. కాగా, విపక్ష కూటమి 'ఇండియా' తొలి సమావేశం గురువారం జరగనుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై ప్రతిపక్ష నేతలు చర్చించనున్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత అయిన కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో ఈ భేటీ జరుగుతుంది. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని ఇరుకున పెట్టాలని, ఈ అంశంలో కలసికట్టుగా వ్యవహరించాలని ప్రతిపక్ష నాయకులు నిర్ణయించుకున్నారు.

కొత్త సీసాలో పాత సారా

వందేమాతరం ఆలపించను, ఒకరికి తలవంచను, అందుకు నా మతం అంగీకరించదు అంటూ సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యే అబూ అజ్మీ మహారాష్ట్ర అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పేరు మారినా విపక్ష కూటమి బుద్ధి మారలేదని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. విపక్షకూటమిలో ఎస్పీ ఉంది. పేరు మార్చుకున్నంత మాత్రాన వ్యక్తుల మనస్తత్వం మారదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ పేర్కొన్నారు. విపక్ష కూటమి కొత్త సీసాలో పాత సారాలా ఉందని ఎద్దేవా చేశారు.

సాక్షి
కరీంనగర్
గురువారం । 20 । జూలై । 2023



సహకార సంఘాల్లో ఔషధాలు

సహకార సంఘాల్లో జనరిక్ ఔషధాలు విక్రయించేందుకు కేంద్రం యోచిస్తోంది. జిల్లాలోని నాలుగు సంఘాల్లో మందుల విక్రయాలకు ఆమోదం రానుంది. 8లో▸



నేటి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే

జిల్లాలోని పలు గ్రామాల్లో నేటినుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

పేదలులేని 'పెద్ద'పల్లి

- తరువాతి స్థానంలో కరీంనగర్
- జాతీయ బహుముఖ పేదరిక సూచీలో వెనకబడ్డ జగిత్యాల

సాక్షిప్రతినిధి,కరీంనగర్: పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. తాజాగా 'జాతీయ బహుముఖ పేదరిక సూచీ (ఎంపీఐ)– ఒక ప్రగతి సమీక్ష' పేరిట నీతి ఆయోగ్ నివేదిక గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జాతీయస్థాయిలో నిర్వహించిన ఈసర్వేలో పలుఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. ముఖ్యంగా దేశంలో పేదరికం తగ్గి, ఆర్థిక అంతరాలు క్రమంగా సమసిపోతున్నాయని నివేదిక పునరుద్ఘాటించింది. నేషనల్ ఫ్యామిలీ అండ్ హెల్త్ సర్వే (ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్)–4తో ఎన్‌హెచ్‌ఎఫ్‌ఎస్–5తో పోల్చి ఈ సర్వే వివరాలను నీతి ఆయోగ్ విడుదల చేసింది. దీని ప్రకారం.. ఉమ్మడి జిల్లాలోనూ పేదరికం తగ్గింది. జగిత్యాలలో 4.77 శాతం,రాజన్న సిరిసిల్లలో 3.68 శాతం, కరీంనగర్‌లో 2.50 శాతం, పెద్దపల్లిలో 2.17 శాతంగా నమోదైంది. ఇందులో పెద్దపల్లి అతితక్కువ 2.17 శాతం పేదరికంతో రాష్ట్రంలో అత్యంత తక్కువ సంఖ్యలో పేదలు ఉన్న జిల్లాగా రికార్డు సృష్టించింది. జిల్లాలో అధికశాతం పారిశ్రామిక ప్రాంతం కావడం, రోడ్డు రవాణా, రైల్వే కనెక్టివిటీ, విద్యా, వైద్యం తదితర సదుపాయాల దృష్ట్యా మొదటి నుంచి పెద్దపల్లి జిల్లా ముందువరుసలో నిలిచింది.

ఎస్‌ఆర్‌ఆర్‌లో పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలలో ఫిబ్రవరి 2023లో నిర్వహించిన జాతీయసదస్సు వ్యాసాలతో కూడిన పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి సహకారంతో కళాశాల తెలుగు విభాగం 'డిజిటల్ హ్యూమానిటీస్' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. వారు సమర్పించిన పరిశోధక పత్రాలతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె.మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.హిమబిందు అధ్యాపకులు ప్రమోద కుమార్, విశ్వప్రసాద్, శారద, వెంకటేశ్వర్లు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమమైనది ఉపాధ్యాయ వృత్తి



సమ్మేళనంలో ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: ప్రపంచంలోనే ఉపాధ్యాయవృత్తి అత్యుత్తమమైందని కరీంనగర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి తెలిపారు. 1965–67 బ్యాచ్ బీటీఎస్(బేసిక్ ట్రెనింగ్ స్కూల్) పూర్వ విద్యార్థులు మహిళా డిగ్రీ కాలేజీలో 58ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడారు. ఈ ప్రపంచం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ఆయా రంగాల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల అకుంఠిత దీక్ష, నిస్వార్థ సేవలే కారణమని పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 58ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకేచోట ఆత్మీయసమ్మేళనం నిర్వహించడం అరుదైన వేడుకని తెలిపారు. మహిళా డిగ్రీ కాలేజీ పీడీలు చక్రధర్‌రావు, జితేందర్‌రావు, ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.శర్మ పాల్గొన్నారు.

బెస్ట్ అవేలబుల్ స్కూళ్లకు నేడు లాటరీ ద్వారా ఎంపిక

కరీంనగర్: జిల్లాలోని బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌లో 2023–24 ఏడాదికిగానూ 1వ తరగతి(నాన్–రెసిడెన్షియల్), 5వ తరగతి (రెసిడెన్షియల్)లలో ప్రవేశాలకు ఎస్సీ విద్యార్థినీ,విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో సహా వారి తల్లిదండ్రులు గురువారం ఉదయం 11గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

వానొచ్చే.. వరదొచ్చే!

- వరుస వానలతో ప్రాజెక్టులకు మొదలైన వరద
- వరినాట్లు మొదలుపెట్టిన రైతన్నలు
- ఎగువ ప్రవాహాలతో మిడ్‌మానేరు దిగువకు నీరు
- మానేరుకు వాగుల నుంచి మొదలుకాని వరద
- ఎల్లంపల్లిలో పెరుగుతున్న వరద ఉధృతి



నిండుతున్న దిగువమానేరు డ్యాం



కరీంనగర్ శివారులో నాట్లు వేస్తున్న మహిళలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మూడురోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు పొలంపనులు మొదలుపెట్టారు. బుధవారం సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో అత్యధికంగా 3.2 సెం.మీ వర్షపాతం, పెద్దపల్లిలో కాల్వ శ్రీరాంపూర్‌లో 2.9 సెం.మీ, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం 2.8 సెం.మీ, కరీంనగర్ జిల్లా ఇల్లందకుంటలో 2.9 సెం.మీల వర్షపాతం నమోదైంది.

పెరుగుతున్న ఇన్‌ఫ్లో..

కాళేశ్వరం ఎత్తిపోతల నుంచి కొన్నిరోజులు, ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా మొదలైన వరద ప్రవాహాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ఈనెల 15 వరకు ఎలాంటి వానలు లేకపోవడంతో ఇక ప్రాజెక్టులను కాళేశ్వరం నీటితో నింపేందుకు పంపింగ్ ప్రారంభించారు. రామడుగు లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా కాళేశ్వరం జలాలతో మిడ్‌మానేరును నింపుతున్నారు. అక్కడి నుంచి దిగువకు వదుతారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సైతం ఈనెల 17న మిడ్‌మానేరు నుంచి కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేసిన 5 టీఎంసీల నీటిని దిగువన ఉన్న లోయర్‌మానేరు డ్యాంకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇంతలో వర్షాలు మొదలయ్యాయి. దీంతో రైతులు నాట్లు వేయడంలో తలమునకలయ్యారు. మానేరుపై నిర్మించిన ప్రాజెక్టులకు మానేరు నది, మోయతుమ్మెద వాగు, ఎస్సారెస్పీ, మూలవాగుల నుంచి వచ్చే ప్రవాహాలే మూలాధారం. వాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి వరద లేకపోవడంతో ప్రాజెక్టులలోకి తక్కువ నీరు చేరుతోంది.

జిల్లాలో వర్షపాతం ఇలా

గంగాధరలో 19.8 మిల్లీమీటర్లు,రామడుగులో 21.2, చొప్పదండిలో 13.6, కరీంనగర్‌రూరల్(2)17.6, గన్నేరువరంలో 11.2, కరీంనగర్‌లో15.8, మానకొండూర్ 10.4, తిమ్మాపూర్‌లో 16.6, చిగురుమామిడిలో 18.2, సైదాపూర్‌లో 14.8, శంకరపట్నంలో 14.4, వీణవంకలో20.4, హుజూరాబాద్‌లో 19.8, జమ్మికుంటలో 20.2, ఇల్లందకుంటలో 29.0 మి.మీ.వర్షం కురిసింది.

మిడ్‌మానేరు నుంచి దిగువకు..

మానేరుపై బోయిన్‌పల్లి వద్ద నిర్మించిన మిడ్ మానేరు ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఈనెల 12న ప్రాజెక్టులో 15.61 టీఎంసీల నీరు ఉండగా.. ప్రస్తుతం అదే స్థితి కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వరదకు తోడు, ప్రాజెక్టులోకి లక్ష్మీపూర్ పంప్‌హౌస్ ద్వారా 9 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి చేరుతుంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు ఆరుగేట్ల ద్వారా 9,320 క్యూసెక్కుల నీరు లోయర్‌మానేరు డ్యాం (ఎల్‌ఎండీ) ప్రాజెక్టులోకి దిగువకు వదలుతున్నారు. ప్రాజెక్టు నుంచి వెళ్లే నీటితో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాలకు నీరందనుంది.

- దిగువనే ఉన్న లోయర్ మానేరులోకి మిడ్ మానేరు మినహా పెద్దగా ఇన్‌ఫ్లో లేదు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా గత వారం వరకు కేవలం 8 టీఎంసీల నీరే ఉంది. ప్రస్తుతం మిడ్‌మానేరు నుంచి వచ్చే నీటి ద్వారా 9.5 టీఎంసీలకు చేరింది. లోయర్ మానేరు డ్యాంకు ప్రధాన ఆధారమైదన మోయతుమ్మెద వాగు నుంచి ఆశించిన స్థాయిలో వరద రాకపోవడంతో లోయర్ మానేరు నెమ్మదిగా నిండుతోంది. ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 9.88 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది.
- పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లికి వరద పోటెత్తుతోంది. గోదావరినదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 20.175 టీఎంసీలు. వర్షాలు జాప్యం కావడంతో గతవారం ప్రాజెక్టులో కేవలం 13 టీఎంసీల నీరు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ఎగువన కురుస్తున్న వర్షాలు, కడెం, ఎస్సారెస్పీ నుంచి దిగువకు వస్తున్న నీరు భారీగా ఉంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం 15.17 టీఎంసీలకు చేరింది. ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో 5,712 క్యూసెక్కులుగా ఉండగా, ఔట్‌ఫ్లో 12,721 క్యూసెక్కులుగా ఉంది. ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి 2.20 లక్షల ఎకరాలకు నీరందిస్తారు.

ప్రాజెక్టు:	సామర్థ్యం	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
మిడ్‌మానేరు:	27.50 టీఎంసీ	15.67 టీఎంసీ	8,500 క్యూసెక్కులు	9,320 క్యూసెక్కులు
లోయర్‌మానేరు:	24.03 టీఎంసీ	09.5 టీఎంసీ	9,210 క్యూసెక్కులు	210 క్యూసెక్కులు
ఎల్లంపల్లి:	20.17 టీఎంసీ	15.17టీఎంసీ	5,712 క్యూసెక్కులు	12,721 క్యూసెక్కులు

వారం రోజుల క్రితం ప్రాజెక్టుల నీటినిలువ

మిడ్‌మానేరు:	15.61 టీఎంసీలు
లోయర్‌మానేరు:	8.44 టీఎంసీలు
ఎల్లంపల్లి:	13.78 టీఎంసీలు

కార్మికుల రక్షణే ధ్యేయం

- 576 రెయిన్‌కోట్లు పంపిణీ
- మేయర్ సునీల్‌రావు



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఉద్యోగులు, కార్మికుల రక్షణే తమ ధ్యేయమని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. వర్షాకాలంలో ఇబ్బంది పడకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వివిధ విభాగాల ఉద్యోగులు, కార్మికులకు బుధవారం భగత్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో రెయిన్‌కోట్లు అందచేశారు. కార్మికులకు పంపిణీ చేసేందుకు రూ.8లక్షలు వెచ్చించి 576 రేయిన్ కోట్లను కొనుగోలు చేశామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఇంజినీరింగ్, తాగునీటి సరఫరా, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రానిక్, హరితహారం, పారిశుద్ధ్యం, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ విభాగాల ఉద్యోగులు, కార్మికులు, సిబ్బందికి అందిస్తామని అన్నారు. కార్పొరేటర్లు జంగిలి సాగర్, కాశెట్టి లావణ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో బల్దియా ప్రత్యేక బృందాలు

వర్షాలు వరుసగా కురుస్తుండడంతో ముందు జాగ్రత్త చర్యగా నగరపాలకసంస్థ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. వర్షాలు, వరదలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మూడు ప్రత్యేక బృందాలు 24 గంటల పాటు పర్యవేక్షిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్, శానిటేషన్, డిజాస్టర్‌ఫోర్స్ విభాగాల సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించే పని కూడా చేపట్టినట్లు సమాచారం.

బాధ్యతలు స్వీకరించిన టౌన్ ఏసీపీ నరేందర్



కరీంనగర్‌క్రైం: కరీంనగర్ టౌన్ ఏసీపీగా జి.నరేందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ వన్‌టౌన్ సీఐ రవీందర్, టూటౌన్ సీఐ రామచందర్‌రావు, త్రీటౌన్ సీఐ శ్రీనివాస్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్‌తో సమావేశమై నగరంలోని శాంతిభద్రతలు, వివిధ అంశాలపై సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనంతరం కరీంనగర్ టౌన్‌లోని పోలీస్‌సిబ్బంది, అధికారులు ఏసీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

3,45,794 మంది పిల్లలు.. 3.70 లక్షల మాత్రలు



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి లలితాదేవి

- నేడు నులిపురుగు మాత్రల పంపిణీ
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు

కరీంనగర్‌టౌన్: పిల్లల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రల పంపిణీకి జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు ఏడాది నుంచి 19ఏళ్లలోపు వయసు గల పిల్లలకు మాత్రలు ఇవ్వనున్నారు. ఇప్పటికే జిల్లాలో 3.70 లక్షల మాత్రలు అందుబాటులో ఉంచారు. నేడు మాత్రలు వేసుకోలేని పిల్లలకు 27వ తేదీన వేయనున్నారు. ఏడాది నుంచి రెండేళ్ల వయసు గల పిల్లలకు 200 ఎంజీ మాత్ర నీటిలో కలిపి తాగించాలి. మూడేళ్ల నుంచి 19ఏళ్ల వయసు ఉన్న పిల్లలకు 400 ఎంజీ మాత్ర వేస్తారు. అల్బెండజోల్ మాత్రలు వేసుకున్న కొందరు పిల్లల్లో వాంతులు, వికారం కలిగితే వెంటనే వైద్యులకు సమాచారం అందించాలి. అనారోగ్యంతో ఉన్న పిల్లలకు మాత్రలు వేయవద్దు. 'పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల నులిపురుగుల నివారణతో పిల్లల్లో ఎదుగుదల ఉంటుంది.' అని డీఎంహెచ్‌వో లలితాదేవి వివరించారు.

అవగాహన ర్యాలీ

జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగులను నిర్మూలిద్దామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి అన్నారు. 20 జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగులతో ర్యాలీ నిర్వహించారు. గురువారం ఉదయం 10.30 గంటలకు శర్మనగర్‌లోని మహాత్మజ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో రాష్ట్ర పౌరసరఫరాలు, బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ కార్యక్రమం ప్రారంభిస్తారని డీఎంహెచ్‌వో లలితాదేవి ఈ సందర్భంగా తెలిపారు.

జిల్లాలో అర్హులైన పిల్లలు
1–2ఏళ్లలోపు బాలురు 9,058, బాలికలు 8,296
1–3ఏళ్ల లోపు: బాలురు 11,862, బాలికలు 12,037
3–19 ఏళ్లలోపు: బాలురు 1,53,630, బాలికలు 1,50,911
మొత్తం బాలురు: 1,74,550, బాలికలు: 1,71,244
మొత్తం బాలబాలికలు: 3,45,794
అందుబాటులో ఉన్న మాత్రలు: 3.70 లక్షలు

ఆర్డీవోను కలిసిన టీఎన్జీవోలు



ఆర్డీవోతో టీఎన్జీవోల సంఘం నేతలు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్‌ను బుధవారం టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు శశిధర్, నాగుల నర్సింహస్వామి, జిల్లా నేతలు ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సహాధ్యక్షులు రాగి శ్రీనివాస్, ఇరుమల్ల శారద, రాజేశ్వర్‌రావు, మన్మిత్‌సింగ్, బల్బీర్‌సింగ్, హర్మిందర్‌సింగ్, మారుపాక రాజేశ్‌భరద్వాజ్, నేరేళ్ల కిషన్, పోలు కిషన్, కోట రామస్వామి, రాకేశ్, సాకేతరెడ్డి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటుపై ప్రజల్లో చైతన్యం

- ఈవీఎంలపై విస్తృత అవగాహన
- కలెక్టర్ ఆర్వీ.కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్ అర్బన్: ఈవీఎంలో ఓటు ఎలా వేయాలో ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏఈవో, ఎస్‌వోలకు కంట్రోల్‌యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ల ద్వారా ఓటు వినియోగంపై ప్రజలను ఎలా చైతన్యపరచాలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కంట్రోల్ యూనిట్(సీయూ), బ్యాలెట్ యూనిట్(బీయూ), వీవీపాట్‌ల ద్వారా ఓటు వినియోగంపై ప్రజలకు స్పష్టతనివ్వాలని, ఆ దిశగా అవగాహన కల్పించాలని అన్నారు. ఈ నెల 20నుంచి ప్రారంభమయ్యే అవగాహన కార్యక్రమాలను సిబ్బంది విజయవంతం చేయాలన్నారు. నాలుగు నియోజకవర్గాలతో పాటు కలెక్టర్ కార్యాలయాన్ని కలుపుకుని ఐదు ఈవీఎం డిమోన్‌స్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎండలో గాని, నీరు ఉన్న చోట గాని వీవీపాట్ ఉండకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. రోజువారీ కార్యక్రమం ముగిసిన తరువాత ఎలక్షన్ సామగ్రిని అప్పగించాలని తెలిపారు. అవగాహన కార్యక్రమం ముగిసిన తరువాత వీవీప్యాట్‌లోని స్లిప్పులను పడేయడం, చించివేయడం వంటివి చేయకూడదని, వాటిని తహసీల్దారుకు అప్పగించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్‌లాల్, శిక్షణ సహాయ కలెక్టర్ వత్సల్ లెనిన్ టోప్పో, ఆర్డీఓ కుందారపు మహేశ్వర్, కలెక్టరేట్ ఏఓ జగత్‌సింగ్, కొత్తపల్లి తహసీల్దార్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలు.. నమోదుకు క్లబ్బులు

- నేటి నుంచి ఈవీఎంలపై అవగాహన
- ప్రతీ క్లస్టర్‌లో సంచార వాహనాలతో ప్రచారం
- క్లబ్బుల ద్వారా విస్తృత ఓటరు నమోదు
- 2 కిలో మీటర్లకో పోలింగ్ కేంద్రం



కలెక్టరేట్‌లో ఈవీఎం ప్రదర్శన కేంద్రం

కరీంనగర్ అర్బన్: ఓటరు నమోదు.. ఈవీఎంలపై అవగాహనే లక్ష్యంగా ఎన్నికల అధికారులు విస్తృత చర్యలు చేపడుతున్నారు. గురువారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రచారం ప్రారంభం కానుండగా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల క్రమంలో ఓటరు నమోదుకు క్లబ్బులు ఏర్పాటు చేయగా అవగాహనకు ఈవీఏం, వీవీప్యాట్‌లను వినియోగించనున్నారు. ఓటరు అవగాహన కార్యక్రమాలు మూడు నెలల పాటు కొనసాగనుండగా ఎన్నికల ప్రకటన వరకు కొనసాగనుంది. ఇప్పటికే మాస్టర్ ట్రెనర్లు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రతి ఓటరుకు ఓటింగ్‌పై సంపూర్ణ అవగాహనతో పాటు పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం.

ఈవీఎం ప్రదర్శన కేంద్రాలు

ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి అవగాహన కల్పించేందుకు ఈవీఎం ప్రదర్శన కేంద్రాలను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌తో పాటు కరీంనగర్, హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయాల ఆవరణతో పాటు చొప్పదండి, మానకొండూరు తహసీల్దార్ కార్యాలయాల్లో ఈవీఎం యంత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీపాట్‌ల పనితీరును వివరించనున్నారు. నియోజకవర్గానికి రెండు సంచార ప్రదర్శన వాహనాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల వరకు ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో సంచార వాహనాల ద్వారా ఓటింగ్‌పై అవగాహన కల్పించనున్నారు. ఒక్కో వాహనంలో నలుగురు సిబ్బంది ఎంపీఎస్‌వో, ఏఈవో, వీఆర్‌ఏ, కానిస్టేబుల్ ఉంటారు. జిల్లామొత్తంగా 8వాహనాలు కేటాయించగా 1338 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు అవగాహన పెంపొందించనున్నారు.

ఓటరు నమోదుకు క్లబ్బులు

పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా విస్తృత చర్యలు చేపడుతున్నారు. డిగ్రీ కళాశాలలు, ఇంటర్ కాలేజీలు, వృత్తివిద్యా కళాశాలలు, శిక్షణ కేంద్రాల్లో ఫారం–6లను అందుబాటులో ఉంచారు. అక్టోబర్ 1 నాటికి పద్దెనిమిది సంవత్సరాలు పూర్తిచేసుకునేవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

2 కిలోమీటర్లకో కేంద్రం

పోలింగ్ కేంద్రాల్లో వసతులకు యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టారు. జిల్లాలో 1,338 పోలింగ్ కేంద్రాలుండగా 9,96,454 మంది ఓటర్లున్నారు. ఓటర్ల సంఖ్య క్రమంలో పోలింగ్ కేంద్రాలను పెంచనున్నారు. ఇప్పటికే తహసీల్దార్ వారి వారి పరిధిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ర్యాంపులు, తాగునీరు, కరెంట్ తదితర వసతులున్నాయో లేదో పరిశీలిస్తుండగా తక్షణమే వసతులను సమకూరుస్తున్నారు. 2కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రం ఉండేలా చర్యలు చేపడుతున్నారు.

ఈవీఎం ప్రదర్శన కేంద్రాలు: 5
కలెక్టరేట్, కరీంనగర్ ఆర్డీవో, హుజూరాబాద్ ఆర్డీవో, చొప్పదండి, మానకొండూరు తహసీల్దార్ కార్యాలయాలు
మొత్తం సంచార ప్రదర్శన వాహనాలు: 8
కరీంనగర్: 2, చొప్పదండి: 2
హుజూరాబాద్: 2, మానకొండూరు: 2
ఒక్కో ప్రదర్శన వాహనానికి నలుగురు సిబ్బంది

కరీంనగర్: 390
హుజూరాబాద్: 305
మానకొండూరు: 316
చొప్పదండి: 327
మొత్తం పోలింగ్ కేంద్రాలు: 1,338

క్లుప్తంగా

పాఠశాల స్వీపర్లను రెగ్యులర్ చేయాలి



కరీంనగర్: ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో గత 40ఏళ్లుగా పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులర్ చేయాలని కోరుతూ ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్ స్కూల్ స్వీపర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలకు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పోరెడ్డి దామోదర్‌రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.తిరుపతి మద్దతు తెలిపారు. గత 40 సంవత్సరాలుగా రూ.150లకు పనిచేసిన వీరికి ప్రస్తుతం రూ.5200ల గౌరవ వేతనం లభిస్తుందని, కానీ వీరికి అనేక ప్రభుత్వాలు రెగ్యులర్ చేస్తామని మోసం చేస్తూ వస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, యూనియన్ నాయకులు రమేష్, అలీం,శంకరయ్య, మొండయ్య, స్వీపర్లు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



సైదాపూర్: మండలంలోని రాములపల్లిలో బుధవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.27,900 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఆరోగ్యం తెలిపారు. గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న పక్కాసమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

రైసుమిల్లులో షార్ట్‌సర్క్యూట్



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలో అబాది జమ్మికుంట ఏరియా వీణవంక రోడ్డులోని శ్రీ శక్తి ఇండస్ట్రీస్‌లో బుధవారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫైర్‌మెన్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 1000 వరకు ధాన్యం బస్తాలు, గన్నీ సంచులు కాలిపోయాయి. రూ.10లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని యాజమాని అయిత మహేశ్ తెలిపారు.

మేక ఘటనలో ట్రాన్స్‌కోకు సంబంధం లేదు

కరీంనగర్ అర్బన్: శనివారం అంగడి రైతు బజార్‌లో మేక మరణించిన ఘటనలో ట్రాన్స్‌కోకు ఎలాంటి సంబంధం లేదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. తమకు సమాచారం రాగానే కరెంట్‌ను నిలిపివేశామని, జాయింట్స్‌తో ఉన్న లూజ్‌వైర్ వాడుకోవడం తప్పని, అదే విషయాన్ని మార్కెట్ సిబ్బందికి తెలిపామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సహకార సంఘాల్లో ఔషధాలు

- జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు సొసైటీలు ఎంపిక
- గ్రామీణులకు తక్కువ ధరకే అందించాలని కేంద్రం నిర్ణయం



జమ్మికుంట ప్రాథమిక సహకార సంఘం

కరీంనగర్ అర్బన్: వ్యవసాయాధారిత సేవలందించే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)లో ఇకపై ఔషధాలు విక్రయించనున్నారు. తక్కువ ధరకు నాణ్యమైన మందులు అందేలా జనరిక్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. చౌకగా లభించే జనరిక్ మందులను గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సహకార సంఘాలు రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇప్పిస్తున్నాయి. ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి సేవలు కూడా అందిస్తున్న విషయం తెలిసిందే. ధాన్యం, ఇతర పంటల కొనుగోలుతోపాటు పెట్రోల్ బంకులు కూడా సంఘాలు నిర్వహిస్తున్నాయి. ఇదే తరహాలో సహకార సంఘాల్లో జనరిక్ మందులను విక్రయించాలని నిర్ణయించారు. త్వరలోనే అమలులోకి రానుండగా జిల్లాలో నాలుగు సొసైటీలను ఎంపిక చేసి పంపారు.

నాలుగు సంఘాల ఎంపిక

కేడీసీసీబీ పరిధిలో 128 ప్రాథమిక సహకార సంఘాలుండగా సహకార కేంద్ర బ్యాంకు శాఖలు 67 ఉన్నాయి. సంఘాల్లో సభ్యత్వమున్న రైతులు 95726 మంది కాగా బ్యాంకు ఉద్యోగులు 552, సొసైటీ ఉద్యోగులు 1700 మంది సేవలందిస్తున్నారు. ప్రయోగాత్మకంగా జిల్లాకు నాలుగు జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం సూచన మేరకు ఆర్థిక, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలు పకడ్బందీగా నిర్వహించే నాలుగు సొసైటీల వివరాలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా సహకార అధికారిని ఆదేశించింది. ఈ క్రమంలో జిల్లాలో చొప్పదండి, కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట పీఏసీఎస్‌లను ఎంపిక చేసి సహకార సంఘాల (సొసైటీ) వివరాలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

తొలుత పట్టణాల్లో..

నాణ్యమైన మందులు సరసమైన ధరలకు అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం జన్ ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వీటిలో దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, బీపీ, షుగర్ వంటి వాటితో పాటు, అన్ని రకాల మందులను తక్కువ ధరలో ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. కాగా తొలుత పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనుండగా తదుపరి గ్రామీణ ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. గ్రామీణ ప్రజలకు సమీపంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. సహకార సంఘాల్లో జన్‌ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా నాణ్యమైన జనరిక్ మందులను గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది.

వెలువడని మార్గదర్శకాలు

కాగా జన్ ఔషధ్ కేంద్రాల ఏర్పాటుకు సంఘాలను ఎంపిక చేయగా సదరు కేంద్రాలను ఎలా నిర్వహించాలనేదానిపై మార్గదర్శకాలు రాలేదు. గ్రామీణ ప్రాంతాలకు అనుగుణంగా ఉండే సహకార సంఘాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించగా తదనుగుణంగా కేంద్రాలను ఎంపిక చేశారు. కాగా ఔషధాలు విక్రయించాలంటే ఫార్మసీ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. అయితే సహకార సంఘాలలో ఏర్పాటు చేయనున్న జన్ ఔషధి కేంద్రాలకు ఫార్మసీ లైసెన్సులు ఎలా అనే అంశం త్వరలోనే తేలనుంది.

గణాంకాల్లో జిల్లా వివరాలు

ప్రాథమిక సహకార సంఘాలు: 128
సహకార కేంద్ర బ్యాంకు శాఖలు: 67
సభ్యులుగా ఉన్న మొత్తం రైతులు: 95726
జనరిక్ కేంద్రాలకు ఎంపికైన సంఘాలు: కరీంనగర్, చొప్పదండి, జమ్మికుంట, హుజూరాబాద్

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుపై సర్వే

- నేటినుంచి జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



ఫకీర్‌పేటలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

కరీంనగర్‌రూరల్: స్వచ్ఛతలో పంచాయతీలను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు కేటాయిస్తోంది. గతంలో మున్సిపాలిటీలు, నగరాలకు ర్యాంకులను ప్రకటించగా ఈ ఏడాది నుంచి గ్రామపంచాయతీలకు ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో స్వచ్ఛత అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకును కేంద్రం ప్రకటిస్తోంది. 2022 సంవత్సరంలో కరీంనగర్ జిల్లాకు జాతీయస్థాయిలో 37ర్యాంకు వచ్చింది. ఈ ఏడాది మెరుగైన ర్యాంకు సాధించడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

నేటి నుంచి కేంద్ర బృందం సర్వే

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం గురువారం నుంచి జిల్లాలో పర్యటించనుంది. ఉన్నతస్థాయి అధికారి ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులున్న బృందం జిల్లాలో నాలుగు రోజుల పాటు పర్యటిస్తారు. జిల్లాలో మొత్తం 313 గ్రామాలు ఉండగా.. 20 పంచాయతీలను ఎంపిక చేశారు. ఒక్కో సభ్యుడు రోజుకు ఐదు గ్రామాల్లో పర్యటిస్తారు. షెడ్యూల్ ప్రకారం గురువారం చిగురుమామిడి మండలం ఇందుర్తి, సీతారాంపూర్, చొప్పదండి మండలం గుమ్లాపూర్, గంగాధర, గన్నేరువరం మండలం జంగపల్లిలో పర్యటించనున్నారు. ఆయా పంచాయతీల్లో స్వచ్ఛత సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకుంటారు. 15 గృహాలను సందర్శించి వ్యక్తిగత మరుగుదొడ్లు, డస్ట్‌బిన్ల వినియోగం, ఇంకుడుగుంతలు, కిచెన్‌గార్డెన్, చేతులు శుభ్రం చేసే విధానం పరిశీలిస్తారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ, హెల్త్‌సెంటర్, వెటర్నరీ ఆస్పత్రి, గ్రామ పంచాయతీ, వైకుంఠధామం తదితర వాటిల్లో మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, డస్ట్‌బిన్లు తనిఖీ చేస్తారు. చెత్తట్రాక్టర్ నిర్వహణ, తడి పొడి చెత్తసేకరణ, మురికికాలువలు, డంపింగ్‌యార్డుల నిర్వహణ,వర్మీకంపోస్టు తయారీ, ఓడీఎఫ్, ఓడీఎఫ్‌ప్లస్ స్వచ్ఛత కార్యక్రమాలపై వాల్‌రైటింగ్ తదితర అంశాలను పరిశీలిస్తారు. అనంతరం 300 మార్కులకు ఎన్ని ఇవ్వాలో నిర్ణయిస్తారు. అనంతరం జాతీయ స్థాయిలో కేంద్రం ర్యాంకులు విడుదల చేస్తుంది.

‘అల్ఫోర్స్’ కెడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం



ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ డా.నరేందర్ రెడ్డి, కల్నల్ డానియల్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో స్కూల్‌లో ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసుకున్న కెడెట్లకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్‌సీసీ బెటాలియన్ దళపతి డానియల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు క్రమశిక్షణ, అంకితభావం కలిగియున్నప్పుడే అన్నిరంగాల్లో విజయాలు సాధిస్తారని తెలిపారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి.మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసపోయి.. అప్పులపై దిగులు చెంది

- దుబాయిలో వెంకట్రావుపేటవాసి ఆత్మహత్య



సాయిలు (ఫైల్)

కథలాపూర్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లిన ఓ వ్యక్తి పని విషయంలో మోసపోయాడు.. తీర్చాల్సిన అప్పులపై దిగులు చెంది, అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బీమారం మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన పస్తం సాయిలు(34)కు భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అతను స్థానికంగా కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రూ.8 లక్షల వరకు అప్పులు ఉండటంతో ఏడాది క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లాడు. అక్కడ పని విషయంలో మోసం జరగడంతో అప్పులు ఎలా తీర్చాలని ఆందోళన చెందాడు. మార్గం లేకపోవడంతో మనస్తాపానికి గురై, బుధవారం సాయంత్రం ఉరేసుకున్నాడు. తోటి కార్మికుల ద్వారా ఫోన్‌లో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాయిలు దుబాయితోపాటు గ్రామంలో చేసిన అప్పులు సుమారు రూ.10 లక్షల వరకు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు. అతని మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు గల్ఫ్ అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్ పేర్కొన్నారు.

గ్రంథాలయం వద్ద మహిళ ఆత్మహత్యాయత్నం

కరీంనగర్‌క్రైం: జిల్లా గ్రంథాలయం వద్ద ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు గమనించి ఆస్పత్రికి తరలించారు. జిల్లా గ్రంథాలయం వద్ద మల్లమ్మ అనే మహిళ హోటల్ నిర్వహిస్తోంది. గ్రంథాలయ వర్గాల ఫిర్యాదు మేరకు బుధవారం ఉదయం మున్సిపల్ అధికారులు, సిబ్బంది వచ్చి హోటల్‌ను తొలగించాలని చెప్పారు. దీంతో మల్లమ్మ గడ్డి మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు వచ్చి ఆస్పత్రికి తరలించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట: జమ్మికుంటలో తాళంవేసిన ఇంట్లో చోరీ చేసింది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని పాత కూరగాయల మార్కెట్ ఏరియాలో నివాసం ఉండే అయిత విజయలక్ష్మి ఈనెల 15న ఇంటికి తాళంవేసి హన్మకొండకు వెళ్లింది. బుధవారం ఇంటికి రాగా.. తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న 32గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి, రూ.15వేలు అపహరణకు గురయ్యాయి. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎస్సై యూనిస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



కల్యాణ్ (ఫైల్)

రాయికల్: మండలంలోని కుర్మపెల్లికి చెందిన ఆది కల్యాణ్(23) విద్యుదాఘాతంతో మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. అతను బుధవారం పొలంలో ఉన్న మోటార్‌కు మరమ్మతు చేయించి, బిగించాడన్నారు. అనంతరం పొలానికి నీరు పెట్టేందుకు మోటార్‌ను ఆన్ చేయగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజ్‌కుమార్ (ఫైల్)

జమ్మికుంట: తండ్రి మందలించాడని ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీకి చెందిన ముప్పు రాజ్‌కుమార్(19) పాలిటెక్నిక్ డిప్లొమా మధ్యలో ఆపివేశాడు. ఇంటివద్దే ఖాళీగా ఉంటున్నాడు. ఈ మధ్య కొత్త సెల్‌ఫోన్ కొనివ్వాలని తండ్రిని పలుమార్లు అడిగాడు. ఇప్పుడు ఫోన్ ఎందుకని తండ్రి మందలించడంతో ఈనెల 2న పురుగుల మందుతాగాడు. కుటుంబసభ్యులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం చనిపోయాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ రవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరీంనగర్‌లో ఒకరు..

కరీంనగర్‌క్రైం: కళాశాలకు సరిగా వెళ్లడంలేదని తల్లిదండ్రులు మందలించడంతో పురుగుల మందుతాగిన యువకుడు బుధవారం ఉదయం చనిపోయాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రుద్రోజు మహేశ్వరచారి(18) నగరంలోని ఒక కళాశాలలో ఒకేషనల్ కోర్సు చదువుతున్నాడు. కళాశాలకు సరిగా వెళ్లకపోవడం, ఇంట్లో ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మహేశ్వరచారి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద పురుగుల మందు తాగాడు. స్థానికులు అతని తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సరస్వతీ పుత్రికకు లక్ష్మీకటాక్షం కరువు

- పేదింటి బిడ్డకు నీట్‌లో 979వ ర్యాంకు
- ఉండేందుకు ఇల్లు లేని దీనస్థితి
- దాతలు సాయం చేయాలని వేడుకోలు



కుటుంబసభ్యులతో శరణ్య (కుడివైపు)

ఎలిగేడు: పేద కుటుంబంలో పుట్టి, ప్రభుత్వ విద్యాలయాల్లో చదివింది. పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించింది. నీట్‌లో ఉత్తమ ర్యాంకు తెచ్చుకుంది. తాను వైద్య విద్య చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డు వస్తున్నాయని, దాతలు సాయం చేయాలని కోరుతోంది ఆ సరస్వతీ పుత్రిక. వివరాల్లోకి వెళ్తే.. ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి కీర్తి రాజేశ్వరి–లక్ష్మయ్య దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి శరణ్య, శ్రీనిధి సంతానం. పెద్దమ్మాయి శరణ్య నీట్ ప్రవేశ పరీక్ష రాయగా రాష్ట్రస్థాయిలో 979వ ర్యాంకు వచ్చింది. వీరికి కనీసం ఉండటానికి ఇల్లు లేదు. తెలిసినవారి ఇంట్లో ఉంటున్నారు. అది కూడా శిథిలావస్థలో ఉండగా పరదాలు కప్పి, జీవనం సాగిస్తున్నారు. శరణ్య సుల్తాన్‌పూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో చదివి, పదోతరగతిలో 9.2 జీపీఏ, జగిత్యాల జిల్లా తాటిపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్ బైపీసీలో 958 మార్కులు సాధించింది. శ్రీనిధి డిప్లొమా పూర్తి చేసింది. దంపతులు కూలి పనులు చేస్తూ పిల్లలను చదివిస్తున్నారు. శరణ్య వైద్య విద్యకు రూ.లక్షల్లో ఖర్చవుతుందని, ఆ మొత్తాన్ని భరించే స్థోమత తమకు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు డాక్టర్ అవ్వాలని ఉందని, దాతలు తన చదువుకు సాయం చేయాలని శరణ్య కోరుతోంది. సహాయం చేయాల్సినవారు కీర్తి లక్ష్మయ్య 81066 22866 ఫోన్ నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే చేయాలని వేడుకుంటోంది.

వేములవాడలో కుక్కల బీభత్సం

వేములవాడ: వేములవాడలో బుధవారం కుక్కలు రెచ్చిపోయాయి. వివిధ అవసరాల కోసం బయటకు వచ్చిన 25 మందిపై దాడి చేశాయి. గాంధీనగర్, జాతరాగ్రౌండ్, ఉప్పుగడ్డ, ముదిరాజ్‌వీధి ప్రాంతాల్లో దాదాపు 25 మందిని కరిచాయి. వీరంతా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. అందిరికీ యాంటీ రెబీస్ ఇంజక్షన్లు ఇచ్చి పంపించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు తెలిపారు. కుక్కల దాడులపై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన గెరిగంటి నర్సింలు(40) పది రోజుల క్రితం బహ్రెయిన్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. బుధవారం మృతదేహం స్వగ్రామం చేరింది. కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పాతికేళ్లుగా నర్సింలు బహ్రెయిన్ వెళ్లి జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య రాధ, ముగ్గురు కుమార్తెలు నవిత, అక్షయ, సాత్విక ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

గ్రోమోర్ సెంటర్‌లో చోరీకి యత్నం

వేములవాడ: వేములవాడలోని పాపన్నచౌక్‌లో గల గ్రోమోర్ సెంటర్‌లో బుధవారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. షట్టర్ తాళాలు, వెనుక వైపున ఉన్న తలుపులను పగులగొట్టారు. ఇదే సమయంలో జనం రాకను గమనించిన దుండగులు అక్కడి నుంచి పరార్ అయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు జాగిలాలను రప్పించి తనిఖీలు చేయించారు. సెంటర్ మేనేజర్ ప్రమోద్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెంకట్రాజం తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల–రగుడు బైపాస్ రోడ్డుపై బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన బండి సందీప్(26) వరుసకు సోదరుడైన బండి బాబు కలిసి బుధవారం కోనరావుపేట మండలం సుద్దాలకు వెళ్లారు. తిరిగి సొంతూరికి వస్తుండగా రగుడు వద్ద అసంపూర్తిగా ఉన్న బైపాస్ రోడ్డుపై బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో సందీప్ తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. బాబుకు తీవ్రగాయాలవడంతో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య లాస్య, మూడేళ్ల కూతురు ఉన్నారు.

అదుపుతప్పి రెండు వాహనాలు ఢీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లిలోని ప్రధాన రహదారిపై రామాలయం సమీపంలో బుధవారం రెండు వాహనాలు అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాయి. ముందుగా వెళ్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయి నిలిచిపోయింది. వెనుకే వస్తున్న కారు డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. కారులో ఉన్న ఒకరికి స్వల్ప గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు



పెద్దపల్లిరూరల్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన దొంగను పెద్దపల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్‌కు చెందిన మహంకాళి దిలీప్ బుధవారం పెద్దపల్లిలో అనుమానా స్పదంగా కనిపించాడు. దీంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకొని, విచారించగా ద్విచక్రవాహనాలు దొంగిలించిన విషయం చెప్పాడు. అతను ఇచ్చిన సమాచారంతో రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అనిల్ పేర్కొన్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లిలో ఒక ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడన్నారు. పెద్దపల్లి ఎస్సై మహేందర్, మల్లేశ్, ఏఎస్సై రామస్వామి ఉన్నారు.

క్లుప్తంగా

అక్రమాల డీఈపై చర్యతీసుకోండి

- కలెక్టర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్
- అంశాల వారీగా లిఖితపూర్వక ఫిర్యాదు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగంలో డీఈగా పనిచేస్తున్న మసూద్‌అలీ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ కార్పొరేటర్ బండారి వేణు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్‌ను కలిసి డీఈ మసూద్ అక్రమాలపై అంశాల వారీగా లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై డీఈ నాసిరకంగా పనులు చేయిస్తున్నాడని ఆరోపించారు. పనుల అంచనాలను ఇష్టారీతిన పెంచుతూ అడ్డగోలుగా బిల్లులు తయారు చేస్తూ ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నాడని, మూడేళ్లుగా డీఈ రికార్డుచేసిన బిల్లులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరడంతో స్పందించిన కలెక్టర్ విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయమై డీఈ మసూద్ అలీని వివరణ కోరగా ఇలాంటి ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, ఏపని తన సొంతంగా చేయలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు చేశానన్నారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు.

కరీంనగర్ ఆర్డీవోగా మహేశ్వర్ బాధ్యతలు



ఆర్డీవోను సన్మానిస్తున్న తహసీల్దార్

కరీంనగర్‌అర్బన్/కరీంనగర్‌రూరల్: కరీంనగర్ ఆర్డీవోగా కుందారపు మహేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జగిత్యాల జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేసిన మహేశ్వర్ పదోన్నతిపై ఆర్డీవోగా వచ్చారు. గతంలో కలెక్టరేట్ ఏవోగా, కలెక్టరేట్ ప్రధాన విభాగాల సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్ సిరిసిల్లకు బదిలీపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కరీంనగర్‌రూరల్ తహసీల్దార్ కన్నం నారాయణ, నాయబ్ తహసీల్దార్ శంకర్, ఆర్ఐ రజినీకాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆర్డీవోగా విధుల్లో చేరిన మహేశ్‌తోపాటు బదిలీపై వెళ్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు.

పోచమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని కోతిరాంపూర్ పోచమ్మ ఆలయం హుండీలను బుధవారం లెక్కించగా రూ. 1,78,936 సమకూరినట్లు ఈవో మారుతి తెలిపారు. దేవాదాయ శాఖ పరిశీలకుడు సత్యనారాయణ పర్యవేక్షణలో లెక్కించగా చైర్మన్ పెండ్యాల వెంకటేశ్వరావు, జూనియర్ అసిస్టెంట్ గుడికాడి శ్రీనివాస్, మధు, సిబ్బంది, భక్తులు తదితరులున్నారు.

మా డబ్బులు మాకు ఇప్పించండి

విద్యానగర్: ఆదర్శ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ కరీంనగర్ బ్రాంచ్‌లో డిపాజిట్ చేసిన తమ డబ్బులు ఇప్పించాలని డిపాజిట్‌దారు అధికారులను కోరాడు. బుధవారం కరీంనగర్ ప్రెస్ భవన్‌లో సమావేశం నిర్వహించి బాధితులు మల్లారెడ్డి, బక్కయ్య, కత్తురోజు రాజమణి, కె.రాజ్యలక్ష్మి, కె.కిషన్‌రావు, జి.లచ్చిరెడ్డి,ఎం. వెంకటేశం. ఎస్.అశోక్, బి.శాంతబాయి మాట్లాడుతూ.. ఆదర్శ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీలో ఎక్కువ వడ్డీ వస్తుందని రూ.లక్షల్లో డబ్బులు డిపాజిట్ చేశామన్నారు. మూడేళ్లుగా కార్యాలయం మూసిఉందని, 2020 జనవరి నుంచి లావాదేవీలు చేయడం లేదని వాపోయారు. సొసైటీ ఎండీ ఇన్‌కమ్ టాక్స్ కట్టకపోవడంతో ప్రస్తుతం జైల్లో ఉన్నాడని ఎండీ ఆధీనంలోనే కోట్లాది రూపాయలున్నాయని తమ డిపాజిట్‌లను తిరిగి ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోని తమను ఆదుకోవాలని కోరారు.

వైద్యం కోసం తరలింపు

జమ్మికుంట: మండలంలోని వేంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన 40 మంది అనారోగ్యంతో బాధపడుతుండగా బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆదేశాల మేరకు పేద ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించేందుకు గ్రామానికి చెందిన నాయకులు హైదరాబాద్‌లోని ఆర్‌వీఎం(ఒంటిమామిడి) ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శిథిలావస్థలో సైన్స్‌వింగ్ కళాశాల



కళాశాల ప్రాంగణంలో పందుల సంచారం



తరగతి గదుల్లోకి చేరిన వర్షపు నీరు

(కరీంనగర్‌లోని కార్ఖానగడ్డలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (సైన్స్‌వింగ్) శిథిలావస్థలో ఉంది. 1976లో కో ఎడ్యుకేషన్ ప్రారంభించిన ఈ కళాశాల ప్రైవేట్ విద్యాసంస్థల రంగప్రవేశంతో ఆదరణ తగ్గినప్పటికీ తన ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. సైన్స్ విభాగంలో చదివే పేద మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వ పరంగా కరీంనగర్‌లో ఈ కళాశాల ఒక్కటే ఉండడంతో విధిలేక ఈ శిథిలమైన భవనాల్లో విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. కళాశాల గదుల్లో స్లాబ్‌లు పగుళ్లబారి వర్షాకాలం వర్షపునీరు గదుల్లోకి చేరుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ల్యాబ్‌లు, గ్రంథాలయం, రీడింగ్ రూమ్, క్లాస్‌రూమ్‌లు, బాత్రూమ్స్ పూర్తిగా శిథిలమయ్యాయి. కళాశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, లెక్చరర్లు భయపడుతున్నారు. ఈ కళాశాలలో చదివిన ఎంతోమంది విద్యార్థులు డాక్టర్లుగా, వైద్యరంగంలోని వివిధ విభాగాల్లో రాణిస్తున్నారు. కళాశాల పాత భవనాలు శిథిలావస్థకు చేరడంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అసంపూర్తిగానే ఉంది. ఈ విషయమై పలుమార్లు విద్యార్థులు, అధ్యాపకులు, వివిధ సంఘాల నాయకులు ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ కళాశాల నూతన భవన నిర్మాణాలు పూర్తిచేసి ఉత్తమ విద్యనందించడంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.



కూలిపోయిన కెమిస్ట్రీ ల్యాబ్ గది



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు



శిథిలావస్థలో తరగతి గదులు



తరగతులు నిర్వహిస్తున్న అధ్యాపకులు



మధ్యలో నిలిచిన నూతన భవన నిర్మాణం

చొక్కారావు సేవలు చిరస్మరణీయం



చొక్కారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్: మాజీ ఎంపీ జువ్వాడి చొక్కారావు శతజయంతి ఉత్సవాలను గురువారం కాంగ్రెస్ నాయకులు డీసీసీ కార్యాలయంలో, వన్‌టౌన్ సర్కిల్‌లో, ఇరుకుల్లలోని పద్మనాయక వృద్ధాశ్రమంలో, నగరంలోని వన్‌టౌన్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వైద్యులు అంజన్‌కుమార్, రహమత్ హుస్సేన్, మేనేని రోహిత్‌రావు, వెన్న రాజమల్లయ్య మడుపుమోహన్‌తో పాటు పలువురు నాయకులు హాజరై చొక్కారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్ఖానా గడ్డ వద్ద వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంలో కాంగ్రెస్ నాయకులు రోళ్ల సతీశ్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు రాగిజావ పంపిణీ చేశారు. ఇరుకుల్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. రేగొండ సందీప్ ఆధ్వర్యంలో వీర బ్రహ్మేంద్ర స్వామి అనాథాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఎండీ.ఇమ్రాన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో వేయింగ్ మిషన్, పలకలు, పెన్నుల పంపిణీచేశారు. కార్యక్రమాల్లో బీసీ, ఎస్టీ, ఎస్సీసెల్ అధ్యక్షులు, పులి అంజనేయులుగౌడ్, బానోతు శ్రావణ్‌నాయక్, కొరివి అరుణ్‌కుమార్, సిరాజు హుస్సేన్, కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, దన్నసింగ్, నెల్లి నరేశ్, కుర్ర పోచయ్య, కనుకయ్య, నాగప్రసాద్, రాజాగౌడ్, నారాయణగౌడ్, హరీశ్, శ్రీనివాస్, రాకేశ్, రమేశ్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు లిస్టు రూపొందించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్‌రెడ్డి

కొత్తపల్లి: బీఎల్‌వో(బూత్ లెవల్ ఆఫీసర్స్)లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో తప్పులు లేని ఓటరు లిస్టు రూపొందించాలని తహసీల్దార్ నల్లా వెంకట్‌రెడ్డి సూచించారు. కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల పరిధిలోని బీఎల్‌వోలతో ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విధులు, బాధ్యతలు, ఓటరు లిస్టు తయారీపై సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలని దీనిపై బీఎల్‌వోలు దృష్టిసారించాలన్నారు. బీఎల్‌వోలు తమ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు లిస్టులో తప్పిపోయిన కొత్త ఓటరు నమోదు, చనిపోయిన, అడ్రస్ మార్చుకున్న ఓటర్ల తొలగింపు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈనెల 27వరకు కొత్త ఓటరుగా నమోదయ్యే అవకాశం ఉన్నందున తప్పిపోయిన వారు ఓటరుగా నమోదయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్‌కేంద్రాల లొకేషన్ వివరాలు అందించాలని సూచించారు. ఎన్నికల మాస్టర్ ట్రైనర్స్ కె.అశోక్‌రెడ్డి, ఆర్.దేవదాసు, టి.శ్రీనివాస్, ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే 24 గంటల విద్యుత్



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ సాధ్యం కాదన్నారు. 24 గంటల కరెంట్ అవసరం లేదని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని, రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్, సాగునీరందించి ఏడాదిలో మూడు పంటలు పండించేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతు సంక్షేమ పథకాలతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ రావుల రవీందర్ రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు రాజేశ్వర్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

కరీంనగర్ నియోజకవర్గంలో టీడీపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న కనుకయ్య

విద్యానగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంటుందని టీడీపీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంగాధర కనుకయ్య అన్నారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కరీంనగర్ స్థానాన్ని తమ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. కరీంనగర్ ప్రజలు మార్పుకోరుకుంటున్నారని కరీంనగర్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు డివిజన్‌ల వారీగా కమిటీలు ఏర్పాటుచేసి 35 డివిజన్లకు అధ్యక్షులను నియమించామన్నారు. సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు వంచ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి దామెర సత్యం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కళ్యాడపు ఆగయ్య, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎర్రవెల్లి వినీత్, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయిల్ల రాజమల్లయ్య, ఐటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రవెల్లి రవీందర్, తెలుగు మహిళా పార్లమెంట్ కమిటీ ప్రధానకార్యదర్శి అన్నవేణి రజిత, బీసీసెల్ పార్లమెంట్ అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి సాగునీరందించాలి



గంగాధర: సకాలంలో వర్షాలు కురువకపోతే పంపింగ్ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిని రైతులకు సాగు నీరందించాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. మండలంలోని బూర్గుపల్లిలో బుధవారం నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని పంపింగ్ ద్వారా గంగాధరకు, కాలువల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి చెరువులు, కుంటలు నింపాలన్నారు. మోతె కాల్వల నిర్మాణాలకు భూసేకరణ పూర్తిచేయాలని, గుమ్లాపూర్ చెరువులు నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అధికారులు అశోక్ కుమార్, సుధాకిరణ్, సంతు ప్రకాశ్ పాల్గొన్నారు.

వరినాటు వేసిన ఎమ్మెల్యే

లింగంపల్లిలో ఎమ్మెల్యే రవిశంకర్ మహిళా కూలీలతో కలిసి వరినాట్లువేశారు. ప్రభుత్వ పనితీరు గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ వస్తుందా, 24 గంటల విద్యుత్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పలుగ్రామాల నాయకులు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌పై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అల్యూమీనియం ఫ్రేములు అమ్ముకుంటారని, తీగల వంతెనపై తీగలు అమ్ముకుంటారని మంత్రి గంగుల చేసిన వ్యాఖ్యలను నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు.. ఇందిరా చౌక్‌వద్ద కూడలి అభివృద్ధి పేరుతో ఒక్కొక్కటి రూ.30 లక్షలు ఖర్చు చేశారన్నారు. కేబుల్ బ్రిడ్జి కింద కొట్టుకుపోయిన చెక్ డ్యాంల పరిస్థితి ఏంటన్నారు. రోడ్లవిస్తరణ చేపట్టింది కాంగ్రెస్ హయంలోనే అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధి పేరుతో రోడ్లను కుదిస్తున్నారన్నారు. పాత సర్కస్ గ్రౌండ్‌కు చరిత్ర ఉందేదని దాన్ని కమర్షియల్‌గా మార్చి, మల్టీపర్పస్ స్కూలుకు ఆటస్థలం లేకుండా చేసిన ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. కాంగ్రెస్ హయంలో అండర్ గ్రౌండ్ పనులు చేయడంతో స్మార్ట్‌సిటీ హోదాకు అర్హత సాధించిందని గుర్తుచేశారు. సమావేశంలో దన్నసింగ్, కుర్ర పోచయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, షబానా మహ్మద్, ముల్కల కవిత, మామిడి సత్యనారాయణ రెడ్డి, షేక్ శేహెన్ష, అన్నే జ్యోతిరెడ్డి, నదీమ్, అష్రాఫ్ ఖురేషి, మహమ్మద్ ఖారీ, కమల్, తమ్మడి ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

‘మానేరు’లో మాక్ ఎలక్షన్స్



పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరెడ్డి, సునీతారెడ్డి, విద్యార్థులు

సప్తగిరికాలనీ: కరీంనగర్ మానేరు విద్యాసంస్థలో బుధవారం విద్యార్థులకు పాఠశాల కౌన్సిల్ ఎన్నికలు అట్టహాసంగా నిర్వహించారు. హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, స్పోర్ట్స్, కల్చరల్, జనరల్ కెప్టెన్‌లు, హౌస్ గ్రూప్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌లకు సాధారణ ఎన్నికల తరహాలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు ఏలా నిర్వహిస్తారో అదే తరహాలో నిర్వహించారు. పోటీ చేస్తున్న విద్యార్థులు సాధారణ ఎన్నికల తరహాలో తమకే ఓటువేసి గెలిపించాలని విస్తృతంగా ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, సిరా గుర్తులతో నిర్వహించిన ఎన్నికల్లో విద్యార్థులు ఓటుహక్కును ఉత్సాహంగా వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఓటుహక్కుపై ప్రత్యక్షంగా అవగాహన కలిగించేందుకు పాఠశాల విద్యార్థులకు మాక్ ఎలక్షన్స్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డితో పాటు ప్రిన్సిపాల్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీకే యూత్ కార్యవర్గం



జీకే యూత్ కార్యవర్గ సభ్యులతో బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: మండలంలోని గోపాల్‌పూర్‌గ్రామ జీకే యూత్ కార్యవర్గాన్ని బుధవారం జిల్లా, మండల అధ్యక్షుడు మొగిలోజు వెంకట్, జక్కు అజయ్ గౌడ్ నియమించారు. అధ్యక్షుడిగా ఊరడి వినోద్, ఉపాధ్యక్షులుగా పెంతల సాయికిరణ్, శానగొండ చందు, ప్రధానకార్యదర్శిగా బెజ్జంకి అభిలాశ్‌ను నియమించారు. ఎంపికైన కార్యవర్గాన్ని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, యూత్‌అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఆరె శ్రీకాంత్, మల్లారెడ్డి అభినందించారు.

ఆడుతూ.. పాడుతూ..



కరీంనగర్ పట్టణంలో రెండు రోజులుగా భారీ వర్షాలతో పాటు చలిగాలులు వీస్తుండడంతో తల్లి దండ్రులు తమ పిల్లలను స్కూల్‌కు పంపించేందుకు వెనుకాడుతున్నారు. ఈ క్రమంలో ఓచిన్నారి చేతిలో గొడుగుతో తన తండ్రి వెంట స్కూలుకు వెళ్తూ ‘సాక్షి’ కెమెరాకు చిక్కింది. ఆడుతు పాడుతూ చిన్నారి స్కూలుకు వెళ్తున్న దృశ్యం పలువురిని అబ్బురపర్చింది.

– సప్తగిరికాలనీ

సమాచారం

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 సంవత్సరానికి గాను అతిథి అధ్యాపక (గెస్ట్ ఫ్యాకల్టీ)పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. నాగేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలు గు, పొలిటికల్ సైన్స్, డెయిరీ సైన్స్ (ఎంఎస్సీ జువాలజీ), క్రాప్ ప్రొడక్షన్ సబ్జెక్ట్ (ఎంఎస్సీ బాటనీ) చేసిన వారు అర్హులని, పీజీలో ఓసీ, బీసీ, అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈనెల 22న సాయంత్రం 4 గంటల వరకు అకాడమిక్ కోఆర్డినేటర్ పీడీ సుజాతకు అందజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

24 నుంచి 'గురుకుల' హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువులకు అర్హత పరీక్షల సమయం ఆసన్నమైంది. ఆగస్టు 1 నుంచి ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించేందుకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పాట్లు ముమ్మరం చేసింది. తొలి పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈనెల 24 నుంచి టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డు కన్వీనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు..

పరీక్షల టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు చేసి, సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. ఇదివరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉండగా... తాజాగా వెల్లడించిన తేదీల ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు రోజుకు మూడు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 8.30గంటల నుంచి 10.30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30గంటల నుంచి 6.30గంటల వరకు మూడో సెషన్ జరుగుతుంది.

'నో క్యాస్ట్.. నో రిలీజియన్ కాలమ్ చేర్చాలి'

సాక్షి, హైదరాబాద్: విద్యతో పాటు ఇతర అన్ని దరఖాస్తుల్లో 'నో క్యాస్ట్', 'నో రిలీజియన్' అనే కాలమ్‌ను తప్పకుండా చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కులాన్ని, మతాన్ని వదులుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఆ స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను వెలువరించింది. తమ కుమారుడికి నో క్యాస్ట్.. నో రిలీజియన్ సర్టిఫికెట్ ఇవ్వాలని 2019లో సండెపు స్వరూప పలుమార్లు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో స్వరూపతో పాటు మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న జస్టిస్ కన్నెగంటి లలిత ఉత్తర్వులు జారీ చేశారు. 'పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించడం రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధం. ఆర్టికల్ 14,19,21,25ను ఉల్లంఘించడమే అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద మత స్వేచ్ఛతో పాటు ఇలాంటి కొన్ని హక్కులు పౌరులకు ఉన్నాయి. ఏ మతాన్ని, కులాన్ని ఆచరించకూడదని ఎంచుకునే హక్కు పౌరులకు ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ఇదే చెబుతోంది. నో క్యాస్ట్.. నో రిలీజియన్ అనే కాలాన్ని అన్ని దరఖాస్తుల్లో (ఆన్‌లైన్‌లోనూ) చేర్చాలని మున్సిపల్ కమిషనర్లకు, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా ఆదేశాలు జారీ చేస్తున్నాం' అని తీర్పులో పేర్కొన్నారు.

మళ్లీ లేఆఫ్స్



డౌన్ ట్రెండ్‌లో ఐటీ సెక్టార్
2022తో పోల్చితే 2023 తొలి 6 నెలల్లో అధికం
లేఆఫ్స్.ఎఫ్‌వైఐ సర్వే నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: లేఆఫ్స్ పెరుగుదలతో టెకీలకు మళ్లీ కష్టాలు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా టెకీల ఉద్వాసన పర్వం ఉధృతమవుతోంది. అమెరికా, ఐరోపాతో పాటు పలు దేశాల్లో ద్రవ్యోల్బణ పెంపుతో ఐటీ, ఇతర కంపెనీల లాభాలు తగ్గిపోయాయి. ఆర్థికరంగ ఒడిదొడుకుల కారణంగా స్టార్టప్‌లలో పెట్టుబడుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పట్టిందని నిపుణులు చెబుతున్నారు.

➤ ఆరునెలల్లోనే 2,13,020 మంది టెకీలకు ఉద్వాసన
2023లో (జనవరి నుంచి జూన్) ప్రపంచవ్యాప్తంగా 2,13,020 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ వెబ్‌సైట్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 45,166 టెకీలు ఉద్యోగాలు కోల్పోగా, ఈ ఆరునెలల్లో ఉద్యోగుల లేఆఫ్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉద్యోగులను తొలగించిన జాబితాలో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాహూ, మెటా, జూమ్ ఉన్నాయి.

➤ భారత్‌లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితులు ఉన్నాయి. మన దగ్గర ఈ ఏడాది జనవరి నుంచి జూన్ దాకా 10,774 మంది టెకీలను తొలగించినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక వెల్లడించింది. 2022లో ఉద్వాసనకు గురైన టెకీ ఉద్యోగుల సంఖ్య 6,530. ఈ ఏడాదితో పోల్చి చూసినప్పుడు తొలి ఆరునెలల్లో టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్నవారే అధికంగా ఉద్యోగాలు కోల్పోయారు.


➤ కోవిడ్ విజృంభించిన 2020లోనూ భారత్‌లోని 12,932 మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయారు. 2021లో కొత్త స్టార్టప్‌లకు ఫండింగ్ పెరిగింది. దీంతో ఈ సంఖ్య 4,080కు తగ్గింది.

బెంగళూరు టాప్

టెకీల తొలగింపులో భారత్‌లో బెంగళూరు మొదటి వరుసలో ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే అక్కడ 6,967 మంది ఉద్యోగాలు కోల్పోయారు. స్టార్టప్ హబ్‌గా రూపొందుతున్న క్రమంలో ఈ ప్రభావం అధికంగా పడినట్టు నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో లేఆఫ్‌లు పెద్దగా లేకపోవడంతో లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదికలో టెకీ ఉద్యోగుల తొలగింపునకు సంబంధించిన గణాంక వివరాలు పొందుపరచలేదు.


బెంగళూరు	ముంబై	గురుగ్రామ్
6,967	1,410	1,105
న్యూఢిల్లీ 487	చెన్నై 400	

లే ఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక ప్రకారం భారత్‌లో గత రెండేళ్లలో (6 నెలల్లో) లే ఆఫ్‌ల తీరిది..



వివిధ రంగాల వారీగా చూస్తే...

లేఆఫ్స్.ఎఫ్‌వైఐ గణాంకాల ప్రకారం 2023 తొలి ఆరునెలల్లో భారత్‌లో వివిధ రంగాల్లో 10,774 మంది తమ ఉద్యోగాలు కోల్పోయారని తన నివేదికలో పొందుపరిచింది.



ఇప్పుడు స్టార్టప్‌లదీ వ్యథే...

గత శీతాకాలం నుంచి ఇప్పటిదాకా 107 ఇండియన్ స్టార్టప్‌లలో 28,046 మంది ఉద్యోగులకు లే ఆఫ్ సెగ తాకినట్టు ఐఎన్‌సీ 42 తాజా నివేదిక వెల్లడించింది. ఏడాది కాలంలో 22 భారత ఎడ్‌టెక్ స్టార్టప్‌లు 9,871 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయని, 59 స్టార్టప్‌లు 9,271 మంది ఉద్యోగులను తొలగించినట్టు పేర్కొన్నారు.



ఆ ఏడాది చివరి దాకా తప్పదు

ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ప్రపంచవ్యాప్తంగా ఐటీ సెక్టార్ డౌన్‌ట్రెండ్‌లోనే ఉందని చెప్పాలి. టెకీల లేఆఫ్ చేసే పరిస్థితులు ఈ ఏడాది చివరిదాకా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్లోబల్ ఎకానమీ ఎఫెక్ట్ కారణంగా ఆర్థికరంగ పరిస్థితి బాగా లేకపోవడంతో అమెరికాతో సహా ఇతరదేశాలు ప్రభావితమవుతున్నాయి. ఐటీ ఎనబుల్డ్ సర్వీసెస్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉండగా, భారత్‌లోనే కొంత ప్రభావం తక్కువగా కనిపిస్తోంది. పాత టెక్నాలజీపై పనిచేస్తూ, పనితీరు బాగాలేని వారికి ఉద్వాసన పలికేందుకు దీనిని కంపెనీలు ఒక అవకాశంగా తీసుకున్నాయి. ఈ పరిస్థితుల ప్రభావం స్టార్టప్‌లపై తీవ్రంగా పడింది.

- రమణ భూపతి, క్వాలిటీ థాట్ గ్రూప్ చైర్మన్, ఎడ్‌టెక్ కంపెనీ

ప్రముఖ రచయిత శ్రీరమణ కన్నుమూత





మణికొండ: ప్రముఖ కథకుడు, వ్యంగ్య వ్యాసరచయిత, సినిమాగా వచ్చిన మిథునం కథా రచయిత, సీనియర్ జర్నలిస్టు శ్రీరమణ (71) బుధవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ ఫ్లోటిల్లా గెటెడ్ కమ్యూనిటీలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జానకి, ఇద్దరు కుమారులు చైత్ర, వంశీకృష్ణ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం మహాప్రస్థానంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. 1952 సెప్టెంబర్ 21న ఏపీలోని గుంటూరు జిల్లా వేమూరు మండలం వరహాపురం అగ్రహారంలో అనసూయ, సుబ్బారావు దంపతులకు జన్మించిన శ్రీరమణ అసలుపేరు కామరాజ రామారావు. కానీ ఆయన రచయిత శ్రీరమణగానే అందరికీసుపరిచితం.

ఏపీ సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ మృతిపట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన రాసిన కథలు మానవత్వం, విలువలతో కూడి ఉంటాయని జగన్ గుర్తుచేసుకున్నారు.

చమత్కార చక్రవర్తి

సాక్షి, హైదరాబాద్: సాహితీ ప్రపంచానికి సుపరిచితులైన శ్రీరమణ తెలుగులో పేరడీ రచయితగా సుప్రసిద్ధులు. అనేక మంది ప్రసిద్ధ రచయితల శైలిని అనుకరిస్తూ వందలకొద్దీ పేరడీలు రాసి స్వయంగా ఆయా రచయితల అభినందనలనూ పొందారు. అనేక పత్రికల్లో పేరడీలు, శ్రీకాలమ్, శ్రీచానెల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలిరేకులు వంటి ఎన్నో శీర్షికలు నిర్వహించారు. ఆయన మొదటి కథ వెలుగు తగ్గని వజ్రం 1970లలో ఆంధ్రప్రభలో వెలువడింది. ఆ తర్వాత బంగారు మురుగు పేరిట కథ రాశారు. మిథునం కథల సంపుటి ప్రచురించారు. ఆయన సినీ రంగంలో నూ పనిచేశారు. ఆంధ్రప్రభ, నవ్య వారపత్రికల కు సంపాదకులుగా, పత్రిక అనే మాసపత్రికకు గౌరవ సంపాదకుడిగా వ్యవహరించారు. హాస్యరచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 2014కిగాను కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు.

స్కూలు రోజుల్లోనే వ్యాసరచనలు...

ఆయన ప్రాథమిక విద్యను శ్రీరామ హిందూ ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేశారు. ఫస్ట్‌ఫారమ్‌లో అంటే హైస్కూలులో అడుగుపెట్టాలంటే నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులై వేమురులోని కవిరాజా జిల్లా పరిషత్ హైస్కూలులో చేరారు. ఆ పాఠశాలలో ఎస్ఎస్ఎల్సీ దాకా చదివారు. స్కూలు రోజుల్లో రామకృష్ణ మిషన్ ఆశ్రమం స్వామి వివేకానందునిపై వ్యాసరచన పోటీ నిర్వహించగా శ్రీరమణ జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. అలా వరుసగా ఆరేళ్లపాటు ప్రథముడిగా నిలిచారు. పన్నెండేళ్ల వయసులో విజయవాడ ఆకాశవాణి నుంచి యువజనుల కార్యక్రమంలో ఆయన ఇంటర్వ్యూ వచ్చింది.

బాల్య స్మృతులతో మిథునం...

శ్రీరమణ తన మనసులో బాల్యం నుంచి నాటుకున్న ఆలోచనలకు అక్షరరూపంగా మిథునం కథా సంపుటిని రచించారు. ఇది ఎన్నో సంప్రదాయ కుటుంబాల కథ అని ఆయన చెప్పేవారు. దీన్ని చదివి ముచ్చటపడిన దర్శకుడు బాపు స్వదస్తూరిలో ఆ కథను రాసి శ్రీరమణకు పంపారు. అమెరికాలో స్థిరపడిన ప్రముఖ సైకియాట్రిస్ట్, తెలుగు భాషాభిమాని, సాహితీప్రియుడైన డాక్టర్ వి. జంపాల చౌదరి ఆ దస్తూరితోనే మిథునం కథను ప్రచురించి ఇప్పటికి 4 లక్షల మందికి అందచేశారు.

శ్రీరమణగా పేరు మార్పు..

తాతకు మగ పిల్లలు లేకపోవడంతో పీయూసీ చదివే రోజుల్లో శ్రీరమణను ఆయన దత్తత తీసుకున్నారు. శ్రీరమణ జన్మనామం వంకమామిడి రాధాకృష్ణ కాగా, దత్తత వెళ్లాక కామరాజు రామారావుగా మార్చుకున్నారు. అయితే ఈ పేర్ల తికమక నుంచి బయటపడేందుకు తన పేరును శ్రీరమణగా మార్చుకున్నారు.

ఆ 187 మందిని విధుల్లోకి తీసుకోండి : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 2018లో తొలగించిన 108 అంబులెన్స్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వీరి తొలగింపు సహజ న్యాయ సూత్రాలను, సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. 8 వారాల్లోగా వారిని విధుల్లోకి తీసుకోవాలని తేల్చిచెప్పింది. ప్రభుత్వం, జీవీకే సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలో 108 అంబులెన్స్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే తమ పని గంటలను 12 నుంచి 8 గంటలకు తగ్గించాలని 108 అంబులెన్స్ సిబ్బంది 2018, ఆగస్టులో ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం 947 మంది సిబ్బందిని తొలగించింది. చట్టవిరుద్ధంగా తమను తొలగించడాన్ని సవాల్ చేస్తూ 2018లోనే ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. తొలగింపు చట్టవిరుద్ధమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినా 187 మందిని మాత్రం విధుల్లోకి తీసుకోలేదు. దీనిపై వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ కూడా దాఖలు చేశారు.



'కుంటాల'కు జలకళ

నేరడిగొండ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆదిలాబాద్ జిల్లా కుంటాల జలపాతం జలకళ సంతరించుకుంది. జలసోయగాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగా తరలి వస్తున్నారు. జలపాతం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సంబరాల్లో మునిగి తేలుతున్నారు.

ముగిసిన ట్రిపుల్‌ఐటీ రెండో విడత కౌన్సెలింగ్



అడ్మిషన్ పత్రాలు అందిస్తున్న ట్రిపుల్‌ఐటీ అధ్యాపకులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ ముగిసింది. బుధవారం క్యాంపస్ ప్రాంగణంలోని స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్ భవనంలోగల ఆడిటోరియంలో విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. 148 సీట్లకు గాను 130 మంది విద్యార్థులు హాజరు కాగా, 18 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 9గంటల నుంచి ప్రక్రియ ప్రారంభం కాగా రెండో విడత కౌన్సెలింగ్ 1నుంచి 148 వరకు నిర్వహించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్ పర్యవేక్షించారు. చింతాకుల రేఖ, కర్నాల్‌పల్లి, చేగుంట, మెదక్ జిల్లా నివాసి అయిన విద్యార్థినికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి రెండో విడత కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. నూతన విద్యార్థులు ఆగస్టు ఒకటో తేదీన క్యాంపస్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆగస్టు 2నుంచి ఐదో తేదీ వరకు అవగాహన కార్యక్రమం (ఓరియంటేషన్ ప్రోగ్రాం) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏడో తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, కోకోఆర్డినేటర్లు డాక్టర్ పావని, డాక్టర్ దత్తు, సభ్యులు డాక్టర్ కుమార్ రాగుల, డాక్టర్ కుంట్ల శ్రీకాంత్, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు హరికృష్ణ, సునీత, కృష్ణ, సంతోష్‌రెడ్డి, అధ్యాపకులు, ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఒంటికి.. రెంటికి బయటకే



ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు సతమతమవుతున్నారు. ఒంటికి.. రెంటికి వెళ్లాల్సిన పరిస్థితి వస్తే బయటకు వెళ్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని గెజిటెడ్ నెం.1 పాఠశాలలో ఇంటర్వెల్ సమయంలో పాఠశాల ప్రహరీ పక్కనే విద్యార్థులు మూత్ర విసర్జన చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఇద్దరు అదనపు కలెక్టర్ల బదిలీ

- ఆర్డీవోలకూ స్థానం చలనం



డి.మధుసూదన్



ఆర్డీవో శ్యామలాదేవి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) డి.మధుసూదన్‌నాయక్ ఖమ్మం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. కుమురంభీం జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజేశంను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో అదనపు కలెక్టర్‌గా కె.సీతారామరావును నియమించారు. రాజేశంకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. పరిపాలనలో భాగంగా రాష్ట్రంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్డీవోలు మొత్తం 28మంది బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో మంచిర్యాల ఆర్డీవో డి.వేణు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్(ఐ,సీఏడీ)కు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో కె.శ్యామలదేవి సెప్షల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉట్నూరుకు బదిలీ అయ్యారు. బెల్లంపల్లిలో ఇంకా ఎవరినీ నియమించలేదు. మంచిర్యాల ఆర్డీవోగా బి.శకుంతల రానున్నారు. శ్యామలదేవీ, వేణు ఇటీవల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పదోన్నతి పొందారు.

స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. మంగళవారం రాత్రి డార్మెంటరీలో షార్ప్‌నర్ బ్లేడ్‌తో తన చేతిని గాయపర్చుకుంది. విషయం తెలుసుకున్న డార్మెంటరీ సిబ్బంది అమ్మాయికి ప్రథమ చికిత్స చేశారు. చేతిపై స్వల్పంగా గాట్లు కావడం, ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకువెళ్ల లేదని సిబ్బంది తెలిపారు. సహచర విద్యార్థుల వేధింపులే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ వజ్రమాలను సంప్రదించగా, విద్యార్థిని కుటుంబ సమస్యల కారణంగా మానసికంగా ఒత్తిడికి గురైనట్లు తెలిసిందని వెల్లడించారు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లును వివరణ కోరగా, విద్యార్థిని ఆత్మహత్యాయత్నం విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థినిని ఇబ్బందులకు గురి చేసిన వారు ఎవరైనా ఉంటే ఆ దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

నూకలమర్రికి తూటాలగాయం

- ఎన్‌కౌంటర్‌కు 23 ఏళ్లు
- జనశక్తి ఉద్యమానికి ఎదురుదెబ్బ
- అప్పటి డీఎస్పీకి బుల్లెట్ గాయం



జనశక్తి సాయుధ దళం(ఫైల్)



అమరులపై జనశక్తి ముద్రించిన పోస్టర్

> నల్లనల్ల రేగళ్ల నల్లరేగళ్లల్ల
> ఎర్రకలువ పూలు పూసే మాయన్నా..
> రంగురంగుల ఏడురంగుల సింగిడి
> నింగి నేల పరుచుకుందో మాయన్నా..
> జనశక్తి నేత అమర్ రాసిన ఈ పాట.. అరుణోదయ విమలక్క నోట ఏడురంగుల సింగిడైంది. యూట్యూబ్‌లో 6.7 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఈ పాట నేపథ్యం తెలుసుకోవాలంటే 2000 సంవత్సరంలోకి వెళ్లాల్సిందే..
> - సిరిసిల్ల

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో నక్సలైట్లు సమాంతర ప్రభుత్వాన్ని నడిపే కాలం అదీ. గ్రామంలో ఏ పంచాయితీ అయినా పోలీస్‌స్టేషన్‌కు పోయే వారి కంటే అన్నల వద్దకు వెళ్లే వారే ఎక్కువ. ఒక్క నిమిషంలోనే పంచాయితీకి పరిష్కారం దొరికేది. ఈ పరిస్థితులు ఈనాటి తరానికి ఇది కొత్తగా అనిపిస్తుంది. కానీ 2000 సంవత్సరం నాటికి 20 ఏళ్లు నిండిన యువతకు ఎంతోకొంత తెలిసి ఉంటుంది. సరిగ్గా 23 ఏళ్ల క్రితం అంటే.. 2000 సంవత్సరం జూలై 20న వేములవాడరూరల్ మండలం నూకలమర్రిలో జరిగిన ఎన్‌కౌంటర్ జనశక్తి ఉద్యమానికి తీరని నష్టాన్ని మిగిల్చింది.

నెత్తుటి మరకల పల్లె

చైతన్యానికి మారుపేరు నూకలమర్రి. క్రీడాస్ఫూర్తిని చాటుకునే ఆ పల్లెకు తూటాలగాయాలు.. నెత్తుడి మరకలూ ఉన్నాయి. మూడు దశాబ్దాల కిందట సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో విస్తరించిన నక్సలైట్ల ఉద్యమాలకు ఆ ఊరు వేదికగా నిలిచింది. రైతుకూలీ సంఘంగా మొదలైన సీపీఐ(ఎంఎల్) జనశక్తి ఉద్యమం సాయుధ పోరాట పంథాలో భాగమైంది.

ఆ వేళ ఏం జరిగింది

2000, జూలై 20వ తేదీన సాయంత్రం సీపీఐ (ఎంఎల్) జనశక్తి పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు (డీసీఎం) రణధీర్ అలియాస్ సుంకెట సాయిలు, మరో డీసీఎం జగన్ ఆధ్వర్యంలో ఆరుగురు సాయుధ నక్సలైట్లు నూకలమర్రి శివారులోని పొట్ల దేవయ్య ఇంట్లో ఆశ్రయం పొందారు. ఆ గ్రామానికి చెందిన జనశక్తి సానుభూతిపరులను పిలిపించుకుని పార్టీ బలోపేతంపై మాట్లాడుతున్నారు. గ్రామంలో దళం ఉన్న సమాచారం పోలీసులకు అందింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సాయుధ పోలీసులు నక్సలైట్లు ఆశ్రయం పొందిన ఇంటిని చుట్టుముట్టారు. అప్రమత్తమైన జనశక్తి దళనేతలు రణధీర్, జగన్ కాల్పులు ప్రారంభించారు. అప్పటి సిరిసిల్ల డీఎస్పీ కె.మురళీధర్‌రావు(ప్రస్తుతం చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ టీఎస్ ఎస్పీడీసీఎల్)కు నక్సలైట్లు కాల్చిన బుల్లెట్ పొట్టలోంచి దూసుకెళ్లింది. పోలీసులు డీఎస్పీని ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా రణధీర్, జగన్ కాల్పులు జరుపుతూ వెనుక వైపు ఉన్న మక్కచేనులో పడి తప్పించుకున్నారు. ఆ ఇంట్లో నలుగురు సాయుధులు.. మరో ముగ్గురు నూకలమర్రి గ్రామస్తులు మిగిలి ఉన్నారు.

గంటన్నరపాటు హోరాహోరీ కాల్పులు

డీఎస్పీ మురళీధర్‌రావు గాయపడడంతో ఆగ్రహానికి లోనైన పోలీసులు ఇంటిని చుట్టుముట్టి తూటాల వర్షం కురిపించగా.. లోపలున్న నలుగురు అదే స్థాయిలో ప్రతిఘటించారు. గంటన్నరపాటు ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. మీడియాను పోలీసులు దూరం నుంచే కట్టడి చేశారు. అప్పటి వేములవాడ సీఐ రామయ్య లోపల ఎంత మంది ఉన్నారంటూ నక్సలైట్లను ప్రశ్నించాడు. లక్ష మందిమి ఉన్నామంటూ ఓ సవాల్ వచ్చింది. అది మీడియా ప్రతినిధులకు వినిపించింది.

సజీవ దహనాలు.. కాల్చివేతలు

రాత్రి 8 గంటల ప్రాంతంలో ముగ్గురు స్థానికులు బయటకు రాగా పోలీసుల తూటాలకు బలయ్యారు. మరో నలుగురు నక్సలైట్లు ఇంటిలోనే ఉండి ప్రతిఘటిస్తుంటే.. పోలీసులు ఆ ఇంటి పైకప్పు నుంచి పెట్రోల్ పోసి నిప్పు అంటించారు. నలుగురు నక్సలైట్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో సాయుధులైన వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన అశోక్, చందుర్తి మండలం సనుగులకు చెందిన చైతన్య, ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన జ్యోతి, జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం మోత్కురావుపేటకు చెందిన మల్లేశం ప్రాణాలు కోల్పోయారు. నక్సలైట్లను కలిసేందుకు వెళ్లిన నూకలమర్రికి చెందిన గసికంటి పర్శరాములు(25), సముద్రాల ఎల్లంధర్(24), దొంతుల రమేశ్(26) మరణించారు.

'జనశక్తి' నిజనిర్ధారణతో వైరుధ్యాలు

నూకలమర్రి ఘటనపై జనశక్తి రాష్ట్ర నాయకులు, పౌరహక్కుల నేతలు నిజనిర్ధారణకు వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించి.. ఇవి పోలీసుల ఏకపక్ష కాల్పులని, ప్రభుత్వ హత్యలని ఖండించారు. పత్రికల్లో వచ్చిన ఈ వార్తను అడవిలో ఉన్న పీపుల్స్‌వార్, జనశక్తి నక్సలైట్లు చూశారు. ఈ అంశంపై వారి మధ్య వాదనలు జరిగాయి. ఆయుధాలు పట్టి ప్రాణాలకు తెగించి మీరు పోరాడుతుంటే.. రాష్ట్ర నాయకులు మాత్రం స్వేచ్ఛగా అమరుల మరణాలపై నిజనిర్ధారణ చేస్తున్నారా? అంటూ పీపుల్స్‌వార్ నాయకురాలు పద్మక్క చర్చకు పెట్టారు. వారి వాదనలు జనశక్తి సాయుధ దళంలో చర్చకు దారితీసి, వైరుధ్యాలకు కారణమైంది. ఆ తరువాత 2002లో 46 మంది జనశక్తి పార్టీ నక్సలైట్లు రణధీర్ నాయకత్వంతో అప్పటి సీఎం చంద్రబాబు ఎదుట సాయుధులుగా లొంగిపోవడానికి కారణమైంది. ఈ లొంగుబాటుతో జనశక్తి పార్టీకి తీరని నష్టం జరిగింది. కాలక్రమంలో ఆ పార్టీ ఉనికి కోల్పోయింది.


మక్కచేనులోపడి..



ఆరోజు సాయంత్రం పోలీసులు మేమున్న ఇంటిని చుట్టుముట్టారు. నేను, రణధీర్ కాల్పులు జరిపి.. గోడ నుంచి దూకి మక్కచేనులో పడి తప్పించుకున్నం. మా దళసభ్యులు నలుగురు, ఊరోళ్లు ముగ్గురు చనిపోవడం బాధ అనిపించింది.

– జగన్, జనశక్తి జిల్లా కమిటీ సభ్యుడు

పక్కా సమాచారం ఉంది



ఆ రోజు గ్రేహౌండ్స్ ఫోర్స్ అందుబాటులో లేదు. తెల్లవారే కరీంనగర్‌కు సీఎం వస్తున్నాడు. అందుబాటులో ఉన్నోళ్లతో పాత వెహికిల్‌లో వెళ్లి.. ఆ ఇంటి ముందే ఆగాం. బయటకొస్తున్న నక్సలైట్లు ఫైర్ ఓపెన్ చేశారు. నాకు తూటా తగిలింది. అప్పట్లో అదో సంచలనం.

– కె.మురళీధర్‌రావు, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, టీఎస్, ఎస్పీడీసీఎల్

కాల్పులు చాలాసేపు జరిగినవి



గొల్లోల్ల ఇంట్లో అన్నలు ఉన్నరని పోలీసోళ్లు వచ్చిండ్రు. చాలా సేపు కాల్పులు జరిగినవి. నన్ను, మా ముసలాయను పోలీసోళ్లు వెళ్లి పొమ్మన్నరు. ఏడుగురు చనిపోయినట్లు తెల్లారి తెలిసింది. తెల్లందాక ఒక్కటే కాల్పులు.. మంటలు.

– వేముల భూదవ్వ, నూకలమర్రి

హాస్పిటల్ @ ఉమెన్

మహిళల కోసం... మహిళల చేత!



ఆ హాస్పిటల్‌లో మహిళలే డాక్టర్‌లు. వార్డ్ బాయ్ అనే పదం వినిపించదు. అన్ని సర్వీస్‌లూ మహిళలే అందిస్తారు. నైట్ షిఫ్ట్ అని వెనుకడుగు వేయడం ఉండదు. ఇరవై నాలుగ్గంటలూ మహిళలే పని చేస్తారు.

ఎమ్ఎమ్‌సీహెచ్... అంటే ముస్లిమ్ మెటర్నిటీ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్. ఇది హైదరాబాద్, చాదర్‌ఘాట్, ఉస్మాన్‌పురాలో ఉంది. ఈ హాస్పిటల్ గురించి చెప్పుకోవలసింది చాలానే ఉంది. మహిళల కోసం యాభై మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌లో సీఈవో నుంచి సెక్యూరిటీ స్టాఫ్ వరకూ అందరూ మహిళలే. నో ప్రాఫిట్ నో లాస్ విధానంలో పని చేస్తున్న ఈ హాస్పిటల్ గురించి సీఈవో డాక్టర్ నీలోఫర్ ఇలా వివరించారు.

■ **మూడు వందలకు పైగా...**

''మహిళా సాధికారతకు చిహ్నం మా హాస్పిటల్. ఇది 200 పడకల హాస్పిటల్. కులం, మతం, ప్రాంతం అనే భేదాలు లేకుండా మహిళలందరికీ వైద్యసేవలందిస్తాం. విశేషం ఏమిటంటే... మహిళల కోసం ఏర్పాటు చేసిన ఈ హాస్పిటల్‌లో మూడు వందల మందికి పైగా మహిళలం సేవలందిస్తున్నాం. ప్రధాన ద్వారం సెక్యూరిటీ నుంచి రిసెప్షన్, ఫార్మసీ, ఫార్మసీ స్టోర్స్ నిర్వహణ, ల్యాబ్ టెక్నీషియన్‌లు అందరూ మహిళలే. అంబులెన్స్ డ్రైవర్‌లు, వెనుక ద్వారం దగ్గర సెక్యూరిటీ దగ్గర మాత్రం మగవాళ్లు డ్యూటీ చేస్తారు. 'ఇస్లామిక్ సోషల్ సర్వీస్ సొసైటీ' నగరంలో స్థాపించిన మూడు స్కూళ్లు, మూడు హాస్పిటళ్లలో ఇది ఒకటి. మహిళల హాస్పిటల్‌గా పేరు వచ్చినప్పటికీ నిజానికి ఇది మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్. ఇందులో చిన్న పిల్లల విభాగం, డర్మటాలజీ, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జరీ విభాగాలు కూడా పని చేస్తున్నాయి. రోజుకు ఓపీ రెండు వందల వరకు ఉంటుంది. అందులో నూట పాతిక వరకు మహిళలే ఉంటారు. నెలకు సరాసరిన రెండు వందల డెలివరీలుంటాయి.

■ **ట్వంటీ ఫోర్ బై సెవెన్!**

సెక్యూరిటీ, ఫార్మసీ, రిసెప్షన్ ఇరవై నాలుగ్గంటలూ పని చేస్తుంటాయి. వారంలో ఏడు రోజులూ, రోజులో ఇరవై నాలుగ్గంటలూ డ్యూటీలో ఉంటారు మహిళలు. మీకో సంగతి తెలుసా? మా హాస్పిటల్‌లో డే కేర్ సెంటర్ ఉంది. మహిళకు తగిన సౌకర్యాలు కల్పిస్తే ఏ షిఫ్ట్‌లోనైనా డ్యూటీ చేయగలరని నిరూపిస్తోంది మా హాస్పిటల్. ఇది టీచింగ్ హాస్పిటల్. వరంగల్, కెఎన్ఆర్ యూనివర్సిటీలతో అనుసంధానమై ఉంది. బీఎస్సీ నర్సింగ్ కాలేజ్ నుంచి ఏటా ముప్పైమందికి మహిళలకు అవకాశం ఉంటుంది. హాస్టల్ కూడా ఇదే ప్రాంగణంలో ఉంది. మా హాస్పిటల్‌లో కెఫెటేరియాతో పాటు లైబ్రరీ కూడా ఉంది చూడండి. వైద్య రంగంలో అమూల్యమైన పుస్తకాల కలెక్షన్ ఉంది. బయటకు ఇవ్వం, ఎవరైనా వచ్చి చదువుకో వచ్చు.



40 ఇంక్యుబేటర్‌లు, వార్మర్, ఫొటో థెరపీ సర్వీస్, పుట్టిన బిడ్డ వినికిడి పరీక్ష కోసం ఆడిటరీ టెస్ట్ సౌకర్యం కూడా ఉంది. మా హాస్పిటల్ నిర్మాణం ఎంత ముందు చూపుతో జరిగిందంటే... డెలివరీ రూమ్ నుంచే నియోనేటల్‌కు, పోస్ట్ ఆపరేటివ్ వార్డుకు కనెక్షన్ ఉంది. అవసరమైతే బిడ్డను ఆ విభాగానికి పంపించి తల్లిని ఈ వార్డుకి షిఫ్ట్ చేస్తాం. ఇద్దరూ క్షేమంగా ఉంటే మామూలు వార్డుకి లేదా రూమ్‌కి షిఫ్ట్ చేస్తాం.

■ **వైద్యపరీక్షలిక్కడే!**

మా దగ్గర పూర్తి స్థాయి ల్యాబ్ ఉంది. 98శాతం టెస్ట్‌లు ఇక్కడే చేస్తాం. కొన్ని ప్రత్యేకమైన కేసులకు మాత్రం శాంపుల్స్ ముంబయికి పంపిస్తాం. ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్, సోనాలజిస్టలతో పాటు రేడియాలజిస్ట్ కూడా మహిళే. రేడియాలజీలో మహిళలు తక్కువగా ఉంటారు. ట్రీట్‌మెంట్ సమయంలో రేడియాలజిస్ట్ కూడా కొంత రేడియేషన్ ప్రభావానికి గురవుతుంటారు. కాబట్టి మహిళలు తాము గర్భిణులుగా ఉన్నప్పుడు డ్యూటీ చేయడం కష్టం. అందుకే ఈ రంగాన్ని ఎంచుకోవడానికి కొంచెం సంశయిస్తారు. అలాంటిది మా దగ్గర రేడియాలజిస్ట్‌గా కూడా మహిళే డ్యూటీ చేస్తున్నారు.

■ **నార్మల్ డెలివరీల రికార్డ్!**

ఎకరా విస్తీర్ణంలో నిర్మించిన మా హాస్పిటల్‌లో మొత్తం డాక్టర్లు పాతిక మంది, మెటర్నిటీ విభాగంలో ఇద్దరు హెచ్‌వోడీలతోపాటు పన్నెండు మంది డాక్టర్లు, దాదాపు వందమంది నర్సింగ్ స్టాఫ్, ఎనభైకి పైగా హౌస్ కీపింగ్ ఎంప్లాయిస్ విధులు నిర్వర్తిస్తున్నారు. పేట్ల బురుజులో ఉన్న గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్ తర్వాత అత్యధికంగా ప్రసవాలు జరిగేది మా హాస్పిటల్‌లోనే. గత ఏడాదికి గాను అత్యధికంగా నార్మల్ డెలివరీలు చేసిన హాస్పిటల్‌గా మా హాస్పిటల్‌కి ప్రశంసలు కూడా వచ్చాయి. మగ డాక్టర్లు నియోనేటల్ విభాగంలో మాత్రం ఉన్నారు.

ప్రధాన ద్వారం నుంచి కారిడార్‌తోపాటు ముఖ్యమైన ప్రదేశాలన్నీ సీసీటీవీ నిఘాలో ఉంటాయి. ఐసీయూ బెడ్ పట్టే స్థాయి లిఫ్ట్ కూడా ఉంది. ఇన్ని సౌకర్యాలున్నప్పటికీ ఇది చారిటీ హాస్పిటల్ కావడంతో మా దగ్గర ఫీజులు చాలా చాలా తక్కువ. ఓ యాభై ఐదేళ్ల కిందట ఒక మహిళ మగ డాక్టర్ దగ్గర ప్రసవం చేయించుకోవడానికి ఇష్టపడక, ఆ సమయానికి లేడీ డాక్టర్ అందుబాటులో లేక చివరికి ఆ గర్భిణీ మరణించిందట. ఆ సంఘటన తర్వాత మహిళల కోసం మహిళలే పని చేసే ఒక హాస్పిటల్ ఉండాలని భావించిన అబ్దుల్ రజాక్ లతీఫ్ ఈ హాస్పిటల్‌ను ప్రతిపాదించారు. యాభై మూడేళ్లుగా మహిళల కోసం మహిళలే ఇరవై నాలుగ్గంటలూ సేవలందిస్తున్నారు'' అంటూ వివరించారు డాక్టర్ నీలోఫర్.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మనకు ఊహ తెలిసిన దగ్గర నుంచి పెద్దయ్యాక ఇది అవ్వాలి, అది అవ్వాలి అని రకరకాల కలలు కంటాము. ఎంతో ఇష్టమైన కలను నిజం చేసుకునేందుకు ఎదురైన అడ్డంకులన్నింటిని దాటుకుని సాధిస్తాం. హమ్మయ్య చేరుకున్నాం అని కాస్త సంతోషపడేలోపు అనుకోని కుదుపులు కెరీర్‌ను పూర్తిగా నాశనం చేస్తాయి. తిరిగి కోలుకోలేని దెబ్బకొడతాయి. అచ్చం ఇలానే జరిగింది అన్నుక పర్వాణి జీవితంలో. తనకెంతో ఇష్టమైన కెరీర్‌ను వదిలేసినప్పటికీ... యోగా ఇచ్చిన ధైర్యంతో యోగానే కెరీర్‌గా మలుచుకుని సెలబ్రెటీ యోగా ట్రైనర్‌గా రాణిస్తోంది పర్వాణి.



రెక్కలిచ్చిన ఆసనం

ముంబైకి చెందిన అన్నుక పర్వాణి విద్యావంతుల కుటుంబంలో పుట్టింది. అన్నుకకు చిన్నప్పటినుంచి ఆస్తమా ఉంది. అయితే మందులు మింగడం అంటే ఇష్టం ఉండేది కాదు. దీంతో డాక్టర్స్ అయిన తాతయ్య, నాయనమ్మలు... ''రోజూ స్విమ్మింగ్ చేస్తుంటే నీ ఊపిరి తిత్తులు బలంగా మారతాయి'' అని ప్రోత్సహించేవారు. మందులు మింగే బాధ ఉండదని, అన్నుక ఎంతో ఆసక్తిగా స్విమ్మింగ్ నేర్చుకుని రోజూ ఈతకొట్టేది. ఈతలో పట్టుసాధించి జాతీయస్థాయి ఛాంపియన్ షిప్స్‌లో గోల్డ్‌మెడల్ గెలిచింది. స్విమ్మింగ్‌తోపాటు విమాన ప్రయాణం అన్నా అన్నుకకు చాలా ఇష్టం. ఈ ఇష్టంతోనే పైలట్ కావాలని కలలు కనేది. పైలట్ అయ్యి, ప్రపంచమంతా తిరిగిరావాలని... కష్టపడి కమర్షియల్ పైలట్ అయ్యింది.



అన్నుక పర్వాణి

■ **ఎగరలేకపోయింది**

అది 2008.. అన్నుక అనుకున్నట్టుగానే పైలెట్‌గా గాలిలో తేలిపోతున్న రోజులవి. ఒకరోజు బైక్ యాక్సిడెంట్‌లో అనుష్క కాళ్లు, తల, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. ఎటూ కదల్లేని పరిస్థితి. కొన్ని నెలలపాటు బెడ్‌కే పరిమితమైంది. దీంతో కమర్షియల్ పైలట్ ఉద్యోగానికి ఫిట్ కాదని జాబ్ నుంచి తొలగించారు. ఒకపక్క గాయాలతో గుచ్చుకుంటోన్న శరీరం, మరోపక్క విమానం నడపలేని పరిస్థితి అన్నుకను కలచివేసింది. ఇదే సమయంలో తల్లిదండ్రులు అండగా ఉండి, తమ సంపూర్ణ సహకారం అందించడంతో... ఫిజియోథెరపీ, యోగాలతో కొన్ని వారాలలోనే కోల్పోయిన మనోధైర్యాన్ని కూడదీసుకుంది. ఎలాగైనా లేచి నడవాలి అని నిర్ణయించుకుని ఆసనాలను కఠోరంగా సాధన చేసేది. తన తల్లి యోగా టీచర్ కావడం, చిన్నప్పటి నుంచి ఆస్తమాను ఎదుర్కోవడానికి యోగాసనాలు వేసిన అనుభవంతో ఎనిమిది నెలల్లోనే కోలుకుని తిరిగి నడవగలిగింది.

■ **యోగ శక్తిని తెలపాలని...**

యోగాతో సాధారణ స్థితికి వచ్చిన అన్నుక.. తిరిగి పైలట్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ యోగాపై ఏర్పడిన నమ్మకం, ఆసక్తితో 'యోగాను ఎందుకు కెరీర్‌గా ఎంచుకోకూడదు? ఎగరలేక కిందపడిపోయిన తనని తిరిగి లేచి నడిచేలా చేసిన ఈ యోగా శక్తిని అందరికీ తెలియచేయాలి' అనుకుని.. తొమ్మిది నెలల పాటు యోగాలో శిక్షణ తీసుకుని సర్టిఫికెట్ అందుకుంది. యోగాను మరింత లోతుగా తెలుసుకునేందుకు ముంబై యూనివర్శిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసింది. పీజీ చేస్తూనే వివిధ రకాల సంప్రదాయ యోగాలను సాధన చేసి ఔపోసన పట్టింది. ఈ క్రమంలోనే పైలట్స్, బాలే, జుంబాను నేర్చుకుని సర్టిఫికెట్ పొందింది. 2015లో బాంద్రాలో యోగా ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పింది. సంప్రదాయ యోగాసనాలకు కొన్ని టెక్నిక్స్‌ను జోడించడంతో మంచి ఫలితాలు వచ్చేవి. దీంతో అన్నుక యోగా సెంటర్ బాగా పాపులర్ అయ్యింది.

> ఎంతమంది సెలబ్రెటీలకు యోగా ట్రైనర్‌గా పనిచేసినా నాకు ఎలాంటి ఒత్తిడీ ఉండదు. శిక్షణ ఇవ్వడమంటే ఇష్టం. ట్రైనింగ్ ఇస్తూ ఎంజాయ్ చేస్తున్నాను. ఎందుకంటే, నేను మనసా వాచా కర్మణ్యా పనిచేస్తున్నాను. ఎవరికైనా సలహాలు, సూచనలు ఇచ్చినప్పుడు అవి కచ్చితత్వంతోనూ, సత్యంతోనూ ఉంటేనే వాటికి విలువ ఉంటుంది. అందుకే నేను యోగాసనాలు వేసి, వేయించి, దాని శక్తిని అందరికీ తెలిసేలా చేస్తున్నాను. అందుకే నా శిక్షణకు ఆదరణ లభిస్తోంది.



■ **అన్నుక యోగా స్టూడియో!**

యోగాపై పెరిగిన అవగాహనతో సెలబ్రెటీలు సైతం తమ ఫిట్‌నెస్‌కోసం యోగాను ఎంచుకుంటున్నారు. అన్నుక ట్రైనింగ్ బావుండడంతో.. మలైకా అరోరా, హుమా ఖురేషి, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, కరీనా కపూర్, ఆలియా భట్, దీపికా పదుకోన్, రకుల్ ప్రీత్ సింగ్, మిస్సా గుప్తా, అనన్య పాండే, జాహ్నవీ కపూర్, సోనాల్ చౌహాన్ వంటి సెలబ్రెటీలు అన్నుక దగ్గర యోగాలో శిక్షణ తీసుకున్నారు.

డిజిటల్ స్టార్ దుర్గ

నవ్వుల పువ్వుల తోటమాలి



'ధర్నా దుర్గ' గా సోషల్ మీడియాలో పాపులర్ అయిన దుర్గ ఏ ధర్నా చౌక్ దగ్గర ధర్నా చేయలేదు. సింగిల్ నినాదం కూడా చేయలేదు. అయితే ఆమె నవ్వులు మాత్రం ధర్నా చేయకపోయినా హల్‌చల్ చేస్తాయి. నాన్‌స్టాప్‌గా నవ్వేలా చేస్తాయి...

ఫ్యామిలీ ఫంక్షన్‌లలో ఏం ఉన్నా లేకపోయినా, ఎవరు ఉన్నా లేకపోయినా దుర్గ ఉండాల్సిందే. ఎందుకంటే దుర్గ ఉన్నచోట 'హా హాహో'లతో కూడిన భారీ నవ్వుల వర్షం కురుస్తుంది. ఆ నవ్వుల వర్షంలో తడిసిపోవడానికి చుట్టాలు పక్కాలు అమిత ఉత్సాహం చూపుతారు.

ఆ నవ్వుల బలంతోనే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, కంటెంట్ క్రియేటర్‌గా బోలెడు పేరు తెచ్చుకుంది దిల్లీకి చెందిన ధర్నా దుర్గ.

నిజజీవితంలోని సంఘటనల చుట్టూ హాస్యాన్ని అల్లుకునే ధర్నా దుర్గకు సామాజిక మాధ్యమాలలో భారీ అభిమాన గణం ఉంది.

హీరోయిన్‌ల గొంతును అనుకరించడం తన ప్రత్యేకత. సారా అలీఖాన్ గొంతును అద్భుతంగా అనుకరిస్తుంది. సారా ఫేవరెట్ డైలాగ్ 'నమస్తే దర్శకో'పై ఫన్నీగా వీడియో చేసింది దుర్గ. ఈ వీడియో చూసి సారా అలీఖాన్ ముచ్చటపడడమే కాదు, దుర్గను మెచ్చుకుంటూ వీడియోను పోస్ట్ చేసింది.

కరోనా కల్లోలంలో, ఇంటికే పరిమితం కావాల్సిన అనివార్యత వల్ల చాలామందిలాగే దుర్గ కూడా బోర్‌గా ఫీలైంది.

దాని నుంచి బయటపడడానికి సెలబ్రిటీలను అనుకరిస్తూ సరదాగా వీడియోలు చేయడం ప్రారంభించింది. ఇవి తన స్నేహితులకు తెగ నచ్చి సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవారు. వాటికి అనూహ్యమైన స్పందన లభించేది. ఇక అప్పటినుంచి ఆమె వెనక్కి తిరిగి చూసుకోలేదు. తలపై 'కామెడీ క్వీన్' అనే కిరీటం వచ్చి చేరింది.

'ఈ వీడియోలు ఏమిటో, లైక్‌లు ఏమిటో!' అన్నట్లుగా ఆశ్చర్యంగా చూసేవారు దుర్గ తల్లిదండ్రులు. వారికి అన్నీ ఓపికగా చెప్పేది దుర్గ.

తమ చుట్టాలు పక్కాలలో 'ఫస్ట్ డిజిటల్ కంటెంట్ క్రియేటర్'గా తొలి గుర్తింపు తెచ్చుకుంది దుర్గ.

నాటక రంగ నేపథ్యం ఉన్న దుర్గకు లోతైన పరిశీలన శక్తి ఉంది. అది తాను చేసే ఫన్నీ వీడియోలకు ఎంతో ఉపయోగపడుతుంది.

రియాలిటీ షోలపై దుర్గ వేసే ఫన్నీ పంచ్‌లకు నవ్వు ఆపుకోవడం చానా కష్టం. 'బిగ్ బాస్'లాంటి ప్రసిద్ధ రియాలిటీ షోల నుంచి క్యారెక్టర్లను అల్లుకొని ప్రేక్షకులను తెగ నవ్విస్తుంది.

నృత్య నైపుణ్యం దుర్గ అదనపు బలం.

కొరియోగ్రాఫర్‌లపై ఫన్నీ వీడియోలు చేస్తున్న క్రమంలో ఆమె చేసిన డ్యాన్స్ ఎంతోమందిని ఆకట్టుకుంది. 'డ్యాన్సర్ ధర్నా దుర్గ'గా పేరు తెచ్చుకుంది.

వేలాదిమందిని నవ్విస్తున్న ధర్నా దుర్గ... 'నవ్విస్తే ఇంత పేరు వస్తుందని తెలియదు' అంటోంది నవ్వుతూ!

ఇంటిప్స్

బెండకాయ ముదరకుండా...



రిఫ్రిజిరేటర్‌లో పెట్టినప్పటికీ ఒకోసారి బెండకాయలు పాడవుతుంటాయి. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. బెండకాయలను తాజాగా ఉంచేందుకు ఇలా చేసి చూడండి..

- మార్కెట్ నుంచి తెచ్చిన బెండకాయల్లో తాజాగా ఉన్న బెండకాయలను ఏరి పక్కన పెట్టుకోవాలి.
- తాజా బెండకాయలన్నింటిని స్పూను వెనిగర్ వేసిన నీటిలో వేసి ఇరవై నిమిషాలు ఉంచాలి. తరువాత సాధారణ నీటితో కడిగి, తడిలేకుండా తుడిచి ఆరబెట్టుకోవాలి.
- ఆరిన బెండకాయలను నచ్చిన పరిమాణం, ఆకారంలో ముక్కలుగా తరిగి జిప్‌లాక్ బ్యాగ్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో స్టోర్ చేసుకోవాలి.
- ఇలా నిల్వచేసుకుంటే బెండకాయలు ఎక్కువ రోజులపాటు తాజాగా, రుచిగా ఉంటాయి. అవసరమైనప్పుడు జిప్‌లాక్ బ్యాగ్‌ను బయటకు తీసి వేడినీటిలో కొద్దిసేపు ఉంచాలి. కూలింగ్ తగ్గిన తరువాత వాడుకోవాలి.

సైబర్ టాక్

స్నాప్‌చాట్ వాడుతున్నారా?!



ప్రతీకాత్మక చిత్రం

స్నాప్‌చాట్ అనేది ఈ రోజుల్లో టీనేజర్స్ ఎక్కువగా ఉపయోగిస్తున్న మోడర్న్ మెసేజింగ్ యాప్. ఇందులో యూజర్లు తమ ఫొటోలు, వీడియోలను స్నాప్‌లుగా మార్చుకుంటారు. మన ఫ్రెండ్స్ జాబితాలోని వారు వాటిని చూసిన తర్వాత అవి అదృశ్యమవుతాయి. స్నేహితులతో కనెక్ట్ అవడం, గేమ్స్, న్యూస్, వినోదం, క్విజ్‌లు, వినూత్న ఫొటో, వీడియో ఎడిటింగ్ టూల్స్ వంటి వివిధ ఫీచర్లను ఇది అందిస్తుంది. ఈ ఫీచర్లు, దాని ఇంటరాక్టివ్ నేచర్, సృజనాత్మకత కారణంగా స్నాప్‌చాట్ వినియోగదారులను... ముఖ్యంగా యువతను ఆకర్షిస్తోంది.

స్నాప్‌చాట్ అకౌంట్.. హ్యాకింగ్, సెక్స్టార్షన్, సైబర్ బెదిరింపు, మోసం వంటి వివిధ సైబర్ నేరాలకు అవకాశం ఇచ్చేలా ఉంది. ఇవి యూజర్ల వ్యక్తిగత సమాచారానికి తీవ్రమైన నష్టాలను కలిగిస్తాయి.

స్నాప్‌చాట్ సురక్షితంగా ఉండటానికి, వినియోగదారులు పటిష్టమైన భద్రతా పద్ధతులను అమలుచేయాలి. గోప్యతా సెట్టింగ్‌ల విషయంలో జాగ్రత్త వహించాలి. అలాగే, కంటెంట్‌ను షేర్ చేసేటప్పుడు, ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు ఉన్నట్టుగా అనిపిస్తే వెంటనే స్నాప్‌చాట్ సంబంధిత అధికారులకు నివేదించాలి.

తరచూ జరిగే నేరాలు

- ఇది వర్చువల్ దండయాత్రగా చెప్పుకోవచ్చు. స్నాప్‌చాట్ అకౌంట్ హ్యాకింగ్ అనేది ప్రధానంగా ఉన్న సైబర్‌నేరం. దీనివల్ల బాధితులు వివిధ రకాల దోపిడీకి గురవుతారు. హ్యాకర్లు యూజర్ ఖాతాలకు అనధికారక యాక్సెస్‌ను పొందడానికి ఫిషింగ్, కీ లాగింగ్ లేదా బ్రూట్ ఫోర్స్ దాడులు వంటి అనేక రకాల టెక్నాలజీలను ఉపయోగిస్తారు. ఒకసారి రాజీ పడితే హ్యాకర్లు వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయవచ్చు. హానికరమైన సందేశాలను పంపవచ్చు. లేదా తదుపరి నేరాలకు పాల్పడేందుకు యూజర్‌లా నటించవచ్చు.
- సెక్స్‌టార్షన్ అనేది ఇందులో మరింత ఆందోళన కలిగించే అంశం. సైబర్ నేరగాళ్లు అభ్యంతరకరమైన కంటెంట్‌ను పంపేలా బలవంతం చేయడం ద్వారా బాధితుల నమ్మకాన్ని దోపిడీ చేస్తారు. ఇక్కడ నుంచి తరచుగా ఆర్థికపరమైన డిమాండ్లను నెరవేర్చక పోతే విషయాన్ని బహిరంగంగా విడుదల చేస్తామని లేదా బాధితుడి పరిచయాలకు షేర్ చేస్తామని బెదిరిస్తారు. దీంతో బాధితులు తీవ్ర ఒత్తిడితో కూడిన పరిణామాలను ఎదుర్కొంటారు.
- స్నాప్‌చాట్ మెసేజ్‌ల ద్వారా సైబర్ బెదిరింపుల నుంచి విముక్తి లభించదు. వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని వేధించే, బెదిరించే లేదా ద్వేషపూరిత కంటెంట్‌ను వ్యాప్తి చేసే హానికరమైన వినియోగదారులకు ఈ ప్లాట్‌ఫారమ్ బ్రీడింగ్ గ్రౌండ్‌గా పనిచేస్తుంది. స్నాప్‌చాట్ సైబర్ బెదిరింపు తీవ్రమైన మానసిక క్షోభకు దారి తీస్తుంది. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది.
- వ్యక్తుల నకిలీ ప్రొఫైల్స్ సృష్టించడానికి స్నాప్‌చాట్ సులువుగా అనుమతిస్తుంది. దీనిని సాధారణంగా క్యాట్‌ఫిషింగ్ అని పిలుస్తారు. ఈ మోసగాళ్లు యూజర్లను తప్పుడు సంబంధాలు లేదా స్నేహాలలోకి ఆకర్షిస్తారు. కల్పిత కథలు, దొంగిలించిన చిత్రాలతో మోసగిస్తారు. ఈ విధానాల వల్ల తీవ్ర ఒత్తిడితో అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు.
- స్నాప్‌చాట్ మెసేజ్‌లు వెంటనే అదృశ్యమై, అభద్రతా భావాన్ని సృష్టించగలదు. ఈ విషయంలో యూజర్లు జాగ్రత్త వహించాలి. స్క్రీన్‌షాట్‌లు, అనధికారిక అప్లికేషన్లు, వ్యక్తిగత కంటెంట్‌ను క్యాప్చర్ చేయగలవు. ఒకసారి లీక్ అయితే, ఆ వ్యక్తి ప్రతిష్ఠకు తన వ్యక్తిగత జీవితానికి కోలుకోలేని నష్టం కలిగిస్తుంది.

కొన్ని భద్రతా చిట్కాలు

- మీ కంఫర్ట్ లెవల్‌కు అనుగుణంగా ఉండే సెట్టింగ్‌లను ఎంచుకోండి. నమ్మదగిన స్నేహితులకు మాత్రమే యాక్సెస్‌ని పరిమితం చేయండి.
- నిజజీవితంలో మీకు తెలిసిన, విశ్వసించే వ్యక్తులను మాత్రమే అనుమతించండి. హాని కలిగించే అపరిచితుల రిక్వెస్ట్‌ను యాడ్ చేయడం మానుకోండి.
- లైంగికపరమైన కంటెంట్‌ను షేర్ చేయడాన్ని నివారించండి.
- మీ సమాచారాన్ని ఇతరులు దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున మీ పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నంబర్ లేదా ఆర్థిక వివరాలను స్నాప్‌చాట్‌లో షేర్ చేయవద్దు.
- స్నాప్‌చాట్ నుండి ఎవరినైనా కలవాలని నిర్ణయించుకుంటే పబ్లిక్ లొకేషన్‌ను మాత్రమే ఎంచుకోండి.
- తెలియని షార్ట్ లింక్‌లపై క్లిక్ చేయడం లేదా అనుచిత మెసేజ్‌లకు ప్రతిస్పందిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని అందించడం మానుకోండి. స్నాప్ చాట్ లేదా చట్టబద్ధమైన కంపెనీలు... యాప్ ద్వారా మీ లాగిన్ ఆధారాలను లేదా వ్యక్తిగత వివరాలను ఎన్నటికీ అడగవు.
- స్నాప్‌చాట్ రీసెంట్ అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాల్ చేయండి. దీని ద్వారా దోపిడీ ప్రమాదాన్ని నివారించవచ్చు.
- స్నాప్ మ్యాప్ ఫీచర్‌ని ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండండి. ఇది మీరున్న ప్లేస్‌ను అకౌంట్‌లోని స్నేహితులకు చూపుతుంది. అందుకని మ్యాప్ ఫీచర్‌ను స్టాప్ చేయండి.

స్నాప్‌చాట్ ద్వారా సైబర్‌నేరానికి గురైతే వెంటనే.. https://help.snapchat.com/hc/en-us/articles/7012399221652-How-to-Report-Abuse-on-Snapchat కి రిపోర్ట్ చేయాలి. అదేవిధంగా, సమస్య పరిష్కారానికి https://www.cybercrime.gov.inలో రిపోర్ట్ చేయాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



క్వార్టర్ ఫైనల్లో సాకేత్ జోడీ

'హాల్ ఆఫ్ ఫేమ్' ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. అమెరికాలోని న్యూపోర్ట్‌లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాకేత్-యూకీ ద్వయం 3-6, 6-1, 10-8తో టామీ పాల్-స్పిజిరి (అమెరికా) జంటను ఓడించింది. హైదరాబాద్‌కు చెందిన అనిరుధ్ చంద్రశేఖర్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జంట కూడా క్వార్టర్ ఫైనల్ చేరింది. అనిరుధ్-ప్రశాంత్ 6-4, 6-3తో జూలియన్ క్యాష్ (బ్రిటన్)-మాక్సిమి క్రెసీ (అమెరికా)లపై గెలిచారు.

ఆసియా కప్‌లో సెప్టెంబర్ 2న భారత్, పాక్ పోరు

పాకిస్తాన్, శ్రీలంకలో ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 13 వరకు వన్డే ఫార్మాట్‌లో జరిగే ఆసియా కప్ షెడ్యూల్‌ను ప్రకటించారు. గ్రూప్ 'ఎ'లో భారత్, పాకిస్తాన్, నేపాల్... గ్రూప్ 'బి'లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ ఉన్నాయి. క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేపే భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ సెప్టెంబర్ 2న కాండీలో జరుగుతుంది. సెప్టెంబర్ 4న నేపాల్‌తో భారత్ ఆడుతుంది. ఒక్కో గ్రూప్ నుంచి రెండు జట్లు 'సూపర్ 4' దశకు చేరుతాయి. 'సూపర్ 4'లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు ఫైనల్లో తలపడతాయి.



భారత్‌ను గెలిపించిన జెమీమా

రెండో వన్డేలో బంగ్లాదేశ్‌పై 108 పరుగులతో నెగ్గిన హర్మన్‌ప్రీత్ బృందం


జెమీమా రోడ్రిగ్స్

మిర్పూర్: సిరీస్‌లో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు మెరిసింది. బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 108 పరుగులతో ఘనవిజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్న జెమీమా 86 పరుగులు చేయడంతోపాటు బంతితో రాణించి 3 పరుగులిచ్చి 4 వికెట్లు తీసింది. తాజా ఫలితంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రస్తుతం రెండు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. నిర్ణాయక మూడో వన్డే శనివారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 228 పరుగులు సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ (78 బంతుల్లో 86; 9 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 52; 3 ఫోర్లు) అర్ధ సెంచరీలతో భారత్‌ను ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 131 పరుగుల భాగస్వామ్యం జోడించారు. వన్డేల్లో తన అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన 22 ఏళ్ల జెమీమా 2019 తర్వాత మళ్లీ వన్డేల్లో అర్ధ సెంచరీ చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (58 బంతుల్లో 36; 4 ఫోర్లు), హర్లీన్ (36 బంతుల్లో 25) కూడా రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తానా ఖాతూన్, నహీదా అక్తర్ రెండు వికెట్ల చొప్పున తీశారు. 229 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 35.1 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌటైంది. ఫర్జానా హక్ (47; 5 ఫోర్లు), రీతూ మోని (27; 3 ఫోర్లు), ముర్షిదా ఖాతూన్ (12; 3 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. జెమీమా తన ఆఫ్ స్పిన్ మాయాజాలంతో 3.1 ఓవర్లు వేసి కేవలం 3 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టింది. లెగ్ స్పిన్నర్ దేవిక వైద్య 30 పరుగులిచ్చి 3 వికెట్లు తీసింది. మేఘన సింగ్, స్నేహ్ రాణా, దీప్తి శర్మలకు ఒక్కో వికెట్ లభించింది.

పాక్ విజయలక్ష్యం 131

గాలె: శ్రీలంక జట్టుతో తొలి టెస్టులో విజయం సాధించడానికి పాకిస్తాన్ చివరిరోజు మరో 83 పరుగులు చేయాలి. చేతిలో ఏడు వికెట్లు ఉన్నాయి. 131 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్తాన్ నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 48 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (6 బ్యాటింగ్), ఇమామ్ ఉల్ హఖ్ (25 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 14/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక 83.1 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌటైంది. ధనంజయ డిసిల్వా (82; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), నిశాన్ మదుష్కా (52; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. పాక్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్, నోమన్ అలీ మూడు వికెట్ల చొప్పున, షాహీన్ అఫ్రిది, ఆగా సల్మాన్ రెండు వికెట్ల చొప్పున తీశారు.

హర్‌మెహర్-సంజన జోడీకి రజతం



చాంగ్వాన్ (కొరియా): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్ స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో హర్‌మెహర్ సింగ్ లాలీ-సంజన సూద్ (భారత్) జోడీ రజత పతకం గెలిచింది. ఫైనల్లో హర్‌మెహర్-సంజన ద్వయం 38-43తో ఆంద్రియా గలర్దిని-సారా బోంగిని (ఇటలీ) జోడీ చేతిలో ఓడిపోయింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ సర్తాజ్ సింగ్ తివానా... మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో పాయల్ నాలుగో స్థానంలో నిలిచారు.

సాయి సుదర్శన్ అజేయ సెంచరీ

- పాకిస్తాన్ 'ఎ'పై ఎనిమిది వికెట్లతో భారత్ 'ఎ' ఘనవిజయం
- ఎమర్జింగ్ కప్ టోర్నీలో గ్రూప్ 'టాపర్'గా టీమిండియా


సాయి సుదర్శన్

కొలంబో: ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 క్రికెట్ టోర్నీ లీగ్ దశలో భారత్ 'ఎ' జట్టు అజేయంగా నిలిచింది. పాకిస్తాన్ 'ఎ'తో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 'ఎ' ఎనిమిది వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్ 'ఎ' 48 ఓవర్లలో 205 పరుగులకు ఆలౌటైంది. ఖాసిమ్ అక్రమ్ (48; 5 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత బౌలర్లలో రాజ్‌వర్ధన్ హంగార్గేకర్ 42 పరుగులిచ్చి 5 వికెట్లు, మానవ్ సుథర్ 36 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత 'ఎ' జట్టు 36.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ సాయి సుదర్శన్ (110 బంతుల్లో 104 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) పాక్ బౌలర్ల భరతంపట్టి అజేయ సెంచరీ చేశాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు అభిషేక్ శర్మ (20; 4 ఫోర్లు)తో 58 పరుగులు... రెండో వికెట్‌కు నికిన్ జోస్ (64 బంతుల్లో 53; 7 ఫోర్లు)తో 99 పరుగులు... మూడో వికెట్‌కు కెప్టెన్ యశ్ ధుల్ (21 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్)తో 53 పరుగులు జోడించాడు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమిండియా ఆరు పాయింట్లతో గ్రూప్ 'బి'లో అగ్రస్థానం పొందింది. నాలుగు పాయింట్లతో పాకిస్తాన్ రెండో స్థానంలో నిలిచింది. ఈ రెండు జట్లు ఇప్పటికే సెమీఫైనల్ చేరాయి. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో శ్రీలంక 'ఎ'తో పాకిస్తాన్ 'ఎ'; బంగ్లాదేశ్ 'ఎ'తో భారత్ 'ఎ' తలపడతాయి. ఫైనల్ 23న జరుగుతుంది.

భారత్‌కు ఎదురుందా!

భారత జట్టుపై టెస్టుల్లో వెస్టిండీస్ గెలిచి 21 ఏళ్లవుతోంది. తొలి టెస్టులో చెలరేగి సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్ వయసు అప్పుడు ఐదు నెలలు! ఈ ఉదాహరణ చాలు ఇరు జట్ల మధ్య అంతరం ఎలా ఉందో చెప్పడానికి. ఆ తర్వాత భారత్, విండీస్ 24 సార్లు తలపడితే టీమిండియా 15 టెస్టులు, గెలవగా మరో '9' డ్రా అయ్యాయి. గత మ్యాచ్‌లో విండీస్ ఆట చూస్తే ఏ రకంగానూ భారత్‌కు పోటీ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఇరు జట్లు రెండో టెస్టుకు సిద్ధమయ్యాయి. తొలి మ్యాచ్‌తో పోలిస్తే క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానం పేస్ బౌలింగ్‌కు అనుకూలించే అవకాశం ఉండటం ఆతిథ్య జట్టుకు సానుకూలత.



- నేటి నుంచి వెస్టిండీస్‌తో రెండో టెస్టు
- సిరీస్ గెలుపే లక్ష్యంగా టీమిండియా
- తీవ్ర ఒత్తిడిలో విండీస్
- రాత్రి గం.7.30 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

100 భారత్, విండీస్ మధ్య ఇది 100వ టెస్టు. ఇప్పటి వరకు జరిగిన 99 టెస్టుల్లో విండీస్ 30 గెలిస్తే, భారత్ 23 గెలిచింది. మరో 46 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

500 కోహ్లికి మూడు ఫార్మాట్‌లలో కలిపి ఇది 500వ అంతర్జాతీయ మ్యాచ్. కెరీర్‌లో అతను మొత్తం 25,461 పరుగులు సాధించాడు.

పోర్ట్ ఆఫ్ స్పెయిన్ (ట్రినిడాడ్): ఏకపక్షంగా సాగిన తొలి టెస్టు తర్వాత భారత్, వెస్టిండీస్ తర్వాతి సమరానికి సిద్ధమయ్యాయి. భారత్ 1-0తో సిరీస్‌లో ముందంజలో ఉండగా... నేటి నుంచి ఇరు జట్ల మధ్య రెండో టెస్టు జరుగుతుంది. మరో విజయంతో క్లీన్‌స్వీప్ చేయాలని రోహిత్ సేన భావిస్తుండగా... సొంతగడ్డపై కాస్త మెరుగైన ప్రదర్శనతో పరువు కాపాడుకోవాలని విండీస్ భావిస్తోంది. ఇరు జట్ల మధ్య ఇది 100వ టెస్టు మ్యాచ్ కావడం విశేషం.

మార్పుల్లేకుండా...

తుది జట్టు విషయంలో భారత్‌కు ఎలాంటి సందిగ్ధత లేదు. గెలిచిన జట్టునే కొనసాగించే క్రమంలో అదే 11 మందితో బరిలోకి దిగవచ్చు. కెరీర్ తొలి మ్యాచ్‌లో సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్‌పై మరోసారి అందరి దృష్టి నిలిచింది. అయితే ఎన్నో అంచనాలు ఉన్న శుబ్‌మన్ గిల్ టెస్టుల్లో ఆశించినంతగా రాణించలేకపోతున్నాడు. 17 టెస్టుల తర్వాత కూడా అతని సగటు 31.96 మాత్రమే ఉంది.

పేస్‌పై నమ్మకం...

అరంగేట్ర టెస్టులో అతనాజ్ ప్రదర్శన మినహా గత మ్యాచ్‌లో విండీస్ గురించి చెప్పుకోవడానికేమీ లేదు. పేలవ బ్యాటింగ్, నిస్సారమైన బౌలింగ్ ఆ జట్టును మరీ బలహీన ప్రత్యర్థిగా మార్చాయి. ఈ మ్యాచ్‌లోనైనా విండీస్ ఏమైనా పోరాడుతుందా అనేది చూడాలి. భారత్‌తో పోలిస్తే రోచ్, జోసెఫ్, గాబ్రియెల్ రూపంలో కాస్త అనుభవజ్ఞులైన పేసర్లు జట్టులో ఉన్నారు. పిచ్‌ను సరిగా వాడుకొని వీరు భారత బ్యాటర్లపై ఏమైనా ప్రభావం చూపించగలిగితే మ్యాచ్ కాస్త ఆసక్తికరంగా మారుతుంది.

తొలి రౌండ్‌లో ఓడిన సింధు



యోసు (కొరియా): కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత స్టార్, ప్రపంచ 17వ ర్యాంకర్ పీవీ సింధు 18-21, 21-10, 13-21తో 22వ ర్యాంకర్ పాయ్ యుపో (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. తస్నీమ్, మాళవిక, ఆకర్షి, తాన్యా, అస్మిత కూడా తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో కిడాంబి శ్రీకాంత్ (భారత్) 21-12, 22-24, 17-21తో కెంటో మొమోటా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయాడు. మొమోటా చేతిలో శ్రీకాంత్‌కిది వరుసగా 12వ ఓటమి. భారత నంబర్‌వన్ ప్రణయ్ 21-13, 21-17తో జూలియన్ (బెల్జియం)పై, ప్రియాన్షు 21-15, 21-19తో చోయ్ జి హున్ (కొరియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

సిక్కి రెడ్డి జోడీ గెలుపు

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో సిక్కిరెడ్డి-రోహన్ కపూర్ 21-17, 21-17తో అల్విన్ మోరాదా-అలీసా లియోన్ (ఫిలిప్పీన్స్)లపై గెలిచారు. సుమీత్ రెడ్డి-అశ్విని పొన్నప్ప 21-23, 21-13, 12-21తో సాంగ్ హున్ చో-లీ జంగ్ హున్ (కొరియా) చేతిలో ఓటమి పాలయ్యారు.

ఆస్ట్రేలియా 299/8


బ్రాడ్

మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న యాషెస్ సిరీస్ నాలుగో టెస్టులో తొలి రోజు బుధవారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (51), లబుషేన్ (51) అర్ధ సెంచరీలు సాధించగా, హెడ్ (48), స్టీవ్ స్మిత్ (41) రాణించారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ (4/52) ప్రత్యర్థిని దెబ్బ తీయగా, బ్రాడ్ 2 వికెట్లు పడగొట్టాడు. హెడ్‌ను అవుట్ చేయడం ద్వారా బ్రాడ్ టెస్టుల్లో 600 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. ఈ ఘనత సాధించిన నాలుగో బౌలర్‌గా నిలిచాడు. అత్యధిక వికెట్ల జాబితాలో మురళీధరన్ (800), షేన్ వార్న్ (708), అండర్సన్ (688) మాత్రమే బ్రాడ్‌కంటే ముందున్నారు.

సినిమా

భూమి బద్దలు!


ప్రభాస్

రోబోలాంటి సూట్, ముడి వేసిన జుట్టు, కళ్లల్లో ఫైర్‌తో గుద్దితే భూమి బద్దలైనట్లు 'ప్రాజెక్ట్ కె' చిత్రంలోని హీరో ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో దీపికా పదుకోన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ వంటి స్టార్స్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలోని ప్రభాస్ ఫస్ట్ లుక్‌ని బుధవారం విడుదల చేశారు మేకర్స్. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా 2024 జనవరి 12న విడుదల కానుంది.

సాహసాల అర్జున్


వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గాండీవధారి అర్జున'. ఈ చిత్రంలో సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించారు. ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 25న విడుదల కానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 24న రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించి, కొత్త పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు వరుణ్ తేజ్. ఇందులో అర్జున్ అనే సెక్యూరిటీ ఆఫీసర్‌గా వరుణ్ తేజ్ నటించారని, ఓ విపత్తు నుంచి ప్రజలను రక్షించేందుకు అర్జున్ ఎటువంటి సాహసాలు చేశాడు? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం.

హిరణ్య కశ్యపగా రానా


హిరణ్య కశ్యప'లో రానా

రానా హీరోగా 'హిరణ్య కశ్యప' అనే చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'కామిక్ కాన్ – 2023' వేడుకల్లో భాగంగా రానా 'హిరణ్య కశ్యప'ను ప్రకటించారు. దర్శకుడు త్రివిక్రమ్ ఈ సినిమాకు కథ అందిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు రానా ఓ నిర్మాతగా కూడా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. అమర్ చిత్ర కథల ఆధారంగా ఈ చిత్రం రూపొందనుంది. ఇక గతంలో రానాతో 'హిరణ్య కశ్యప' తెరకెక్కిస్తానని గుణశేఖర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మరి.. ఆయన దర్శకత్వం లోనే ఈ 'హిరణ్య కశ్యప' ఉంటుందా? అనేది తెలియాల్సి ఉంది.

ఏలియన్‌ని కాను!


తాప్సీ

ఏలియన్స్‌తో సావాసం చేస్తున్నారు హీరోయిన్ తాప్సీ. ఎందుకంటే ఏలియన్స్‌తో కలిసి తాప్సీ ఓ మిషన్‌లో భాగమయ్యారు. ఈ మిషన్ తాలూకు వివరాలు తెలియడానికి కాస్త టైమ్ పడుతుంది. ఇటీవల హిందీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉంటున్న తాప్సీ ఓ తమిళ సినిమాకు సైన్ చేశారు. ''తమిళంలో నేను చేస్తున్న తాజా సినిమా 'ఏలియన్'. కాన్సెప్ట్ కొత్తగా ఉంటుంది. కానీ ఈ చిత్రంలో నేను ఏలియన్‌గా నటించడం లేదు. తమిళంలో నేను చేసిన 'గేమ్ ఓవర్' (2019) మూవీ నచ్చినవారికి ఈ సినిమా మరింత బాగా నచ్చుతుందనే నమ్మకం నాకుంది. ఈ సినిమా ప్రయాణం నాకు ఓ కొత్త అనుభూతిని ఇస్తోంది'' అని తాప్సీ పేర్కొన్నారు. 2021లో వచ్చిన 'అన్నాబెల్లె సేతుపతి' తర్వాత తాప్సీ అంగీకరించిన తమిళ చిత్రం ఇదే. ఇక హిందీలో 'ఓ లడ్కీ హై కహా', 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా', 'డంకీ' చిత్రాలు చేస్తున్నారు తాప్సీ.

రాముడిగా రణ్‌బీర్.. రావణుడిగా యశ్?


రణ్‌బీర్ కపూర్


ఆలియా భట్


యశ్

భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా ఇప్పటికే పలు చిత్రాలు వచ్చాయి.. ఇంకొన్ని వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రామాయణం ఆధారంగా అల్లు అరవింద్, మధు మంతెన, నమిత్ మల్హోత్రా ఓ సినిమాను నిర్మించనున్నట్లుగా ప్రకటన వచ్చి దాదాపు మూడేళ్లు ముగిసింది. కానీ ఈ సినిమా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. దాంతో ఈ చిత్రం నిలిచిపోయిందా? అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. అయితే అలాంటిదేమీ లేదని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని నిర్మాతలు పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఈ ఏడాది చివర్లో రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించాలని నిర్మాతలు అనుకుంటున్నారన్నది తాజా సమాచారం. ఈ చిత్ర దర్శకుడు నితీష్ తివారి ఈ సినిమా పనులను మరింత వేగవంతం చేశారని బాలీవుడ్‌లో వినిపిస్తోంది. ప్రస్తుతం నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట. రాముడు, సీత, లక్ష్మణుడు, రావణుడు, హనుమంతుడు వంటి ప్రధాన పాత్రలకు ఆర్టిస్టులను ఎంపిక చేసి, లుక్ టెస్ట్‌ను నిర్వహించేందుకు నితీష్ సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా ఆలియా భట్, రావణుడి పాత్రలో యశ్‌లు నటించనున్నారని, ముందు వీరి లుక్ టెస్ట్ జరుగుతుందని టాక్. మరి.. ఈ 'రామాయణం'లో రియల్ లైఫ్ జంట ఆలియా, రణ్‌బీర్ సీతారాములుగా కనిపిస్తారా? 'కేజీఎఫ్'లో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో విజృంభించిన యశ్ ఈ చిత్రంలో రావణుడిగా బీభత్సం సృష్టిస్తారా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

మనసును కదిలించే కథ - సాయికుమార్


శ్రీనివాస్ సాయి, సాయికుమార్, ఆదిత్య ఓం

''నాన్న, అమ్మ ఇచ్చిన స్వరం, సంస్కారంతో నేనీ స్థాయిలో ఉన్నాను. 'నాతో నేను'లో మంచి పాత్ర చేశాను. ప్రేక్షకుల మనసును కదిలించే కథ ఇది'' అని నటుడు సాయి కుమార్ అన్నారు. ఆదిత్యా ఓం, సాయి కుమార్, ఐశ్వర్య, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ సాయి, దీపాలీ రాజ్‌పుత్ కీలక పాత్రల్లో శాంతి కుమార్ తూర్లపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'నాతో నేను'. ప్రశాంత్ టంగుటూరి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో శాంతికుమార్ తూర్లపాటి మాట్లాడుతూ– ''బలమైన నా టీమ్ వల్లే ఈ సినిమాను విడుదల వరకూ తీసుకొచ్చాం'' అన్నారు. ''కరోనా వల్ల మా సినిమా ఆలస్యం అయింది. కానీ మంచి సమయంలో విడుదల చేస్తున్నాం'' అని ప్రశాంత్ టంగుటూరి అన్నారు. నటుడు శ్రీనివాస్ సాయి మాట్లాడారు.

చెప్పరా శివా...


కార్తికేయ

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. క్లాక్స్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నేహా శెట్టి హీరోయిన్. సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 25న రిలీజ్ కానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'భోగమంత యిడువనే యిదువవు వింతగుంది రా, నువెవడివి సొల్లుడా శివా (చెప్పరా శివా)...' అంటూ సాగే రెండో పాటను రిలీజ్ చేశారు. కృష్ణ చైతన్య సాహిత్యం సమకూర్చిన ఈ పాటని అనురాగ్ కులకర్ణి, రోల్ రైడ, పృథ్వీ చంద్ర పాడారు.

కొత్త ప్రపంచంలోకి వెళ్తారు - అశ్విన్



అశ్విన్ బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వంలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ 'హిడింబ'. ఈ సినిమా నేడు (గురువారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో అశ్విన్‌బాబు మాట్లాడుతూ– ''హిడింబ' మంచి సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ఫిల్మ్. ఈ సినిమా కాన్సెప్ట్ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి, సరికొత్త అనుభూతిని ఇస్తుంది. ఇందులో నా లుక్ డిఫరెంట్‌గా ఉంటుంది. నెక్ట్స్ మెడికల్ మాఫియా నేపథ్యంలో ఓ సినిమా, ఓ స్పోర్ట్స్ ఫిల్మ్ చేయబోతున్నాను'' అని అన్నారు.

రిస్క్ చేశా - సాయి రాజేష్



''బేబి'కి నా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ అవుతారనే నమ్మకం ఉండేది. ఈ సినిమా ఫ్లాప్ అవుతుందేమో? అనే భయం కూడా ఉండేది. ఫ్లాప్ అయినా సంగీతం, కెమెరా, నటీనటులు.. ఇలా అందరికీ పేరు వస్తుంది.. కానీ నా కెరీర్ నాశనం అవుతుందని తెలిసినా రిస్క్ చేసి 'బేబి' చేశాను. ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అని డైరెక్టర్ సాయి రాజేష్ అన్నారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ లీడ్ రోల్స్‌లో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ''బేబీ'కి ఆనంద్ కంటే ముందు ముగ్గురు హీరోలను అనుకున్నాం. ఓ హీరో 'హృదయ కాలేయం' డైరెక్టరా? అయితే కథ వినను అన్నాడు. ఆ మాటలు బాధపెట్టాయి. నన్ను నేను నిరూపించుకోవాలని 'బేబి' తీసి, హిట్ కొట్టాను'' అన్నారు.

ఆగస్టులో పేకమేడలు


వినోద్ కిషన్

వినోద్ కిషన్, అనూష క్రిష్ణ జంటగా నీలగిరి మామిళ్ల తెరకెక్కించిన చిత్రం 'పేకమేడలు'. క్రేజీ యాంట్స్‌పై రాకేష్ వర్రే నిర్మించిన ఈ సినిమా ఆగస్టులో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. ''ఒక యూనిక్ స్టోరీలైన్‌తో పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'పేకమేడలు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: వరుణ్ బోర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కేతన్ కుమార్, లైన్ ప్రొడ్యూసర్: అనూష బోర, కెమెరా: హరిచరణ్ .కె, సంగీతం: స్మరణ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	302	67,097
నిఫ్టీ ▲	84	19,833

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,340	▽	11
డోజోన్స్	35,097	▲	145
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,588	▲	135
డాక్స్	16,109	▲	17
షాంఘై	3,199	▲	1
నికాయ్	32,896	▲	402

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	59,756	▲	316
బంగారం (22 క్యారెట్)	59,517	▲	315
వెండి (కిలో)	75,499	▲	318

బ్రిటన్‌లో టాటా గిగాఫ్యాక్టరీ!

ముంబై/లండన్: పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్ తాజాగా బ్రిటన్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) బ్యాటరీల తయారీ కోసం గిగాఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ఏకంగా 4 బిలియన్ పౌండ్లు (సుమారు రూ. 42,500 కోట్లు) వెచ్చించనున్నట్లు తెలిపింది. తమ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) వాహనాలతో పాటు ఇతరత్రా సంస్థల కోసం కూడా ఇందులో బ్యాటరీలను తయారు చేయనున్నట్లు పేర్కొంది. 2026 నుంచి ఈ గిగాఫ్యాక్టరీలో ఉత్పత్తి ప్రారంభం కానుంది. సాధారణంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలో బ్యాటరీల వాటా దాదాపు సగం పైగా ఉంటుంది.

వేల కొద్దీ ఉద్యోగాలకు ఊతం..

గిగాఫ్యాక్టరీపై పెట్టుబడులతో స్థానికంగా 4,000 పైచిలుకు ప్రత్యక్ష ఉద్యోగాలు, సరఫరా వ్యవస్థలో

- ఈవీ బ్యాటరీల ప్లాంటు ఏర్పాటు ప్రణాళిక
- రూ. 42,500 కోట్ల భారీ పెట్టుబడి
- 2026 నుంచి ఉత్పత్తి ప్రారంభం..

పరోక్షంగా వేల మందికి ఉపాధి లభించగలదని బ్రిటన్ ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. 2030 నాటికి తమకు అవసరమయ్యే బ్యాటరీల్లో ఈ ప్లాంటు దాదాపు సగభాగం ఉత్పత్తి చేయగలదని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి మళ్లాలన్న తమ లక్ష్యం మరింత వేగవంతంగా సాకారం కాగలదని వివరించారు.

భారీగా సబ్సిడీలు..

గిగాఫ్యాక్టరీ కోసం బ్రిడ్జ్‌వాటర్ ప్రాంతాన్ని ఎంచుకు



టాటా గ్రూప్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

న్నట్లు జేఎల్ఆర్ మాతృ సంస్థ టాటా సన్స్ తెలిపింది. 40గిగావాట్‌అవర్స్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యంతో ఇది యూరప్‌లోని భారీ గిగాఫ్యాక్టరీల్లో ఒకటిగాను, భారత్‌కు వెలుపల టాటా గ్రూప్‌నకు తొలి భారీ గిగాఫ్యాక్టరీగా నిలవనుంది. 1980ల్లో నిస్సాన్ రాక తర్వాత బ్రిటన్ ఆటోమోటివ్ రంగంలో ఇది అత్యంత భారీ పెట్టుబడి కానుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం టాటా గ్రూప్‌నకు ప్రభుత్వం నుంచి వందల కొద్దీ మిలియన్ పౌండ్ల మేర ప్లాంటుకు సబ్సిడీల హామీ లభించి ఉంటుందని పేర్కొన్నాయి. విద్యుత్, గ్రాంటు, సైటుకు రహదారిని మెరుగుపర్చటం తదితర రూపాల్లో 500 మిలియన్ పౌండ్ల మేర సబ్సిడీలు అందించాలని ప్రభుత్వాన్ని టాటా గ్రూప్ కోరినట్లు సమాచారం. అయితే, ఇటు టాటా గ్రూప్, అటు బ్రిటన్ ప్రభుత్వం దీనిపై వివరణ ఇవ్వలేదు. పారదర్శక విధానాల్లో భాగంగా వీటిని తర్వాత ప్రచురించనున్నట్లు బ్రిటన్ ప్రభుత్వం పేర్కొంది. బ్రిటన్‌లో ప్రస్తుతం ఒక్క బ్యాటరీల తయారీ ప్లాంటు ఉంది. కొత్తగా మరో ఫ్యాక్టరీ ఏర్పాటుపై కసరత్తు జరుగుతోంది. మరోవైపు యూరోపియన్ యూనియన్‌లో 35 పైచిలుకు ప్లాంట్లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని ఇప్పటికే పనిచేస్తుండగా, కొన్ని నిర్మాణంలోనూ, కొన్ని ప్రతిపాదనల దశల్లోనూ ఉన్నాయి.

అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు..

'బిలియన్ల కొద్దీ పౌండ్ పెట్టుబడులు, అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేసే ప్లాంటు.. ఆటోమోటివ్ రంగం ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు వేగవంతంగా మళ్లేందుకు తోడ్పడగలదు. ఇప్పటికే బ్రిటన్‌లో వివిధ రంగాల్లో మా కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. బ్రిటన్‌లో పెట్టుబడులకు కట్టుబడి ఉన్నామని తెలిపేందుకు తాజా ఇన్వెస్ట్‌మెంట్ నిదర్శనం' అని టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ తెలిపారు. 'భారత్‌కు వెలుపల తమ తొలి భారీ ఫ్యాక్టరీని ఇక్కడ నెలకొల్పాలని టాటా గ్రూప్ నిర్ణయం తీసుకోవడమనేది బ్రిటన్ కార్ల తయారీ పరిశ్రమ, నిపుణులపై వారికి ఉన్న నమ్మకానికి నిదర్శనం. మా ఆటోమోటివ్ రంగంలో అత్యంత భారీ పెట్టుబడుల్లో ఇది కూడా ఒకటిగా నిలవనుంది'

– బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

ఎంసీఏ21 పోర్టల్‌పై ఒక్కరికి ఒక్కటే ఐడీ



న్యూఢిల్లీ: ఏదైనా కంపెనీ సెక్రటరీ, చార్టర్డ్ అకౌంటెంట్ లేదా కాస్ట్ అకౌంటెంట్ ఎంసీఏ21 పోర్టల్‌పై ఒక్కటే ఐడీ కలిగి ఉండాలని కార్పొరేట్ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ఒకరికి ఒకటికి మించిన ఐడీలు ఉంటే వాటిని డీయాక్టివేట్ చేస్తున్నట్లు ప్రకటించింది. కంపెనీలు, ఎల్ఎల్‌పీ చట్టాల కింద చట్టబద్ధమైన పత్రాలను ఎంసీఏ21 పోర్టల్‌పైనే దాఖలు చేస్తుంటారు. ఒకటికి మించి ఐడీలు కలిగిన వృత్తి నిపుణులు చట్టబద్ధమైన సంస్థ నుంచి ఆమోదం పొందాలని, ఒక యూజర్‌కు ఒక్కటే ఐడీ ఉండాలంటూ కార్పొరేట్ శాఖ సర్క్యులర్ జారీ చేసింది.

భారత్‌బెంజ్, రిలయన్స్ జట్టు

హైడ్రోజన్ ఇంధన బస్సు ఆవిష్కరణ



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్‌బెంజ్ కలిసి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడిచే తొలి దేశీ ఇంటర్‌సిటీ లగ్జరీ కాన్సెప్ట్ బస్సును ఆవిష్కరించాయి. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ వినియోగ లాభదాయకతను అధ్యయనం చేసేందుకు ఇది ఉపయోగపడనుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశీయంగా తయారు చేసిన హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీని తగు విధంగా మార్పులు, చేర్పులు చేసిన భారత్‌బెంజ్ బస్సులో ఉపయోగిస్తారు. ఒకసారి హైడ్రోజన్‌ను నింపిన తర్వాత ఈ ఇంటర్‌సిటీ బస్సు 400 కి.మీ. వరకు ప్రయాణించగలదని రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో (న్యూ మొబిలిటీ విభాగం) నితిన్ సేత్ తెలిపారు. వచ్చే 12 నెలల్లో ఈ బస్సుతో విస్తృతంగా అధ్యయనం చేయనున్నట్లు వివరించారు.

అయిదో రోజూ అన్‌స్టాప'బుల్'

- 67 వేల స్థాయిపైకి సెన్సెక్స్
- 19,800 ఎగువకు నిఫ్టీ
- ఐటీ షేర్లకు మాత్రమే నష్టాలు

ముంబై: స్టాక్ మార్కెట్ సరికొత్త రికార్డులను సృష్టిస్తూ పరుగులు పెడుతోంది. ప్రోత్సాహకర కార్పొరేట్ క్యూ1 ఆదాయాలు, మెరుగైన స్థూల ఆర్థిక డేటా దన్నుతో స్టాక్ సూచీలు అయిదో రోజూ ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. అధిక వెయిటేజీ రిలయన్స్, ఐటీసీ షేర్లు రాణించడమూ కలిసొచ్చాయి. ఉదయం సెన్సెక్స్ 110 పాయింట్ల లాభంతో 66,905 వద్ద, నిఫ్టీ 54 పాయింట్లు పెరిగి 19,803 వద్ద మొదలయ్యాయి. తొలి సెషన్‌లో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో సూచీలు కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే యూరప్ మార్కెట్ల సానుకూల ప్రారంభంతో ఒక్కసారిగా సెంటిమెంట్ మారింది. ఐటీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బ్యాంకింగ్, ఆర్థిక, ఎఫ్ఎంసీజీ షేర్లకు భారీగా డిమాండ్ నెలకొంది. ఫలితంగా ఒక దశలో సెన్సెక్స్ 376 పాయింట్లు పెరిగి 67,171 వద్ద, నిఫ్టీ 102 పాయింట్లు బలపడి 19,852 వద్ద కొత్త జీవితకాల గరిష్టాలను నమోదు చేస్తాయి. చివరికి సెన్సెక్స్ 302 పాయింట్ల లాభంతో 67,097 వద్ద ముగిసింది. నిఫ్టీ మార్కెట్ ముగిసేసరికి 84 పాయింట్లు బలపడి 19,833 వద్ద స్థిరపడింది. లార్జ్ క్యాప్ షేర్లతో పాటు చిన్న, మధ్య తరహా షేర్లూ రాణించాయి. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,165 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,135 షేర్లు అమ్మేశారు. డాలర్ రికవరీ, క్రూడాయిల్ ధరలు బలపడటంతో రూపాయి విలువ నాలుగు పైసలు నష్టపోయి 82.08 స్థాయి



స్థిరపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరుకుంది. బీఎస్ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.304.53 లక్షల కోట్లకు చేరింది.
- ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ షేరు మూడో రోజూ రాణించింది. ఇంట్రాడేలో 1.15% పెరిగి రూ.2,855 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి 0.62 శాతం పెరిగి రూ.2,840 వద్ద స్థిరపడింది. గడిచిన 3 రోజుల్లో ఈ షేరు 3.69% లాభపడింది.
- తొలి త్రైమాసికంలో మొండి రుణాలు తగ్గడం పాటు వడ్డీ ఆదాయం పుంజుకోవడంతో ఇండస్ఇండ్ షేరును కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ట్రేడింగ్‌లో నాలుగుశాతం ర్యాలీ చేసి రూ.1,443 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివరికి రెండు శాతం పెరిగి రూ.1,419 వద్ద ముగిసింది.

నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఐపీవో సక్సెస్

90 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్

హైఎండ్ కంప్యూటింగ్ సొల్యూషన్స్ అందించే నెట్‌వెబ్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ చివరి రోజు బుధవారానికల్లా 90 రెట్లుపైగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. ప్రధానంగా అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 229 రెట్లు బిడ్స్ దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 82 రెట్లు, రిటైలర్ల నుంచి 19 రెట్లు అధికంగా దరఖాస్తులు లభించాయి. వెరసి కంపెనీ 88.58 లక్షల షేర్లను ఆఫర్ చేయగా.. 80 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ వెల్లువెత్తాయి.

స్థానిక వినియోగమే భారత్‌కు బలం

ప్రపంచబ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మందగమనం చూస్తున్న తరుణంలో, దేశీ వినియోగమే భారత్ ఆర్థిక వ్యవస్థకు సహజ ప్రేరణగా నిలుస్తోందని ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగా అభిప్రాయపడ్డారు. భారత్ జీడీపీ అధిక శాతం దేశీయ డిమాండ్‌పైనే ఆధారపడి ఉన్నట్లు చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో అజయ్ బంగా బుధవారం సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. జీ20కి సంబంధించిన అంశాలు, ప్రపంచబ్యాంక్, భారత్ మధ్య సహకారంపై ఆర్థిక మంత్రితో చర్చించినట్టు చెప్పారు. "జీ20లో ఏం చేశామన్నది, అలాగే సమావేశం ఎలా కొనసాగిందన్నది మాట్లాడుకున్నాం. జీ20లో భాగంగా ప్రపంచబ్యాంక్, భారత్ ఇంకా ఏం చేయగలవన్నదీ చర్చించాం. ప్రపంచబ్యాంక్‌కు పోర్ట్‌ఫోలియో పరంగా భారత్ అతిపెద్ద మార్కెట్‌గా ఉంది.



ఈ మార్కెట్‌పై ఎంతో ఆసక్తి నెలకొంది" అని బంగా వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పనితీరుపై మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఆరంభంలో మరింత క్షీణించేందుకు రిస్కులు ఉన్నట్టు చెప్పారు. "భారత్ జీడీపీలో అధిక భాగం దేశీయ వినియోగం నుంచే సమకూరుతోంది. కనుక ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరికొన్ని నెలల పాటు నిదానించినా, దేశీ వినియోగంతో భారత్ బలంగా నిలబడుతుంది" అని బంగా పేర్కొన్నారు. జీ20 సమావేశంలో పాల్గొనేందుకు గాను భారత సంతతికి చెందిన అజయ్ బంగా ఇక్కడకు విచ్చేశారు. గత నెలలోనే ఆయన ప్రపంచబ్యాంక్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. అనంతరం భారత్ పర్యటనకు తొలిసారి విచ్చేశారు. విజ్ఞానం, టెక్నాలజీ అంతరాలను తగ్గించడమనేది భవిష్యత్ ఆర్థిక వృద్ధికి కీలకమని ఆర్థిక మంత్రి సీతారామన్ అన్నట్టు బంగా తెలిపారు.

టాటా కమ్యూనికేషన్స్ లాభం వీక్

క్యూ1లో రూ. 382 కోట్లు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కంపెనీ టాటా కమ్యూనికేషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 30 శాతం క్షీణించి రూ. 382 కోట్లకు పరిమితమైంది. అధిక వడ్డీ వ్యయాలు, తగ్గిన పన్ను లాభాలు ప్రభావం చూపాయి.



అయితే మొత్తం ఆదాయం 11 శాతం ఎగసి రూ. 4,711 కోట్లకు చేరింది. డేటా బిజినెస్ నుంచి 17 శాతం అధికంగా రూ. 3,912 కోట్ల ఆదాయం లభించింది. అయితే డేటా బిజినెస్ నిర్వహణ లాభం(ఇబిటా) 4 శాతం తక్కువగా రూ. 929 కోట్లను తాకింది.

ఫలితాల నేపథ్యంలో టాటా కమ్యూనికేషన్స్ షేరు 1 శాతం బలపడి రూ. 1,618 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఐఎన్, పుణెలో 14 పోస్టులు

పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి(ఎన్ఐఎన్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 14

» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-03, అసోసియేట్ ప్రొఫెసర్-03, అసిస్టెంట్ ప్రొఫెసర్-05, మెడికల్ సూపరింటెండెంట్-01, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్-01, రీసెర్చ్ ఆఫీసర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి బీఎన్‌వైఎస్/పీజీ డిగ్రీ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 40 నుంచి 50 ఏళ్ల ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ. 2,15,900 చెల్లిస్తారు. »**ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.09.2023.
» **వెబ్‌సైట్:** www.ninpune.ayush.gov.in

యూసీఐఎల్, జార్ఖండ్‌లో 122 గ్రూప్ ఎ, బి పోస్టులు

జార్ఖండ్ రాష్ట్రం జాదుగూడ మైన్స్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్).. గ్రూప్ ఎ, బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 122(గ్రూప్ ఎ-44, గ్రూప్ బి-78) » **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్, అడిషనల్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్, చీఫ్ సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్, మేనేజర్, కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్, సూపర్‌వైజర్, ఫోర్‌మ్యాన్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, డిగ్రీ, పీజీ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష,గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.08.2023.
» **వెబ్‌సైట్:** https://ucil.gov.in

జేఎన్ఏఎఫ్ఏ యూనివర్శిటీలో ఎంఎఫ్ఏ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ (జేఎన్ఏఎఫ్ఏ).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో.. మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రోగ్రామ్(ఫుల్‌టైం-సెల్ఫ్ ఫైనాన్స్)లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

కోర్సులు, సీట్లు వివరాలు

» ఎంఎఫ్ఏ(అప్లైడ్ ఆర్ట్ అండ్ విజువల్ కమ్యూనికేషన్)-20సీట్లు. »ఎంఎఫ్ఏ(పెయింటింగ్ అండ్ విజువల్ కమ్యూనికేషన్)-15 సీట్లు. » ఎంఎఫ్ఏ(ఫోటోగ్రఫీ అండ్ మీడియా కమ్యూనికేషన్) -15 సీట్లు. » ఎంఎఫ్ఏ(స్కల్ప్చర్)-06 సీట్లు.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఎఫ్ఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష,ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 11.08.2023.
» **రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 18.08.2023.
» **వెబ్‌సైట్:** www.jnafau.ac.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, ఫైన్ ఆర్ట్స్ విభాగం.. తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **అర్హత:**మాస్టర్స్ డిగ్రీ(స్కల్ప్చర్/ప్రింట్ మేకింగ్),ఎంఎఫ్ఏ/ఎంవీఏ(ఆర్ట్ హిస్టరీ అండ్ విజువల్ స్టడీస్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. » **వేతనం:**నెలకు రూ.50,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** headfinearts@uohyd.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 24.07.2023.
» **వెబ్‌సైట్:** uohyd.ac.in

ద్రవిడియన్ యూనివర్శిటీలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయం.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్, సీఎస్ఐఆర్ నెట్, గేట్, సీఈఈడీ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హతతోపాటు జాతీయ స్థాయి పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీతో పాటు యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్, సీఎస్ఐఆర్ నెట్, గేట్, సీఈఈడీ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత సాధించినవారితో పాటు జాతీయ స్థాయి పరీక్షల్లో అర్హత సాధించి ఉండాలి.
» **దరఖాస్తుల విక్రయం:** 12.07.2023 నుంచి 21.07.2023 వరకు
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.07.2023
» **వెబ్‌సైట్:** www.dravidianuniversity.ac.in

నెక్స్ట్‌లో.. నెగ్గితేనే!

» నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ నిర్వహణకు ఎన్ఎంసీ నిర్ణయం
» ఎంబీబీఎస్ ఫైనల్ ఎగ్జామ్స్ బదులుగా నెక్స్ట్
» 2025 నుంచి నిర్వహించే అవకాశం
» ప్రాక్టీస్ లైసెన్స్, పీజీ ప్రవేశాలకూ నెక్స్ట్‌లో ఉత్తీర్ణతే మార్గం
» అందుబాటులో నెక్స్ట్-1.. మాక్ టెస్ట్‌లు

నేషనల్ ఎగ్జిట్ ఎగ్జామ్..సంక్షిప్తంగా నెక్స్ట్! ఎంబీబీఎస్ ఫైనల్.. నీట్-పీజీ ఎంట్రన్స్.. ఎఫ్ఎంజీఈల స్థానంలో.. ఉమ్మడి పరీక్షగా నెక్స్ట్‌ను నిర్వహించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ).. రంగం సిద్ధం చేసింది. వచ్చే ఏడాది నుంచి నెక్స్ట్‌ను నిర్వహించనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేసింది! నెక్స్ట్‌పై అవగాహన కల్పించేలా మాక్ టెస్ట్ సదుపాయం కూడా అందుబాటులోకి తెచ్చింది! ఈ నేపథ్యంలో.. నెక్స్ట్ ఉద్దేశం, పరీక్ష విధానం, ఈ పరీక్షతో ప్రయోజనాలు తదితర వివరాలు..

ప్రస్తుతమున్న విధానం ప్రకారం-దేశంలో ఎంబీబీఎస్ కోర్సుల విద్యార్థులు యూనివర్సిటీలు నిర్వహించే ఫైనల్ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఆ తర్వాత ఉన్నత విద్యపై ఆసక్తి ఉంటే పీజీ కోర్సుల కోసం నీట్-పీజీలో అర్హత పొందాలి. అదే విధంగా విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. భారత్‌లో ఉన్నత విద్య, ప్రాక్టీస్‌కు అనుమతి కోసం ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)లో ఉత్తీర్ణత సాధించాలి. ఎంబీబీఎస్ అభ్యర్థులు ఇలా అనేక పరీక్షలకు హాజరయ్యే బదులు.. 'ఉన్నత' అవకాశాలన్నింటినీ.. ఒకే పరీక్ష ద్వారా సాకారం చేసుకునేందుకు ఎన్ఎంసీ ప్రతిపాదించిన పరీక్ష.. నెక్స్ట్.

మార్గదర్శకాలు ఇలా

- నేషనల్ ఎగ్జిట్ టెస్ట్‌కు సంబంధించి ఎన్ఎంసీ తాజాగా మార్గదర్శకాలు విడుదల చేసింది. 'ఎన్ఎంసీ, నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ రెగ్యులేషన్స్-2023' పేరుతో నియమ, నిబంధనలను పేర్కొంటూ.. గెజిట్ ప్రకటన ఇచ్చింది.
- ఎన్ఎంసీ మార్గదర్శకాల ప్రకారం-ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు, విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని భారత్‌లో ప్రాక్టీస్, అలాగే ఉన్నత విద్యలో అడుగు పెట్టాలనుకుంటున్న విద్యార్థులు.. పీజీ మెడికల్ కోర్సుల్లో చేరాలనుకుంటున్న అభ్యర్థులు.. వీరంతా నెక్స్ట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- అంటే.. ఇకపై ఎంబీబీఎస్ ఫైనల్ ఎగ్జామ్స్ ఉండవు, నీట్-పీజీ ఎంట్రన్స్ ఉండదు, ఎఫ్ఎంజీఈ కూడా ఉండదు. ఈ మూడు పరీక్షలకు బదులు ఒకే ఒక పరీక్ష నెక్స్ట్‌లో నెగ్గితే సరిపోతుందని ఎన్ఎంసీ వర్గాలు పేర్కొంటున్నాయి.

వచ్చే ఏడాది నుంచే.. కానీ వాయిదా

- ఎన్ఎంసీ తాజా మార్గదర్శకాల ప్రకారం-వచ్చే ఏడాది(2024) నుంచే నెక్స్ట్ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. అంటే.. ప్రస్తుతం ఎంబీబీఎస్ ఫైనల్‌లో ఉన్న విద్యార్థులు.. ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతోపాటు, ఉన్నత విద్య, ప్రాక్టీస్‌కు అనుమతి కోసం నెక్స్ట్‌లో ఉత్తీర్ణత సాధించేలా నిబంధనలను విడుదల చేశారు.
- కాని ఆయా వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో.. నెక్స్ట్-2024ను ప్రస్తుతానికి వాయిదా వేశారు. ఈ ఏడాది ఫైనలియర్‌లో ఉన్న వారు నెక్స్ట్ రాయనక్కర్లేదు. ఇప్పుడు ఎంబీబీఎస్ మూడో సంవత్సరంలో ఉన్న విద్యార్థులు.. 2025లో నెక్స్ట్ రాయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

స్టెప్-1, స్టెప్- 2గా

- నెక్స్ట్‌ను నెక్స్ట్-1, నెక్స్ట్-2 పేరుతో రెండు దశలుగా నిర్వహించనున్నారు.
- నెక్స్ట్ స్టెప్-1.. ఎంబీబీఎస్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి థియరీ ఎగ్జామ్‌గా ఉంటుంది.
- నెక్స్ట్ స్టెప్-1లో ఉత్తీర్ణతతోపాటు.. ఎంబీబీఎస్ తర్వాత ఇంటర్న్‌షిప్(ఏడాది వ్యవధిలో ఉండే) పూర్తి చేసుకున్న వారికి నెక్స్ట్ స్టెప్-2కు అర్హత లభిస్తుంది.

ఏటా రెండుసార్లు

- నెక్స్ట్ ఎగ్జామ్‌ను ప్రతి ఏటా రెండుసార్లు.. మే, నవంబర్‌ల్లో నిర్వహిస్తారు. ఎంబీబీఎస్‌లో చేరిన పదేళ్లలోపు.. ఎన్నిసార్లయినా నెక్స్ట్‌కు హాజరు కావచ్చు. నెక్స్ట్ స్టెప్-2లో ఉత్తీర్ణత సాధించాక.. నెక్స్ట్ స్టెప్-1లో స్కోర్ పెంచుకునేందుకు.. స్టెప్-1 పరీక్షను మళ్లీ రాయొచ్చు.
- నెక్స్ట్ స్టెప్-2లో..సప్లిమెంటరీ ఎగ్జామ్ విధానం అమలు చేస్తారు. స్టెప్-2 పరీక్షకు పేర్కొన్న ఏడు సబ్జెక్ట్‌లలో.. ఏదో ఒక దాంట్లో ఫెయిల్ అయిన వారు స్టెప్-2 సప్లిమెంటరీకి హాజరు కావచ్చు.
- స్టెప్-2లో మూడు కంటే ఎక్కువ సబ్జెక్ట్‌లలో ఫెయిలైతే మాత్రం.. స్టెప్-2 సప్లిమెంటరీ పరీక్షలో మొత్తం ఏడు సబ్జెక్ట్‌లకు హాజరై ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

50 శాతం మార్కులతో ఉత్తీర్ణత

- నెక్స్ట్ స్టెప్-1, స్టెప్-2 పరీక్షల్లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. పీజీ ప్రవేశాలకు నెక్స్ట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోనున్న క్రమంలో.. నెక్స్ట్ స్టెప్-1 స్కోర్‌కు అయిదేళ్ల పాటు గుర్తింపు ఉంటుంది. ఒకవేళ అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువసార్లు స్టెప్-1కు హాజరైతే.. తాజా స్కోర్‌ను మాత్రమే పీజీ ప్రవేశాలకు పరిగణనలోకి తీసుకుంటారు.
- నెక్స్ట్ ద్వారా ఎంబీబీఎస్ అభ్యర్థులు సొంతం చేసుకున్న థియరీ, ప్రాక్టికల్ నైపుణ్యాలను తెలుసుకునేలా పరీక్ష ఉంటుంది. నెక్స్ట్ స్టెప్-1ను థియరీ పరీక్షలుగా, నెక్స్ట్ స్టెప్-2ను ప్రాక్టికల్ పరీక్షలుగా నిర్వహించనున్నారు.



మెడికల్ స్పెషల్

నెక్స్ట్ స్టెప్-1.. ఆరు పేపర్లుగా

- నెక్స్ట్ స్టెప్-1 పరీక్షను ఎంబీబీఎస్ మూడో సంవత్సరం, అదే విధంగా ఎంబీబీఎస్ ఫైనల్ పార్ట్-1, పార్ట్-2లలోని సబ్జెక్ట్‌ల నుంచి నిర్వహిస్తారు. నెక్స్ట్ స్టెప్-1 సబ్జెక్టుల వివరాలు..- మెడిసిన్ అండ్ అల్లైడ్ సబ్జెక్ట్స్ 120 ప్రశ్నలు-పరీక్ష సమయం 3 గంటలు; సర్జరీ అండ్ అల్లైడ్ సబ్జెక్ట్ 120 ప్రశ్నలు-పరీక్ష సమయం 3 గంటలు; ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ 120 ప్రశ్నలు-పరీక్ష సమయం 3 గంటలు; పీడియాట్రిక్స్ 60 ప్రశ్నలు-పరీక్ష సమయం 1.5 గంటలు; ఆటోర్హినోలరీగాలజీ 60 ప్రశ్నలు-పరీక్ష సమయం 1.5 గంటలు; ఆప్తాల్మాలజీ 60 ప్రశ్నలు-పరీక్ష సమయం 1.5 గంటలుగా ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కుల విధానం ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కు తగ్గిస్తారు.

ప్రాక్టికల్.. క్లినికల్ నైపుణ్యాలు

నెక్స్ట్ స్టెప్-2 పరీక్ష.. ప్రాక్టికల్, క్లినికల్ నైపుణ్యాలను పరీక్షించేలా ఉంటుంది. ఈ పరీక్షను పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం ఏడు సబ్జెక్ట్‌లలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తారు. అవి.. » మెడిసిన్ అండ్ అల్లైడ్ సబ్జెక్ట్స్ » సర్జరీ అండ్ అల్లైడ్ సబ్జెక్ట్స్ » ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ » పీడియాట్రిక్స్ » ఆటోర్హినోలరీగాలజీ » ఆప్తాల్మాలజీ » ఆర్థోపెడిక్స్ అండ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్. » వీటితోపాటు వైవా-వోస్ పేరిట మౌఖిక పరీక్ష కూడా నిర్వహిస్తారు.

నెక్స్ట్‌పై.. భిన్నాభిప్రాయాలు

నెక్స్ట్‌పై భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఎంబీబీఎస్‌కు ఉమ్మడి ఫైనల్ పరీక్షగా నెక్స్ట్‌ను నిర్వహించాలనే నిర్ణయంపై వ్యతిరేకత కనిపిస్తోంది. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో ఫైనల్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు..నెక్స్ట్ కారణంగా జాతీయ స్థాయిలో పోటీ పడాల్సి ఉంటుంది.దీంతో నష్టపోతామనే అభిప్రాయం విద్యార్థుల్లో నెలకొంది. నీట్-పీజీ స్థానంలో నెక్స్ట్ స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకునే నిర్ణయంపైనా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నీట్-పీజీ పరీక్ష విధానాన్ని, క్లిష్టతను దృష్టిలో పెట్టుకుని ఆ స్థాయిలోనే నెక్స్ట్ పేపర్‌ను రూపొందిస్తారని,కాబట్టి ఇందులో ఉత్తీర్ణత సాధించడం కష్టంగా మారుతుందనే వాదనా వినిపిస్తోంది.

కొత్త విధానానికి మళ్లడం కష్టంగా

ఇప్పటి వరకు తాము యూనివర్సిటీ స్థాయి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని సన్నద్ధత పొందుతున్నామని.. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే నెక్స్ట్ స్టెప్-1ను నిర్వహిస్తే.. ఇబ్బందులు ఎదురవుతాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. అదే విధంగా.. నీట్-పీజీ కోసం మూడో ఏడాది నుంచే కష్టపడుతున్నామని.. ఇలాంటి తరుణంలో నెక్స్ట్‌ను నిర్వహిస్తే.. ఒక్కసారిగా అభ్యసన విధానాన్ని మార్చుకోవడం కష్టంగా ఉంటుందని మరికొందరు విద్యార్థులు చెబుతున్నారు.

నెక్స్ట్ క్యాలెండర్ ఇలా

- **నెక్స్ట్ స్టెప్-1 పరీక్ష:** మే, నవంబర్‌లలో
- **ఫలితాలు:** జూన్, డిసెంబర్ మొదటి వారంలో
- **నెక్స్ట్ స్టెప్-2 పరీక్ష:** జూన్, డిసెంబర్ మూడో వారంలో
- **ఫలితాలు:** జూన్, డిసెంబర్ నాలుగో వారంలో
- **పీజీ ప్రవేశాలు:** మే లేదా జూన్‌లో కౌన్సెలింగ్

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.


Hyundai EXTER.
కొత్త ప్రయాణం, కొత్త గమ్యం.
ఆరంభపు ధర
₹5 99 900*
6 ఎయిర్‌బ్యాగ్స్ స్టాండర్డ్
40+ ఆధునిక భద్రతా ఫీచర్స్
Best in segment
60+ బ్లూ లింక్ ఫీచర్స్‌తో 20.32 సెం.మీ (8) HD ఇన్ఫోటైన్మెంట్
Best in segment
కావలసినంత హెడ్‌రూమ్, నీ రూమ్ మరియు లెగ్ రూమ్‌తో విశాలమైన కేబిన్
1st in segment
వాయిస్ సదుపాయం గల స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్
1st in segment
డ్యూయల్ కెమెరాతో డాష్‌క్యామ్
• 1.2 l కప్పా పెట్రోల్ ఇంజన్
• MT & AMT
• ప్యాడల్ షిఫ్టర్స్
• క్రూయిజ్ నియంత్రణ
4 సిలిండర్ ఇంజన్
పవర్-ప్యాక్డ్ పెర్ఫార్మెన్స్
• స్టైలిష్
• విశాలమైనది
• కనక్టెడ్
HYUNDAI
To know more, WhatsApp us on
8447228019
my Hyundai app
Hyundai ClicktoBuy
3 YEAR Unlimited** Kilometer Warranty
UPTO 7 YEARS Extended Warranty^
3 YEAR Road Side Assistance (RSA)*
UPTO 5 YEARS Shield of Trust Running Repair Package*
UPTO 5 YEARS Shield of Trust Super Maintenance Package*
Lowest cost of maintenance##
Bluelink
For Information Contact: Toll Free: 1800114645 Telangana: Karim Nagar: Sasya Hyundai, Ph: 9550077566 Hyderabad/Secunderabad: Lakshmi Hyundai, Himayath Nagar Ph: 7331119964, Madinaguda Ph: 8096666386, Malakpet, Ph: 8096666367 LB Nagar, Ph: 8096666428 KPHB-manjeera Trinity Ph: 8096666325, Erragadda PH: 7331124158, Attapur, Ph: 8096666332 Fusion Hyundai, Bowenpally Ph: 7330772222, Tirumalghery Ph: 9154953048 Kun United Hyundai, Lakadikapul Ph: 7997770045 ECIL X Roads, Ph: 7997770051 Hitech City, Ph: 7997770049 Shaikpet, Ph: 7997770046 Gachibowli, Ph: 7997770048 Bharat Hyundai, Financial District Gachibowli, Ph: 7733888999 Neon Hyundai, SP Road Ph: 8008004996, Dwaraka Hyundai, Boduppal Ph: 7337331720 JSP Hyundai, Jubilee Hills Ph: 8882101010, JSP Hyundai, Banjara Hills Ph: 8882101010, Geetha Hyundai, Mettuguda, Ph: 7995052748 Khammam: Bharat Hyundai, Ph: 7733888999, Kothagudem Ph: 7032153153 Mahabubnagar: Trend Hyundai, Ph: 7660022382, Nalgonda: Sansai Hyundai, Ph: 9160079966 Nirmal: Prakash Hyundai, Ph: 9052110404 Nizamabad: Prakash Hyundai, Ph: 9052116511 Warangal: Hema Hyundai, Ph: 8008204442, Neon Hyundai, Hanmakonda, Ph: 8186081868 AP: Anantapur: Kun United Hyundai, Ph: 9885289069 Bhimavaram: Kusalava Hyundai, Ph: 9866175390 Chittoor: RK Hyundai, Ph: 9533873666 Guntur: Kusalava Hyundai, Ph: 9866672302 Kadapa: MDH Hyundai, Ph: 8886112111 Kurnool: Kun United Hyundai, Ph: 9160114474 Nellore: Kun Hyundai, Ph: 9849549222 Ongole: Sri Chakra Hyundai, Ph: 9949096708 Rajahmundry: Lakshmi Hyundai, Ph: 8096666410 Tirupati: RK Hyundai, Ph: 9885234307 Vijayawada: Kusalava Hyundai, Labbipet, Ph: 9985374311, Autonagar, Ph: 7997966434 Sai Swarna Hyundai, Ramavarappadu Ring Road, Ph: 9581251234 Lucky Hyundai, Enikepadu Ph: 7799916789 Vishakapatnam: Lakshmi Hyundai, CBM Compound, Ph: 8096666558 Mango Hyundai, PM Pallem, Opp Dr. YSR Stadium, Ph: 8099000666 Srikakulam: Mango Hyundai, Pedapadu Road, Ph: 8099000666 Gajuwaka: Lakshmi Hyundai, 8096666518 Vizianagaram: Lakshmi Hyundai, Ph: 8096666550 Kakinada: Sai Swarna Hyundai, Ph: 8186941234
INNOCEAN-046/23 TEL